
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్

సంపుటి 19 - సంచిక 03
**ఆగస్టు 2014**

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**

## భరతమాత

భరతమాత చీరకొంగు ధవళకాంతులను వెదజల్లే తెల్లని హిమశిఖరములు మొదలుకొని పచ్చతనముతో కళకళలాడుతూ ఉండే కేరళ వరకు వ్యాపించి ఉన్నది. మాత తన 125 కోట్ల సంతానమును ఒడిలో కూర్చోబెట్టుకున్నది. సమస్తజాతులు, అన్ని వర్ణములు, వంశములన్నీ ఈ తల్లి గర్భమునుండే జన్మించాయి. మాత తన గుండెను చీల్చి సమస్త జనుల పోషణ వ్యవస్థకు కావలసిన ఏర్పాట్లను కావించినది. సంతానము యొక్క సుఖమే ఈ తల్లి సుఖము. సంతానము యొక్క బాధే ఈ తల్లి బాధ!

ప్రేమమూర్తియైన ఈ జనని తన పుత్రుల కొరకు, పుత్రికల కొరకు ఎన్నో బాధలను సహించింది. పరాయివారు కొట్టిన దెబ్బలు ఆమెకు కష్టమును కలిగించాయే కాని, ఆమె ధైర్యమును సడలించలేకపోయినాయి.

తన స్వీయ సంతానమే మీర్‌జాఫర్, జయచంద్ వలె మారి తన మీద దాడిచేసినప్పుడు క్షమకు మారుపేరయిన ఈ తల్లి బిగ్గరగా రోదించినది, బాధతో విలవిలలాడింది. తల్లి మమతను వంచించారు, ఆమె భావాలను దెబ్బతీశారు మరియు ఆమె మాతృత్వము తలవంచుకునేలా చేశారు. ఇప్పుడు కూడా క్రూరమైన దుష్కృత్యములకు పాల్పడుతున్నారు. తత్కారణముగా ధైర్యరూపిణియైన ఈ జనని సాహసము ఏడుస్తున్నది. ఎవరికి చెప్పుకోవాలి? తన బాధను ఎవరితో పంచుకోవాలి? తన వ్యధను ఎలా వెళ్ళగ్రక్కాలి? అన్న విషయము తెలియడము లేదు.

తల్లిని బాధపెట్టినవారే కాదు భరతమాతకు సుపుత్రులకు, సుపుత్రికలకు సైతము కొదవలేదు. వీరశివాజీ, మహాపరాక్రమవంతుడైన రాణాప్రతాప్, ఝాన్సీలక్ష్మీబాయి; ఆమె కీర్తిని దిగ్దిగంతాలకు వ్యాపింపజేసిన వివేకానంద, మాతృభూమి కొరకు తమ సుఖములను త్యాగము చేసిన సుభాష్‌చంద్రబోస్, గాంధీ; మాతృ దుఃఖమును రూపుమాపుటకు సదా-సర్వదా తపస్సులో మునిగిపోయిన యుగఋషి శ్రీరామశర్మఆచార్య వంటి మాతృభక్తులే ఆమెను బానిసత్వమునుండి విముక్తిని కలిగించి గౌరవాన్వితురాలిని చేశారు. తన మాతృత్వము యొక్క గౌరవమును కాపాడమని, తన చీరచెరగు యొక్క అఖండతను నిలిపి ఉంచాలంటూ ఈనాడు మాత తన సంతానము యొక్క సంవేదలను ఎలుగెత్తి పిలుస్తున్నది.

– *అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ఇతరులు చూపించే జాలి మనకు ఎందుకు ఉపయోగపడదు**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** భరతమాత 3

2. **విషయసూచిక–సద్గురువాణి :** ప్రకృతిమాత 4

3. **వేదమంత్రం :** సఫలతకు రాజమార్గం 5

4. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర – 26 :** దీక్షాభూమికి యాత్ర – 3 6

5. **కుండలినీ మహావిజ్ఞానం–12 :** కుండలిని – ఒక ప్రచండ ప్రాణ ఊర్జ 10

6. **శ్రావణమాస ప్రత్యేకం :** శ్రావణపర్వం యొక్క గొప్పతనం 13

7. **జీవన దేవత సాధన, ఆరాధన – 1** 16

8. **డా|| మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారి ప్రత్యేక కలర్ పేజీలు** 19

9. **బోధకథ :** అంధకూపములో ఐదు ప్రేతములు 35

10. **భావసంవేదనల గంగోత్రి – 2 :** చైతన్యుడు ఉదయించాడు 36

11. **నీరే ఇంధనమైతే** 38

12. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** జ్ఞానయోగము యొక్క తత్త్వదర్శనము – 2 39

13. **నా వారితో నా మాట :** గురుప్రేమ మహాపర్వం 42

14. **స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు – 4** 45

15. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 48



**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి !**

**చదివించండి !!**


## సద్గురు వాణి

## ప్రకృతిమాత



ప్రకృతిమాత జీవనానికి కావలసిన అవశ్యకతలన్నీ, వస్తువులన్నీ తన భాండాగారంలో కావలసినంతగా అందుబాటులో ఉంచింది. శ్వాస తీసుకొనుటకు కావలసిన గాలిని అపరిమిత పరిణామంలో ఇచ్చింది. ఇదే సూత్రం నీటికి, ఆహారానికి కూడా అన్వయించుకోవాలి. లభ్యమైన నీటితో పంటలు పండించుకోవచ్చు, ఔషధ మొక్కలు పెంచుకోవచ్చు. ఇంకా బంగారం, ఇనుము, రాగి మొదలైన వాటిని కూడా కొంచెం శ్రమతో పొందవచ్చు. ప్రకృతిమాత అనుగ్రహం వలన ఎక్కువగా అవసరమైనవి తక్కువ శ్రమతోను, తక్కువగా అవసరమైనవి ఎక్కువ శ్రమతోను పొందవచ్చు.


**యుగశక్తి గాయత్రి**

**చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా పంపించండి.**

బ్యాంకు పేరు: ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ

ఖాతాపేరు : శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు

ఖాతానెం. : **32506416087**

IFSC Code : **SBIN-0013272**

అట్లే మని ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కాని చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 50/– చందాకు అదనంగా పంప ప్రార్థన. అట్లు పంపించని వారి చందాకాలము దామాషా పద్ధతిలో తగ్గించబడును. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలాన జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుతూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట

అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు – 500 018.

ఫోన్: 040–23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| విడి ప్రతి రూ|| **12/–** | **3** సం|| చందా రూ|| **350/–** |
| సం|| చందా రూ|| **120/–** | **10** సం|| చందా రూ|| **1116/–** |


**పడినప్పుడు చింతించకండి, పడిపోయి లేవలేకపోతే చింతించవలసినదే**

వేద మంత్రం

# సఫలతకు రాజమార్గం

**ధృతవ్రతోధనదాః సోమవృద్ధః స హివామస్యవసునః పురుక్షుః ।**
**సంజగ్మిరేపథ్యారాయో అస్మిన్త్స ముద్రేన సిన్ధవో యాదమానాః ॥**

**భావార్థం :** సముద్రం తానుగా కోరుకోకపోయినా అనేక నదులు దానిలో చేరిపోతూ ఉంటాయి. అదే విధంగా కష్టపడి పనిచేసే వారి చేతిలో లక్ష్మీదేవి ఎల్లప్పుడూ నివాసం ఉంటుంది. వారికి ధనలోపం ఎన్నడూ ఉండదు.

**సందేశం :** "సేవా పరమో ధర్మః" ఇతరులకు సేవ చేయుట ప్రపంచంలో అన్నింటికంటే పునీతమైన కార్యం. ధర్మంలోని ఒక ప్రధాన అంగం. కలసిమెలసి పని చేయడం అంటే ఒకరి కొకరు సహాయం చేసుకోవడమే. సామూహిక భావన అంటే అదే. విద్య, ఆరోగ్యం, సంస్కృతి, విజ్ఞానం, వ్యాపారం, శిల్పం మొదలైన రంగాలలో మానవుని అత్యున్నత స్థానానికి చేరుస్తుంది. సమాజకల్యాణ కార్యాలలో మన సామర్థ్యం, ప్రతిభ వినియోగపడాలి. దుఃఖితులకు, రోగులకు, అసహాయులకు సహాయం చేయడం, సత్కార్యాలలో సమాజసేవా సంస్థలకు సహకరించడం మన ధర్మం. "కృషితో నాస్తి దుర్భిక్షం" అని కదా సూక్తి.

ప్రజలలో ఒక భ్రమ ఉంటుంది. దాన ధర్మాలు చేస్తే ఆర్థికంగా నష్టపోతాం అనుకుంటారు. వాస్తవం చెప్పాలంటే ఇతరుల మేలు కొరకు చేసిన సహాయం మనకు అనేక రెట్లుగా తిరిగి వస్తుంది. **"వంద చేతులతో సంపాదించు. వేయి చేతులతో పంచు"** అనేది శాస్త్రవాక్యం. ఇతరులకు సహాయం చేసేవారు ఎన్నడూ దుఃఖితులు కారు. **ఇతరులకు దానం చేయడం అంటే భగవంతుని పొలంలో నాటుకోవడమే.** ఒక్కొక్క గింజనుండి వేలగింజలు లభిస్తాయి. కృషి చేయడంలో మనుష్యుడు ఎప్పుడూ నిర్లక్ష్యం చేయరాదు. నిజాయితీతో కష్టించి వీలైనంత ఎక్కువ సంపాదించాలి. తన బ్రాహ్మణోచిత అవసరాలు తీర్చుకుని, మిగిలిన దానిని పరోపకారానికి వినియోగించాలి.

సముద్రంలో అపార జలరాశి ఉంటుంది. అయినా దానిని తన కోసం ఉపయోగించుకోదు. సూర్యుని సాయంతో ఆవిరి చేసి, మేఘాలకు ఇచ్చివేస్తుంది. ప్రపంచానికి దాహం తీర్చు అంటుంది. తనకంటూ ఏమీ కోరదు. అయినా సముద్రంలో జలం ఎన్నడూ తగ్గిపోదు. అసంఖ్యాకమైన నదులు ఎప్పటి కప్పుడు నీటిని సమకూరుస్తూనే ఉంటాయి. అదేవిధంగా పరోపకారంలో నిమగ్నమైన వ్యక్తికి ఎప్పుడూ ధనానికి లోటు ఉండదు. అన్నివైపులనుండి అన్ని రకాలైన సహకారం అందుతూనే ఉంటుంది. ఇతరులకు ఉపకారం చెయ్యాలి అన్న కాంక్ష మనస్సులో కలుగగానే దైన్యం నశిస్తుంది. దుఃఖం దూరం అవుతుంది. బుద్ధికి నూతన తేజస్సు కలుగుతుంది. మనస్సుకు స్థిరత్వం ఏర్పడుతుంది. మన ప్రతిభాపాటవాలను పరమార్థానికి ఉపయోగిస్తూ ఉంటే పరమాత్మ యొక్క అనుగ్రహం తనంతటతానుగా లభిస్తుంది. అంతేకాదు. సమాజం కూడా సహకరిస్తుంది.

విద్వాంసులు, బ్రాహ్మణులు సఫలతకు రాజమార్గమైన పరోపకార పద్ధతిలో కృషి చేయాలి.

★★★

## పండుగలు

**ఆగస్టు 2014**

| | |
|---|---|
| 10-08-2014 | శ్రావణ పూర్ణిమ, రాఖీ పండుగ |
| 15-08-2014 | స్వాతంత్ర్య దినోత్సవం |
| 17-08-2014 | కృష్ణాష్టమి |
| 29-08-2014 | వినాయక చవితి |

**సెప్టెంబర్ 2014**

| | |
|---|---|
| 08-09-2014 | మాతా భగవతిదేవి జయంతి |
| 23-09-2014 | మహాలయ అమావాస్య |
| 05-09-2014 | టీచర్స్ డే |

ఎదురుదెబ్బలు ఎదుగుదలకు అడ్డుకాదు


## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-26

# దీక్షాభూమికి యాత్ర-3

### ఆలయాలు ధ్వంసం కావు

అన్నపూర్ణ ఆలయానికి చేరేసరికి శ్రీరామ్ బాగా ఖిన్నుడు అయినాడు. ఆలయం మెట్లు ఎక్కుతూ ఉండగా, ఆయనకు ఒక భిక్షకుడు కనిపించాడు. అతడు ఎవరినీ ఏమీ అడగడం లేదు. వచ్చేపోయే జనాన్ని పరకాయించి చూస్తున్నాడంతే. అతడు చూసినప్పుడు మరొకరి చూపు కలిస్తే అతడలా చూస్తూ ఉండిపోతాడు. భిక్షకుడి కళ్ళలో విచిత్రమైన మెరుపు ఉన్నది. శ్రీరామ్ చూపు అతడి చూపుతో కలిసింది. అతడికి నదరు బెదురు లేదు. ఆ భిక్షకుడు ఇలా అన్నాడు –

"నీవు చూస్తున్న ఆలయాలు జీవం లేనివి. జీవం ఉన్న ఆలయాలను ఎవ్వరూ ధ్వంసం చేయలేరు. విచారపడకు, ముందు ముందు జీవం జవం ఉన్న ఆలయాలను నిర్మించే సంగతి ఆలోచించు. పాత ఆలయాలను తిరిగి నిర్మించే సంగతి ఆలోచించు. పాత ఆలయాలలో స్థాపించబడిన విగ్రహాలలో ఆయా దేవతలను ఆవాహన చెయ్యి."



శ్రీరామ్ విస్తుపోయాడు. తన మనసులో ఉన్నది ఈ భిక్షకునికి ఎలా తెలిసింది? తెలుసుకోవడమే కాదు. దానికి సమాధానం కూడా చెప్పాడు. అతడు మామూలు భిక్షకుడు కాడని తెలుసు కున్నాడు. అతడు భిక్షకుని వేషంలో తనను తాను మరుగు పరుచుకొన్న ఒక సిద్ధ సాధకుడని శ్రీరామ్ భావించాడు.

పంచకాశీ పరిక్రమ పూర్తి చేసిన తర్వాత ఆయన తన మనస్సులో ఉన్న విషయాన్ని స్వామి విశుద్ధానంద ముందుంచాడు. ఆలయాలపై దురాక్రమణ, వాటి విధ్వంసం, వాటి పునర్ నిర్మాణములను గురించి అడిగాడు. స్వామీజీ ఇలా వివరించారు –

"ప్రాణ ప్రతిష్ఠకు కర్మకాండ చాలదు. ఆలయ వాతావరణం చైతన్యంతో, సాధన వలన లభించిన శక్తితో నిండి ఉండాలి. దైవశక్తి వైభవం అవిచ్ఛిన్నంగా ఉంటే, ఆ స్థలంలో నివసించ డానికి అది ఇష్టపడుతుంది.

"హిమాలయాలలోని సిద్ధక్షేత్రంలో, సిద్ధాశ్రమంలో, జ్ఞానగంజ్‌లో విజాతీయ (వ్యతిరేక) సంస్కారాలు కలిగిన వ్యక్తులు ప్రవేశించలేరు. ఆ స్థలం యొక్క తరంగాలు విరుద్ధ తత్త్వాలను ఆమడ దూరంలో ఉంచుతాయి. ఈ విషయాన్ని పరీక్షించాలంటే అక్కడివరకు వెళ్ళనవసరం లేదు.

"ఋషికేశ్ దుర్గమ క్షేత్రం కాదు కదా. పైన నీలకంఠ్ దాటి వెళితే, సిద్ధపురా అనే గ్రామం వస్తుంది. అక్కడ 40–50 ఇళ్ళు ఉన్నాయి. అన్నీ ఖాళీగా ఉన్నాయి. మామూలు వ్యక్తులు ఆ గ్రామం పొలిమేర దాటి లోపలికి వెళ్ళలేరు. ఎవరైనా, సాహసించి గ్రామం లోపలికి వెళితే అక్కడ పులులు, సింహాలు ఎదురవుతాయి. పాములు, కొండచిలువలు, క్రూర జంతువులు కానవస్తాయి. ఎవరూ లోపలికి రాకుండా ఈ ప్రాణులు పహారా కాస్తుంటాయి. సంస్కారి, యోగ్యుడు అయిన సాధకుడిని ఇవి హింసించవు. సిద్ధపురాలో నివసించే యోగులు, యతులు ఎవరికి అనుమతి ఇస్తే వారే ఆ గ్రామంలో ప్రవేశించ గలుగుతారు. అలాంటి వ్యక్తులపై సిద్ధజనుల అనుగ్రహం కూడా వర్షిస్తుంది. ఆలయం కాని, దేవస్థానం కాని, తపఃస్థలం కాని ఆయా స్థలాలలో నివసించే సాధకులవలన, సిద్ధ పురుషుల వలన శక్తివంతములుగా నిలుస్తాయి.

"ఇతర స్థలాలలో కూడా ఇలాంటి సిద్ధ క్షేత్రాలు ఉన్నాయి. మామూలు దృష్టితో వాటిని కనుగొనలేము. అక్కడికి వెళ్ళాలనే కోరికే కలుగదు. కోరిక కలిగినా అక్కడికి వెళ్ళడం సాధ్యపడని పరిస్థితులు ఏర్పడతాయి."

విశ్వనాథ ఆలయం గురించి స్వామి విశుద్ధానంద ఇలా అన్నారు "వేయి, పన్నెండువేల సంవత్సరాల పూర్వం అక్కడ ఉన్న శక్తి క్రమక్రమంగా నశించిపోయింది. ఎందుకంటే ఆ శక్తిని నిలిపి ఉంచే సాధకులు అక్కడ లేరు. విశ్వనాథ ఆలయం పేరుతో ముందు ముందు నగరంలో పెక్కు మందిరాలు నిర్మాణం అవుతాయి. వాటిలో కొన్ని స్వర్ణమందిరం కన్నా

**అగాధంలో పడినా ప్రయత్నించడం ఆపవద్దు**

భవ్యంగా ఉండవచ్చు కూడా. అయితే అవన్నీ దేవదర్శనానికి, భజన, పూజలకు మాత్రమే వినియోగపడతాయి.

పంచకాశీ యాత్రలో శ్రీరామ్‌ను ఆకర్షించిన స్థలాలలో అన్నపూర్ణ ఆలయం, కాశీ కరవత్, గోరఖ్‌నాథ్ మందిర్, తులసీఘాట్, కబీర్ చౌరా ప్రముఖమైనవి.

విశ్వనాథ ఆలయం యొక్క ఆధ్యాత్మిక రహస్యాన్ని విని కూడా శ్రీరామ్ సంతృప్తి చెందలేదు. స్వామి విశుద్ధానంద చెప్పిన మాటలు వాటి సందర్భంలో సరైనవే. కానీ ఆలయం యొక్క దురవస్థ చరిత్ర, సంస్కృతుల దృష్టిలో శోచనీయమే.

యాత్ర ఫలితంగా శ్రీరామ్‌కు కాశీలోని చిన్నా, పెద్దా ధర్మస్థలాలన్నీ పరిచయం అయినాయి.

కబీర్ చౌరా చేరగానే శ్రీరామ్‌కు విచిత్రమైన అనుభూతి కలిగింది. ఒకప్పుడు సంత్ కబీరు అక్కడ నివసించారు. కాశీలో చనిపోయినవారికి మోక్షం వస్తుందని, ఆ నగరం పొలిమేరల బయట చనిపోయేవారికి నరకం వస్తుందని ఒక గ్రుడ్డి నమ్మకం ఉన్నది. దీనిని తొలగించడానికై కబీరు చివరి రోజులలో కాశీ వదలి వెళ్ళిపోయారు. అంతవరకు ఆయన కబీర్ చౌరాలోనే నివసించారు. అక్కడ దైవ విగ్రహం ప్రతిష్ఠించబడినట్లుగా ఆయన ఆసనం ఉన్న స్థలాన్ని దేవస్థానంవలె అలంకరించి ఉంచారు. కబీరు గతంలో కూర్చున్న స్థలంలో, ఆ ఆసనం ప్రక్కన ఆయన టోపీ ఉంచబడింది. ప్రక్కనే ఆయన గురువు స్వామి రామానంద పటం ఉన్నది.

అక్కడి వాతావరణాన్ని చూచి, శ్రీరామ్ తనను తాను మరచిపోయారు. ఆయనకు ఇలా అనిపించింది. ఆసనం మీద కబీరు కూర్చొని ఉన్నారు. ఎదురుగా శ్రద్ధాళువులు ఉన్నారు. కబీరు వారి ఎదుట పాట పాడి వినిపిస్తున్నారు. ఆ పాట 'సాధో సహజ సమాధి భలీ' అనే పల్లవి కలిగినది. 'ప్రతి పనిలో భగవానుని ఆరాధన' – అనే సందేశం ఆ పాటలో ఇమిడి ఉన్నది. ఆ పాట తానే పాడుతున్నట్లు శ్రీరామ్‌కు అనిపించింది కొద్ది క్షణాలపాటు.

దశాశ్వమేధ, మణికర్ణికా ఘాట్‌లు తమ పౌరాణిక, చారిత్రక ప్రాముఖ్యం కారణంగా పేరుగాంచాయి. వారణా సంగమం వెళుతూ శ్రీరామ్ దశాశ్వమేధ ఘాట్‌కి పలుమారులు వెళ్ళాడు. ఈ ఘాట్ వారణ సంగమానికి సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్నది. పురాణాల ప్రకారం ఇక్కడ బ్రహ్మదేవుడు పది అశ్వమేధయజ్ఞాలు చేశాడు. కాశీ వచ్చి గంగానదిలో స్నానం చేసేవారు ఎక్కువగా ఈ ఘాట్‌నే ఎంపిక చేస్తారు.

మణికర్ణిక కూడా పౌరాణికంగా, చారిత్రాత్మకంగా ప్రముఖమైనది. ఈ ఘాట్‌వద్ద ఉన్న భైరవకుండ్‌లో ఏడు రోజులకొకసారి నీటిని తోడివేస్తారు. తోడివేసిన నీటి స్థానంలో లోపల జలం నుంచి స్వచ్ఛమైన నీరు సహజసిద్ధంగా ఊరుతుంది.

రామచరిత మానస రచించిన గోస్వామి తులసీదాసు శరీరం వదలిన స్థలం తులసీఘాట్. ఆ ఘాట్ వద్ద శ్రీరామ్‌కు దివ్య అనుభూతి కలిగింది. ఘాట్‌వద్ద గోస్వామి తులసీదాసు స్థాపించిన హనుమంతుని విగ్రహం ఉంది. విగ్రహం వద్ద తులసీదాసు కూర్చునే స్థలంలో ఆయన చరణ పాదుకలు ఉన్నాయి. ఈ స్థలంలో తులసీదాసు రామకథను వినిపించే వారని చెపుతారు. హనుమంతుడు ఏదో రూపంలో స్వయంగా వచ్చి కూర్చుని రామకథ వినేవాడన్నది ప్రజల నమ్మకం. ఏదో ప్రత్యేక లక్షణం వల్ల తులసీదాసు ఆయనను గుర్తు పట్టాడని కొందరు కొందరు, హనుమంతుడే తనను తాను పరిచయం చేసుకున్నాడని కొందరు చెపుతారు. గోస్వామి తులసీదాసు ఆయనకు ప్రణామం చేశారు. పూజ, అర్చన చేశారు. ఎక్కడ రామచరిత మానస ప్రవచనం జరిగితే అక్కడకు తాను ఏదో రూపంలో హాజరవుతానని, మొదటి నుంచి చివరి వరకు వింటానని ఆయనకు హనుమంతుడు మాట ఇచ్చాడు.

సంత్‌లు, విద్వాంసులు పేర్కొన్న ఈ సంఘటన తులసీ ఘాట్‌వద్ద శ్రీరామ్‌కు గుర్తు వచ్చింది. అతను హనుమంతుని విగ్రహాన్ని ఏకాగ్రతతో చూడసాగాడు. అలా చూస్తూ ఉండగా తన్మయత్వం చెందాడు. తన ఉనికిని మరిచిపోయాడు. ఒక్క హనుమంతుడే ఉన్నాడని ఆయనకు అనిపించింది. ఆ విగ్రహంలో స్పందన కనిపించింది. విగ్రహం కొద్దిగా ఒరిగినట్లు అనిపించింది. నెమ్మది నెమ్మదిగా జరిగింది కాదు. విగ్రహం అక్కడే ఉన్నది. స్పందన, కదలిక ఊహ మాత్రమే. వాస్తవానికి ఆ విగ్రహం నుండి మరో విగ్రహం వెలువడింది. మళ్ళీ మరో విగ్రహం వెలువడింది. మళ్ళీ మరో విగ్రహం వెలువడింది. అలా నెమ్మది నెమ్మదిగా అనేక విగ్రహాలు వెలువడ్డాయి. చూస్తూ ఉండగానే, విగ్రహాలకు ప్రాణం వచ్చింది. హనుమంతుని

**అనుకూలమైన పరిస్థితులు ప్రతిసారి ఉండవు**

సేన తన గుణస్వభావాలకు అనుగుణంగా గెంతుతోంది, దుముకుతోంది.

ఈ దృశ్యాన్ని అనుభూతి పొందుతున్న శ్రీరామ్‌కు ఒక ఆలోచన వచ్చింది. రావణుడు ముల్లోకాలను జయించాడు. కాలాన్ని ఖైదు చేశాడు. అలాంటి రావణుని రాక్షసత్వాన్ని ఈ వానరులు అంతమొందించారు. భగవంతుడు తలచుకుంటే కేవలం సంకల్పంతో రావణుడిని అంతం చేయగలడు. కానీ ఆయన క్షుద్ర ప్రాణులని పిలువబడేవారిచేత ఆ పని చేయించాడు. అసురత్వంతో సంఘర్షించే సూత్రం ఇందులో దాగి ఉన్నది.

శ్రీరామ్ కొంతసేపు ఈ భావ వీధిలో విహరించిన తర్వాత ఆ దృశ్యం తనకు తానుగా అదృశ్యం అయింది. అంతా సహజ స్థితికి, యథాస్థితికి తిరిగి వచ్చింది.

జ్ఞానవాపి దగ్గర ఒక సందులో ఉన్న 'కాశీ కరవత్' ను చూడడానికి వెళ్ళినప్పుడు శ్రీరామ్‌కు ఒక విలక్షణ అనుభూతి కలిగింది.

కాశీ కరవత్ అనే స్థలంలో ఇప్పుడు ఒక బావి ఉంది. బావిలో చిమ్మచీకటి వ్యాపించి ఉంటుంది. బావిపైన మూతవేసి ఉంటుంది. లోపల శివలింగం స్థాపించబడి ఉన్నది. శుభ్రపరచే టప్పుడు, పూజ, హారతుల సమయంలోనే మూత తెరుస్తారు. పూజారి మెట్లు దిగి లోపలికి వెళతాడు. మామూలు సమయాలలో వచ్చే జనం ఆ మూతమీదనే అక్షతలు, పువ్వులు చల్లి తృప్తి పడతారు. ఒకప్పుడు బావిమీద దూలం ఉండేది. జనం దాని మీదకు దూకి తమను తాము బలి చేసుకునే వారు. ఇలా మృత్యువును వరించడం వల్ల సాయుజ్య ముక్తి లభిస్తుందని భావించేవారు.

### కాశీ కరవత్ రహస్యం

శ్రీరామ్ కాశీ కరవత్ వెళ్ళినప్పుడు దానిని గురించి ఎన్నో కథలు అక్కడి ప్రజలు చెప్పగా విన్నాడు. వాటిలో శ్రీరామ్‌కు ఆసక్తి లేదు. ఆత్మహత్యకు ప్రాముఖ్యత ఇచ్చే ఈ తీర్థం గురించి ఆలోచించసాగాడు. అతను నలువైపుల నుండి ఆ బావిని చూసాడు. ఆత్మహత్యవల్ల మోక్షం వస్తుందనే ఈ నమ్మకం ఎక్కడ నుంచి పుట్టిందని ఆలోచించాడు. ఈ ఆలోచనతో అతని ముఖంపై వ్యంగ్యాత్మకమైన చిరునవ్వు విరిసింది. ఈ సంప్రదాయం వెనుక ఏదో అర్థం ఉండవచ్చునని ఆయనకు అనిపించింది.

కాశీ విశ్వవిద్యాలయంలోని ఒక విద్వాంసుడు కూడా అక్కడకు వచ్చాడు. శ్రీరామ్‌లోని గాంభీర్యం ఆయనకు మరోలా అర్థమయింది. ఎందువల్లనో ఆయన ఆకర్షితులు అయినారు. శ్రీరామ్‌తో పరిచయం పెంచుకున్నాడు. తన పేరు శివరాజ్ గౌతమ్ అని ఆయన తెలిపాడు. పేర్లు, కుటుంబాలు, నివాస స్థలాలు మున్నగువాటి పరిచయాన్ని ఇరువురు ఇచ్చి పుచ్చుకున్నారు. గౌతమ్ కూడా బృందావనం సమీపంలోని మోర్ గ్రామ నివాసి. గత 20 సంవత్సరాలుగా కాశీలో నివసిస్తున్నాడు. కాశీ హిందూ విశ్వవిద్యాలయ స్థాపన తర్వాత దానితో అనుబంధం ఏర్పరచుకున్నాడు. "మీ ఉదాశీనతకు కారణం ఏమిటి?" - అని ఆయన శ్రీరామ్‌ను అడిగాడు. శ్రీరామ్ ఇలా జవాబిచ్చాడు -

"మన సమాజంలో ఎలాంటి మూఢత్వాలు వ్యాపించాయి. ముక్తి వస్తుందని, స్వర్గం అందుతుందని వ్యామోహపడి, జనం తమ ప్రస్తుత జీవితాన్ని వదులుకునేవారు. ఇందులో విజ్ఞత ఏముంది?"

"మరో దృష్టితో చూస్తే - కాశీ కరవత్ జీవితం పట్ల అనాసక్తికి, దాని వివిధ రూపాలను ఆమోదించడానికి ప్రతీక కూడా. మన దేశం జీవితాన్ని వివిధ రూపాలలో ఆమోదించింది. మృత్యువు కూడా దాని రూపమే. తమ ఆంతరిక స్థాయిని శిఖరాగ్రాలకు పెంచుకున్న జాతులు మృత్యువును కాదనలేదు. అయితే మన దేశంలో వైవిధ్యానికి పరిమితి లేదు. కాశీ కరవత్ బలిదానానికి ఒక రూపం, మృత్యువును దాటివెళ్ళే సాహసం.

"ఎవరో మనస్వి, ఉత్కృష్ట స్థాయి సాధకుడు దీనిని ప్రారంభించి ఉంటాడు. ఇందులో ప్రతి ఒక్కరికీ మరణించడానికి ప్రేరణ ఇచ్చేటంతగా మృత్యువు యొక్క సరళీకరణ జరగలేదు. ఆ తర్వాత జరిగినది ఖచ్చితంగా ఆత్మ వినాశకరమే."

- అని గౌతమ్ సమాధానం చెప్పాడు. అతను ఆ ప్రశ్నను ముందుగానే ఊహించారని, సమాధానం కోసం సిద్ధమైనారని అందువల్ల తెలిసింది.

గౌతమ్ కాశీ కరవత్ ఆరంభాన్ని సమర్థించారు. అయితే, ఆ తర్వాత పలాయనం, పిరికితనంతోపాటు ఆత్మహత్య వంటి

**ప్రతికూల పరిస్థితులలోను ప్రయత్నం చేయడమే గొప్ప విషయం**

అపరాధం కూడా ఆ బావితో ముడిపడ్డాయని ఆయన కూడా అంగీకరించాడు.

గౌతమ్ దృక్పథాన్ని శ్రీరామ్ ఆమోదించాడు. ఒక ఆచారంలో వికృతి ప్రవేశిస్తే, దానిని సవరించడానికి తగు ప్రయత్నం కూడా జరుగుతుంది. ఈ ప్రయత్నాలను గురించి చర్చిస్తూ ఆయన ఇలా అన్నాడు –

"మధ్య యుగంలో కబీరు వంటి మహనీయుల అవతరణ ఇలాంటి వికృతులను తొలగించడానికే జరిగిందని మనం అంగీకరించాలి."

గౌతమ్ ఆ భావాన్ని ఆమోదించాడు. ఆ తర్వాత కాశీ హిందూ విశ్వవిద్యాలయం గురించి, నగరంలో జరుగుతున్న ఇతర ధార్మిక, సామాజిక కార్యకలాపాల గురించి చాలసేపు సంభాషణ జరిగింది. ఆ సంభాషణ ద్వారా శ్రీరామ్ వారణాసి పరిస్థితిని బాగా అవగాహన చేసుకున్నాడు.

శ్రీరామ్ కాశీలో ఉన్న సమయంలో మదన్‌మోహన్ మాలవ్యా జైలులో ఉన్నారు. శ్రీరామ్ కాశీకి బయలు దేరిన రోజున, ఆగస్టు 20న, ఢిల్లీలో మాలవ్యాజీ, కాంగ్రెసు కార్యవర్గం లోని మరో ఆరుగురు సభ్యులు అరెస్టు చేయబడ్డారు. నిషేధించ బడిన కాంగ్రెసు కార్యవర్గ సమావేశంలో పాల్గొనడమే వారు చేసిన నేరం. అంతకుముందు విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు సహాయ నిరాకరణ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొంటున్నారు.

విశ్వవిద్యాలయ వాతావరణాన్ని, అక్కడి పరిస్థితులను తెలుసుకోవడం కోసం శ్రీరామ్ అక్కడికి వెళ్ళాడు. వాటిలో జోక్యం చేసుకుని, వాటికి సహకరించే స్థితిలో లేనప్పటికీ అక్కడి వ్యవస్థను, స్థితిని తెలుసుకోవడం, అక్కడి వారిని కలుసు కోవడం ఇవి కాక, భావనాత్మకమైన మరో కారణం కూడా దీని వెనుక ఉన్నది. అయిదు సంవత్సరాల పూర్వం తనకు ఉపనయన దీక్ష ఇచ్చిన మహనీయుని కార్యక్షేత్రం ఇది. అంతకుముందు తనకు అయిదారు సంత్సరాల వయస్సు ఉన్నప్పుడు తన తండ్రిగారితోపాటు తాను అక్కడికి రావడం, విశ్వవిద్యాలయ స్థాపన మహోత్సవంలో పాల్గొనడం గురించిన స్మృతులు కూడా శ్రీరామ్ మనః ఫలకం పైకి ఉబికి వస్తున్నాయి.

*(సశేషం)*

## సేవకు సమర్పణ కావాలి - పాండిత్యం కాదు

*మహాత్మాగాంధీ సేవాగ్రామ్ ఆశ్రమానికి ఒకరోజు ఒక పండితుడు వచ్చి, గాంధీగారికి తనకు గల పాండిత్య విశిష్టతను తెలియజేశాడు. తదుపరి, తన స్థాయికి తగిన పనిని అప్పగించవలసిందిగా గాంధీజీని కోరాడు. అప్పుడు గాంధీజీ అతనితో "వాస్తవానికి మీకు తీరిక ఉంటే, సేవ చేయాలని కోరిక ఉంటే, ఆశ్రమ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయండి. లేదా కనీసం గోధుమలను తిరగలితో విసరండి. గాంధీజీ జవాబుతో పండితునికి గల అహంకారం పొరలు విచ్చుకొనగా పండితుని ఆలోచనా సరళి మారిపోయింది. మానవీయత ముప్పిరిగొనగా, పండితునికి తెలిసి వచ్చింది. "సేవ చేయుటకు కావలసింది పాండిత్యం కాదు, సమర్పణ అని."*

*– యుగనిర్మాణ యోజన, మార్చి 2014*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## సత్యము - మిథ్య

*ఒక వనంలో రెండు వృక్షాలు ఉన్నాయి. ఒక వృక్షం పూర్తిగా ఎండిపోయి మోడువారింది. రెండవది పచ్చదనంతో నిండుగా ఉన్నది. ఎండిన చెట్టుపై గ్రద్ద గూడు కట్టుకొని ఉండగా, పచ్చని దానిపై కోయిల నివసిస్తూ ఉన్నది. ఈ రెండు పక్షుల మధ్య తరచుగా ఒక విషయంపై వివాదం తలెత్తుతూ ఉండేది. ఈ ప్రపంచం మిథ్య అని గ్రద్ద అంటూ ఉంటే, కోయిల సత్యం అనేది. ఒకరోజు వీని రెండింటి వాగ్వివాదాన్ని విని చిలుక ఇలా అంది. "మీరిరువురూ వ్యర్థంగా తర్కించుకోవలదు – ఈ ప్రపంచం పరివర్తన చెందుతూ ఉంటుంది. ఇట్టి ప్రపంచం పట్ల ఎవరైతే అనురక్తి లేకుండా జీవిస్తారో వారికి ఇది మిథ్యగా తోస్తుంది. దీనికి భిన్నంగా జీవించెడి వారికి సత్యం కనిపిస్తుంది. ఇట్టి సత్యానికి అనుగుణ్యంగా ఎవరైతే తమను తాము సరిదిద్దు కుంటారో ఈ ప్రపంచాన్ని సరియైన రీతిలో అర్థం చేసుకుంటారు"*


*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**పని అయిందా కాలేదా అనేది ముఖ్యం కాదు, ప్రయత్నం చేశామా లేదా అనేదే ముఖ్యం**

కుండలినీ మహావిజ్ఞానం-12

# కుండలిని - ఒక ప్రచండ ప్రాణ ఊర్జ

క్రింద పడటం అనేది చెడు అర్థంలోను, పైకి లేవడం అనేది మంచి అర్థంలోను సాధారణంగా తీసుకుంటాము. ఈ సిద్ధాంతము శరీర క్షేత్రంలోను, ప్రత్యేకించి జననేంద్రియములో ఉన్న ప్రాణశక్తికి కూడా సరిపోతుంది. మూలాధారాన్ని యోనిగాను, సహస్రారాన్ని లింగముగాను ఆధ్యాత్మిక శాస్త్రము లలో అలంకారికముగా (ఉపమానంగా) వివేచన చేయబడింది కానీ వాస్తవంగా అది సరికాదు. మూలాధారములో ఉన్న శక్తి కాముక కార్యకలాపాలలో నష్టపోకుండా మస్తిష్కంలోనికి తీసుకెళ్ళాలి. దానిని సత్‌జ్ఞాన సంవర్ధన ధ్యానం ద్వారా జాగృతం చేయాలి. నిద్రిస్తున్న కుండలినీ శక్తి శివలింగమునకు చుట్టుకుని నిద్రిస్తున్న సర్పిణివలె ఉంటుంది. అది వికాసం చెందినప్పుడు ఈ శక్తి పైకి లేచి మస్తిష్కంలోని సర్వోచ్ఛ స్థానం క్షీరసాగరం, మస్తిష్కం యొక్క గ్రే మాటర్ (grey matter) ఉన్న సూక్ష్మ నరాలలో సహస్రారంలో విరాజిల్లుతుంది. ఒక చిన్న శివలింగం ఊర్ధ్వ గమనం తర్వాత కైలాస పర్వత రూపం ధరిస్తుంది. విచ్చుకున్న సహస్రదళ కమల రూపంలో దాని వికాసం జరుగుతుంది. క్రమక్రమంగా మస్తిష్కంలో నిద్రిస్తున్న అన్ని కేంద్రాలు జాగృత మవుతాయి. ఇదే లఘువు యొక్క విరాట్‌లో విస్తారము.



ఆజ్ఞా చక్రం
తృతీయ నేత్ర జాగరణ

ఈ నియంత్రణలో మేరుదండాన్ని ఆశ్రయించవలసి ఉంటుంది. దీని ద్వారా సుషుమ్న యొక్క చేతనత్వధార ఉచ్ఛస్తరీయ ప్రయోజనాలకు వినియోగిస్తే విషయానందముతో లభించే ఆనందంకన్నా వెయ్యిరెట్లు ఆనందం, బ్రహ్మానందం పొందవచ్చు. బంధములు, ముద్రలు, ప్రాణాయామం, ఆసనాలు మొదలైనవి ఈ ఉద్దేశ్యం కొరకే చెప్పబడ్డాయి. సిద్ధాసనంలో కానీ వజ్రాసనంలో కానీ శక్తిచాలినీ ముద్ర, విశిష్ఠ బంధములు లేక ప్రాణయోగమును ఉపయోగించుకుని మూలాధారం యొక్క శక్తిని ఉద్దీపన- జాగరణ-ఊర్ధ్వగమనం చేసి పూర్ణత్వం యొక్క కేంద్రంతో జోడించే ప్రయత్నం చేయాలి. ఈ ప్రయోగములు హఠయోగానికి, క్రియాయోగమునకు సంబంధించినవి, వీటిని కుండలినీ జాగరణ ప్రక్రియ యొక్క ప్రక్రియగా భావించవచ్చు. ఈ పద్ధతులను మించి ఇంక ఏమి లేవు అనేది ఒక భ్రాంతి మాత్రమే. ఇవి చల్లబడిన మోటారును కొంత వేడి చేసే ప్రక్రియలు వంటివి.

కుండలినిని కామబీజం అని కూడా అంటారు. దాని ప్రతీకగా శివలింగ స్థాపన చేస్తారు. శివలింగం యొక్క రుద్రాభిషేకం చేసేటప్పుడు మూడు తీగలతో వ్రేలాడదీసిన మూడుకాళ్ళ పీటపై ఉంచిన కలశంలో నుండి నీరు బొట్టు బొట్టుగా శివలింగంపై పడే ఏర్పాటు చేస్తారు. నారి యోనిలో కూడా మదనాకుహరం ఉంటుంది. పురుష శిశ్నం యొక్క అధోభాగంలో కూడా నారియోని ఉంటుంది. ఈ విపరీతతలు జాగృతం అయినప్పుడు లింగ పరివర్తన ప్రక్రియ జరుగుతుంది. నరుడు నారిగా మారవచ్చు, నారి నరుడు అవవచ్చు. దీనికి కారణం ప్రసుప్త స్థితిలో ఉన్న క్షేత్రములలోనికి శక్తి ప్రవేశించడమే. కాముకత కూడా ఈ కారణం వలననే ఉప్పొంగుతుంది. ఇటువంటివి జరుగకుండా మస్తిష్కం యొక్క జ్ఞానరూప అమృతము బొట్టుబొట్టుగా పడి దానిని శాంతింపచేస్తుంది. ఈ అమృతాన్నే సోమరసం అని అంటారు. ఖేచరీ ముద్రతో కూడిన సోహం సాధనలో సోమరసపాన ప్రక్రియ పూర్తి అవుతుంది.

రుద్రాభిషేకంలో మూడుకాళ్ళ పీటపై ఉంచే కలశం ఇడ, పింగళ, సుషుమ్నలకు ప్రతీక. రుద్రాభిషేకం కుండలినీ సాధనలో ఒక దృశ్యంగా భావించబడింది. కుండలిని యొక్క అధిపతి శివుడు ప్రత్యక్ష పరమేశ్వరుడనే వర్ణన ఆలంకారిక రూపంలో ప్రతిపాదింపబడింది. ఆయన నివాస స్థానం కైలాస పర్వతం, మానస సరోవరంవలె పవిత్రంగా భావించాలి. దానిని నరనారీల జననేంద్రియములుగా భావించకూడదు. కానీ వాటి పవిత్రత, గొప్పదనం గురించి ఉచ్ఛమైన భావనలను ఉంచుకుని వాటి శక్తిని సదుపయోగం చేయాలి. సాహసం, కళాభిరుచుల పురుషార్థ, లాలిత్య కర్మలు, భావనలు ఈ కేంద్రముల ప్రజనన

**క్రమశిక్షణ అనేది జీవితానికి అత్యంత ఆవశ్యకం**

సూత్రంతో మాత్రమే ఉంచకూడదు. నరనారీల జననేంద్రియముల దగ్గర ఉన్న మూలాధార చక్రం యొక్క శివశక్తిని గొప్ప ఆదర్శముల కొరకు వినియోగించాలి.

మూలాధారాన్ని కామబీజంగా, సహస్రారాన్ని జ్ఞాన బీజంగా వర్ణించారు. ఈ రెండింటి సమన్వయం వలన వికాసంతో వివేకంతో కూడిన పనులు జరుగుతాయి. జీవనం యొక్క సర్వాంగవికాసం, వ్యక్తిత్వము యొక్క వికాసం, ఆలోచనల స్థాయి ఈ శక్తిమీద ఆధారపడి ఉంటాయి. కుండలినీ యోగం ఇందుకు సాధనగా రూపుదిద్దబడింది.

శ్వేతాశ్వర ఉపనిషత్తులో కుండలినిని యోగాగ్నిగా, నచికేతాగ్నిగా చెప్పబడింది. ఎవరి శరీరంలో ఈ దివ్యాగ్ని ప్రజ్వలితమవుతుందో వారి శరీరములను రోగములు అంటవు. మనస్సులో క్షోభ పుట్టదు.

చైనీయుల యోగ ప్రదీపికలో లోహెన్ దీనిని స్పిట్ ఫైర్ (spit fire) అని పిలిచాడు. దీనిని ఆత్మ యొక్క అగ్నిగా వర్ణించాడు. పాశ్చాత్య యోగ విశారధుడు సర్ జాన్ ఉడ్‌రఫ్ దీనిని సర్పెంట్ ఫైర్ (serpent fire)గా పేర్కొన్నాడు. థియోసాఫికల్ సొసైటీ వ్యవస్థాపకురాలు మేడమ్ బ్లావెట్స్కీ దీనిని విశ్వవ్యాపి విద్యుత్‌శక్తి లేక కాస్మిక్ ఎలక్ట్రిసిటి (cosmic electricity) అన్నది. దీని వేగం ఒక సెకండుకు 3,45,000 మైళ్ళు. విద్యుత్తు తరంగాల వేగం సెకండుకు 2,88,000 మైళ్ళు. ప్రకాశం యొక్క వేగం ఒక సెకండుకు 1,85,000 మైళ్ళు. వైజ్ఞానికుల ప్రకారం ఆలోచనల వేగం విద్యుత్తు తరంగముల కన్నా ఏడు రెట్లు ఎక్కువ. ఆలోచన క్షణమాత్రంలో పృథ్వి చుట్టూ సుమారు 40 సార్లు ప్రదక్షిణ చేయవచ్చు.

కుండలిని ఆధ్యాత్మిక శక్తి అయినప్పటికీ కూడా శారీరిక విద్యుత్తుతో కలిసిపోతుంది. డా॥ వసంత్ జీ రేలే తన పుస్తకం "ది మిస్టీరియస్ కుండలిని (The mysterious Kundalini) లో దీనిని నర్వస్ ఫోర్స్ (nervous force) అన్నాడు. ఈ పుస్తకానికి ఉపోద్ఘాతం సర్ ఉడ్‌రఫ్ వ్రాశారు. ఆయన ప్రకారం కుండలిని కుడి వేగస్ నెర్వ్ (right vegus nerve) పై తిష్ఠవేస్తుంది. అక్కడ తన శక్తిని చూపుతుంది. ఆయన ప్రకారం కుండలిని డైనమిక్ రియల్ (dynamic real). ఇది ఒక ప్రసుప్త శక్తి. దీనితో పదార్థ సత్తా (శక్తి) "ఇన్‌వల్యూషన్" ప్రక్రియకు విపరీతంగా "ఇవల్యూషన్" ద్వారా పైకి లేపి వ్యక్తిత్వాన్ని ప్రఖరముగా, సమున్నతంగా చేయగలరు. వసంత్ దేవే ప్రకారము కుండలినీ శక్తి స్థిర రూపంలో తన సామాన్య రూపంలో ఉంటుంది. కానీ ఇదే ప్రాణశక్తిగా తయారవుతుంది. ఆయన ఇంకా ఇలా అంటారు – "హఠయోగ ప్రదీపిక, శివ సంహిత, షట్చక్ర నిరూపణ గ్రంథముల వివేచన చేస్తే ఇది బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్న సమిష్టిగత మహత్వ చేతనత్వ శక్తి యొక్క వ్యష్టి రూపం".

పాశ్చాత్య హఠయోగి శ్రీ హడ్సన్ తన ప్రసిద్ధ గ్రంథం "సైన్స్ ఆఫ్ సీర్‌షిప్" (science of seership)లో "పవిత్రమైన మనస్సుతో, కామనారహితమైన, సుయోగ్యుడైన శిష్యుడు యోగ్యుడైన గురువు యొక్క దర్శకత్వంలో కుండలినిని జాగృతం చేసుకోవాలి. లేకపోతే కుండలినీ శక్తి క్రిందకి ప్రవహించి విషయ వాసనలలో కాముక ఆలోచనలలో వేగాన్ని పెంచుతుంది. అప్పుడు ఈ శక్తి కోరికలను తృప్తి పరచుకోవడానికి, స్వార్థపరమైన పనులకు ఉపయోగించబడుతుంది.

జైన యోగాచార్యులు కుండలినీ శక్తిని "తేజోలేశ్యం" గా వర్ణించారు. దీనిని పొందడానికి రెండు సాధనలు చెప్పారు. ఒకటి – అన్నం, జలం మితంగా తీసుకుని తపస్సు చేయడం, రెండవది సూర్యోపాసనతో శక్తిని పొందడం. తేజోలేశ్యం యొక్క ఉద్గమ కేంద్రం సూక్ష్మశరీరంగా భావించబడింది. కుండలినీ శక్తి యొక్క స్థానం కూడా అదే. తేజోలేశ్యంను సావిత్రీ సాధనగా భావించవచ్చు.

కుండలినీ శక్తిని గురించి వ్యాఖ్యానిస్తూ యోగ విజ్ఞానులు దీనిని "వాయిస్ ఆఫ్ సైలెన్స్" (voice of silence) అన్నారు. ఇది మౌనభాష. ప్రజలు విద్యుత్తు యొక్క ప్రభావం తెలుసుకొని దానిని ఉపయోగించుకుంటారు. ఈ ఆధ్యాత్మిక అగ్నిని లేక మెటాఫిజికల్ అగ్ని (meta physical fire) యొక్క ప్రయోగం కూడా తెలుసుకుంటే ఆత్మిక క్షేత్రంలోని అనేకానేక సిద్ధులను హస్తగతం చేసుకోవచ్చు.

డా॥ స్కాంట్ చెప్పిన దానిని బట్టి అది ఒక క్రిస్టల్ (crystal) అని, దాని సహాయంతో జీవనరూపమైన ట్రాన్స్‌సిస్టర్ పలుకుతుంది. శరీర శాస్త్రజ్ఞులు దానిని తమ పద్ధతిలో వ్యాఖ్యానిస్తూ దానిని స్పైనల్ కార్డ్ (spinal cord), మూలాధారాన్ని "గాంగ్లియన్ ఇంపార్" రూపంలో నిరూపించారు. దానిని జెనరేటర్ (generator) డైనమో (dynamo), బ్యాటరీ (Battery) మేగ్నట్ (Magnet)లతో పోల్చారు. అందరి భావన ఒక్కటే. ఈ కామక్షేత్రంలో ఉడుకుతున్న కుండం ఉన్నదని అది పైకి లేస్తే ప్రజ్వలన అసాధారణంగా ఉంటుంది.

**క్రమశిక్షణ వలన ఎన్నో కష్టమయిన పనులు సులువవుతాయి**

డా॥ హెన్రీ లిండాల్ బ్రహ్మాండమంతా వ్యాపించి ఉన్న చేతనత్వ విద్యుత్తును, భౌతిక జగత్తులో పనిచేసే విద్యుత్తు యొక్క ఉద్గమ కేంద్రాల గురించి వ్యాఖ్యానిస్తూ మానవ శరీరంలో పనిచేసే విద్యుత్తును గురించి కూడా చర్చించారు. బ్రహ్మాండంలో పృథ్వికి నలువైపుల విద్యుత్తు అయస్కాంత ధారలు ఒక వలవలె వ్యాపించి ఉన్నాయని, దీని ధన విద్యుత్తు మూడు లక్షల ఓల్టుల సామర్థ్యం అని అన్నాడు. ప్రతి జీవధారి మీద ఇది ప్రతి మీటరుకు 5 ఓల్టుల వత్తిడితో పడుతుంది. ఈ బ్రహ్మాండీయ విద్యుత్తు యొక్క వ్యష్టిగత (వ్యక్తిగత) అంశము కుండలినీ శక్తి రూపంలో మేరుదండంలో విరాజిల్లుతుంది. డా॥ లిండాల్ ఇలా అన్నారు – "జీవకోశములు, నాడీ తంతువులు, విభిన్న అవయవములు పని చెయ్యడానికి విద్యుత్తు శక్తి నిరంతరం చాలా ఎక్కువగా వ్యయమవుతుంది. దీని ఉద్గమం హృదయం కాదు, మస్తిష్కం. జీవనానికి, అంతానికి అదే ఆధారము కానీ ఈ ఉద్గమం ఒక చోట నుంచి జరుగదు. మేరుదండం పైన ఉన్న మస్తిష్కంలోని గ్రే మేటర్ (grey matter), సుషుమ్న ఆరంభమయ్యే కాడా ఈక్వినా (cauda equina), ఈ రెండు ప్రాణ విద్యుత్తు ఉత్పాదనలో తమ తమ పాత్ర పోషిస్తాయి. మస్తిష్కంలోని రెటిక్యులర్ ఏక్టివేటింగ్ సిస్టం (reticular activating system) లో విద్యుత్తు స్ఫులింగములు నిరంతరం ఉబుకుతుంటాయి. కుండలినీ క్షేత్రం జీవనం యొక్క మహత్వ పూర్ణకేంద్రం. అందువలననే వైజ్ఞానికులు కామకేంద్రంపై విస్తృతంగా పరిశోధన జరిపారు. నూతన ప్రాణిని ఉత్పన్నం చేసే అవయవాలతో ఉండడం వలన దాని శక్తి, మహత్వం ఇతర అవయవాల కంటే సంవేదనా శీలము, శక్తి సంపన్నం. శాక్రల్ ప్లెక్సస్ (sacral plexus), కాడా ఈక్వినా (cauda equina) ల నిర్మాణం మస్తిష్కంతో సమానమైన, అత్యంత క్లిష్టంగా, ఫిజియాలజి దృష్టిలో మహత్వ పూర్ణమైనవి. ఈ విషయములను శ్రాలీ సనేలా కుండలినీ సైకోసిస్ అండ్ ట్రాన్స్ డెన్స్ (Kundalini Psychosis and Transcendence) అనే పుస్తకంలో, డా॥ డి.ఇ. ఉల్‌రీజ్ తన పుస్తకంలో "ది మిషినరి ఆఫ్ బ్రైన్ (The Machinary of Brain) లో", డా॥ నారంజో ఆర్. ఆర్నస్టీర్ "సైకాలజి ఆఫ్ మెడిసిన్ (Psychology of Medicine)" అనే పుస్తకంలో విభిన్న రూపాలలో వ్యక్తం చేశారు.

డా॥ కారింగ్టన్ తన "ఆధునిక మనో విజ్ఞానం – భారతీయ దర్శనం" పుస్తకంలో ప్రాణ పరమాణువులతో కూడిన శరీరం ఉన్నా, ఉండకపోయినా అస్తిత్వం ఉంటుందని అనేక ఉదాహరణతో చెప్పారు. శరీరంలో కుండలినీ శక్తి సంబంధం ఉన్నంత వరకు శరీరంలో ప్రాణం ఉంటుంది.

టిబెటియన్ బుక్ ఆఫ్ డెడ్ (Tibetian Book of Dead), చైనీస్ బుక్ ఆఫ్ సోల్ (Chinese Book of Soul) అనే పుస్తకాలలో భౌతిక శరీరం, ప్రాణ శరీరం వేరు వేరు అని చెప్పబడింది. డా॥ సీల్, డా॥ టేలర్ రచించిన గ్రంథం Positive Sciences of Ancient Hindus లో హిందూ ధర్మం యొక్క సాధనా విధానం, కర్మకాండలలో ప్రాణ శరీరాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారని, ఈ ప్రాణశరీరాన్ని దివ్యచక్షువులతో చూడవచ్చని చెప్పబడింది.

థియోసాఫిక్ వైజ్ఞానికుడు డా॥ లెడ్‌బీటర్ తన పుస్తకం "ది చక్రాస్" (The chakras)లో మేరుదండంలో ఉన్న ఆరు చక్రాల వివేచన చేస్తూ ప్రాణ శరీరం ఒక ప్రత్యేకమైన విద్యుత్తుతో తయారవుతుందని, భౌతిక శరీరంలో విరాజిల్లుతుందని, అది గూటిలో పక్షివలె ఉంటుందని అంటాడు. అనేకమంది ప్రాణాన్ని Fire of life అంటారు. ఈ అగ్ని ఎంత ఎక్కువగా శరీరంలో ఉంటే అంత చైతన్యవంతుడిగా, సాహసవంతుడిగా, ప్రతిభావంతుడిగా, ఉత్సాహంతో ఉంటాడు. ఇది తగ్గితే పిరికితనం, బద్ధకం, నిరాశ ఎక్కువవుతాయి. ఈ విద్యుచ్ఛక్తిని ప్రయత్నపూర్వకంగా కూడా పెంచుకోవచ్చు. యోగాభ్యాస పద్ధతులు ఈ దృష్టితోనే రూపొందించబడ్డాయి. కుండలిని యోగం వస్తుతః ప్రాణవిద్యపైనే ఆధారపడి ఉన్నది.

కుండలినీ జాగరణ యొక్క సారాంశం ఏమంటే నిఖిల బ్రహ్మాండములోని ప్రాణ చేతనత్వమును ఆకర్షించుకుని ఉచ్ఛస్తరీయ శక్తిని ప్రాప్తించుకుని, ఈ సామర్థ్యమును అభీష్ట ప్రయోజనముల కొరకు ఉపయోగించుకోగలగాలి. ఈ క్షమత సంయమంతో పెరుగుతుంది.

యూరోపియన్ తాంత్రికుడు జేకబ్ బాహమ్ చాలా ఖ్యాతి గడించాడు. అతని జర్మన్ శిష్యుడు జార్జి మిసెల్ రచించిన (Theosophic Practice) అనే పుస్తకంలో కుండలినీ జాగరణ, షట్చక్ర ప్రసంగములలో దానిని రహస్యంగా ఉంచాలని కూడా చెప్పబడింది. ఎందుకంటే కొందరు దానిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉన్నది. అలాంటిది జరిగితే తమకు, ఇతరులకు కూడా హాని జరుగుతుంది.

– *అఖండజ్యోతి, జనవరి 1987*

**క్రమశిక్షణతో మెలిగే ఏ వ్యక్తి ఇంతవరకు నష్టపోలేదు**

శ్రావణమాస ప్రత్యేకం

# శ్రావణపర్వం యొక్క గొప్పతనం

శ్రావణశుక్ల పూర్ణిమనాడు 'శ్రావణీ' (రాఖీ) పండుగ జరుపబడుతుంది. ఇది జ్ఞానమునకు సంబంధించిన పండుగ. మంచి జ్ఞానము, విద్య, వివేకము, ధర్మము మొదలగువానిని వృద్ధిచెందించు కొనటానికి ఈ పండుగ జరిపే విధానమును మన సంస్కృతి ఏర్పరచింది. అందుచేత దీనిని 'బ్రహ్మపర్వము' అనికూడా అంటారు. వేదములు ఈ పండుగ నాటినుండే ఆరంభమయినట్లు ప్రతీతి. శ్రావణపూర్ణిమనాటి నుండి భాద్రపద బహుళ సప్తమి వరకు వేదములను ప్రచారము చేసే కార్యక్రమము చిరకాలము నుండే అమలులో ఉన్నది. ప్రాచీనకాలములో ఈ పండుగనాడు గురుకులములలో క్రొత్త విద్యార్థులను చేర్చుకునేవారు. యజ్ఞోపవీతము లేనివారికి అది సమకూర్చబడేది. గురుశిష్యుల మధ్య ఉండవలసిన పరమపవిత్రమైన, అత్యంత ఆవశ్యకమైన 'సంబంధము' స్థాపించబడటానికి ఈనాడే అంకురార్పణ జరిగేది. వేదమంత్రములచే అభిషిక్తింపబడిన రక్షాబంధనములను గురువులు తమ శిష్యుల చేతికి కట్టేవారు. ఈ సూత్రములు వారిని రక్షించడమేకాదు, వారిని ధర్మప్రతిజ్ఞ అనే బంధనముతో ముడిపెట్టేవి. సోదరీమణులు తమ సోదరుల చేతికి రక్షా బంధనమును కట్టి లేదా 'భుజరియా' అంటే గోధుమ లేదా బార్లీ మొలకలను అందించిగాని, మమ్ములను రక్షించటానికి నువ్వు ఏవిధముగా కర్తవ్య శీలుడవవుతున్నావు?' అని గుర్తు చేస్తారు. బదులుగా సోదరుడు వారికి స్వాంతనరూపములో ఏదో ఒక బహుమతిని అందజేస్తూ 'మేము మా సోదరీ మణులకే కాదు, యావత్ నారీజగత్తుకు కూడా ఎలాంటి ఆపద ఎదురైనా, ప్రాణాలొడ్డి వారికి హాని కలుగకుండా పోరాడుతాము' అని సందేశమిస్తారు.

ఈ శ్రావణపూర్ణిమనాడు మంచి పువ్వులు పూసే తీగలను, లతలను లేదా మొక్కలను ఈ ప్రపంచము యొక్క అందమును, సమృద్ధిని వృద్ధిచెయ్యటానికి నాటుతారు. పూర్వ కాలములో ఈ శ్రావణపూర్ణిమ పండుగ ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉండేది. ఈనాడు అది నామమాత్రముగా మిగిలి ఉండటము శోచనీయము. మన పూర్వీకులచేత ఎంతో దూరము ఆలోచించి ఏర్పరచబడిన ఈ పండుగ ప్రాముఖ్యతను మనము అర్థము చేసుకొని, ఆచరించి లాభాన్వితులము కావాలి. అప్పుడే మన సంస్కృతి యొక్క గౌరవము తిరిగి ప్రతిష్ఠించబడుతుంది, అజ్ఞానమనే అంధకారము తొలగిపోతుంది. శ్రావణీ పండుగ ముఖ్యముగా మనకు కొన్ని సందేశములను ఇస్తుంది.

1) శ్రావణపూర్ణిమనాడు వేదములు పూజించబడతాయి. అంటే ధర్మముతో నిండిన జ్ఞానము, చతుర్వేదములలో నిండి ఉన్న జ్ఞానమంతా ధర్మపూర్ణమే. వాటిని అర్థము చేసుకొని అమలు చెయ్యటము ద్వారా జీవితము సుఖశాంతులతో నిండుతుంది. ధర్మ, అర్థ, కామ, మోక్షములనే నాలుగు జీవన ఫలములు చేతికందుతాయి. ఈ మానవశరీరము ఎంతో అల్పమైనది. దీనిలో ఉన్న ఎముకలను, మాంసాన్ని, బజారులో వెలకడితే ముప్పావలా కూడా రాదు. ఇంతకన్నా జంతువుల శరీరములకు ఎక్కువ విలువ ఉంటుంది. మానవుడు అన్ని ప్రాణులలోకి 'శిరోమణి' అవటానికి కారణము అతడికున్న మెదడు. ఆ మస్తిష్కములోని జ్ఞానము కారణముగానే అతడు అసురుడో, సురుడో, దరిద్రుడో, ధనవంతుడో, పూజనీయుడో, నిందనీయుడో, బలవంతుడో లేదా బలహీనుడో ఏదో ఒకటి కాగలుగుతాడు. అందుచేత జ్ఞానమునకు అన్నింటికన్నా అధిక ప్రాముఖ్యత ఇవ్వబడింది. ఈ జ్ఞానము, బుద్ధి లేదా మస్తిష్కము లను సంస్కరించుకొనటానికి వేదములను పూజించవలసి ఉన్నది. వేదమంత్రములు సత్‌జ్ఞానము యొక్క భాండా గారములు. వాటిని చదవటము, వినటము, అర్థము చేసుకొని ఆచరించడము ద్వారా మంచి జ్ఞానము-ప్రకాశము వృద్ధి చెందుతాయి. వేదములను పూజించడము ద్వారా జ్ఞానము యొక్క ప్రాముఖ్యత, ఔన్నత్యం, ఉపయోగములను మనిషి అర్థము చేసుకొనగలుగుతాడు, తద్వారా మంచి జ్ఞానమును పొందటానికి అతడి శ్రద్ధ ఇనుమడిస్తుంది. అందుచేత శ్రావణ పూర్ణిమ పర్వదిన సందర్భముగా వేదములను పూజించే పద్ధతిని మన ప్రాచీనులు ప్రవేశపెట్టారు.

2) యజ్ఞోపవీతములో తొమ్మిది పోగులుంటాయి. ఈ తొమ్మిది పోగులు తొమ్మిది గుణములకు ప్రతీకలు. మూడు

**క్రమశిక్షణ లేకపోతే విజేతలు కాలేరు**

దారములు కలిసి ఒక పేటగా, మూడు పేటలతో యజ్ఞోపవీతం తయారవుతుంది. ఈ మూడు పేటలు జీవితములోని ఆత్మిక-బౌద్ధిక-ప్రాపంచికమనే మూడు ప్రధాన భాగములను సూచిస్తాయి. ఇందులో మళ్ళీ ఒక్కొక్క పేటలో ఉండే మూడు దారములు, ప్రతి ఒక్క రంగములోని మూడు గుణములకు సంకేతములు. ఆత్మికరంగములో 'వివేకము-పవిత్రత-శాంతి' అనే మూడు విలువైన సంపదలు ఉంటాయి. అలాగే బౌద్ధిక క్షేత్రము 'సాహసము-స్థిరత్వము-కర్తవ్యనిష్ఠ' అనే మూడు ముఖ్య సంపదలను కలిగి ఉంటుంది. ఆరోగ్యము-ధనము-సహకారము అనేవి మూడవదైన ప్రాపంచికరంగమునకు చెందిన అతి ప్రముఖమైన సంపదలు. ఏ వ్యక్తిలోనైనా సరే ఈ తొమ్మిది లక్షణములు లేకపోయినా లేదా కనీసము వాటిని పొందాలనే కోరికగాని, ప్రయత్నముగాని చెయ్యకపోయినా అతడు 'శూద్రుడు' అని పిలువబడతాడు.

**జన్మనా జాయతే శూద్రః (జన్మతః ప్రతిఒక్కరు శూద్రులే)**
**సంస్కారాత్ ద్విజ ఉచ్యతే (సంస్కారం వలన ద్విజులవుతారు)**
**వేదపఠి భవేత్ విప్రః (వేదాధ్యయనం వలన విప్రులవుతారు)**
**బ్రహ్మజానతే బ్రాహ్మణః**
**(బ్రహ్మను తెలుసుకోవడం వలన బ్రాహ్మణులవుతారు)**
**- ఋగ్వేదం ఆత్రేయ సంహిత 141-142 ఐదవ మండలం**

కానీ ఒక్కో రంగములోని మూడు ప్రత్యేక గుణములను పొందవలసిన ఆవశ్యకతను గురించి వ్యక్తి అర్థము చేసుకొనగలుగుతాడు. ఈవిధముగా ఆయా గుణములను పొందటానికి ప్రారంభించబడే ప్రయత్నములు తీవ్రమవుతుంటాయి. దీనినే రెండవజన్మ లేదా ద్విజత్వము అంటారు. **ఈ ద్విజత్వమనే తొమ్మిది గుణముల అభివృద్ధికొరకు ప్రయత్నించవలసిన బాధ్యతను భుజముమీద యజ్ఞోపవీతము రూపములో ధరించడము జరుగుతున్నది.**

శ్రావణపూర్ణిమనాడు పాత యజ్ఞోపవీతమును వదిలి వేసి క్రొత్తదానిని ధరిస్తారు. అంటే ఆ బాధ్యతను క్రొత్త కోణములో గుర్తుచేసుకొనటమే. 'మానవజీవితానికి అత్యంత ఆవశ్యకములైన, పరమ పవిత్రమైన తొమ్మిది దివ్యసంపదలను పొందటానికి అవసరమయ్యే జ్ఞానమును సముపార్జించటానికి గాను వేద పూజతోపాటు మనము యజ్ఞోపవీతమును ధరిస్తున్నాము' అనేదే యజ్ఞోపవీత ధారణలోని అంతరార్థము. ఇంతకుముందు యజ్ఞోపవీత సంస్కారము జరగనివారికి కూడా సామూహికంగా శ్రావణపూర్ణిమనాడు యజ్ఞోపవీతమును ధరింపజేయవచ్చు.

3) పెద్దవారినుండి ఆశీర్వాదములను పొందటమే రక్షా బంధనములోని ముఖ్య ఉద్దేశ్యము. తల్లిదండ్రులు, గురువు, వారితో సమానస్థాయి కలిగినవారు, ఇతర గురువులు ఎవరైనా ఉంటే వారు వారందరిని పూజించి, గౌరవించి, నమస్కరించడానినే 'గురుపూజ' అంటారు. పెద్దలవద్దకు వెళ్ళి వినమ్ర పూర్వకముగా వారిపట్ల శ్రద్ధ, కృతజ్ఞతా భావములను వెల్లడించడము, తప్పులేమైనా జరిగితే వాటిని మన్నించమని కోరటము, దయ ఉంచి ఆశీర్వదించమని ప్రార్థించడము, వేడుకొనడము-ఇదే రక్షాబంధనములోని మూలసందేశము. ఈ ప్రార్థనకు బదులుగా గురువు తన సహజమైన వాత్సల్యముచే ప్రేరేపించబడి ప్రార్థించినవారికి ఆశీస్సులను ఇస్తాడు. తమ యొక్క ఆశీర్వాదచిహ్నమైన రక్షాసూత్రమును శిష్యుని కుడిచేతికి గురువే స్వయముగా కడతాడు. ఇది పసుపు లేదా నారింజ రంగులో ఉంటుంది.

4) అక్కచెల్లెళ్ళు తమ సోదరునికి రాఖీ కడుతూ 'అతని యొక్క బాధ్యత కేవలం తన సంతానము వరకు మాత్రమే పరిమితము కాకూడదని, సోదరీమణులను కాపాడే బాధ్యత కూడా అతనిదేనని' గుర్తుచేస్తారు. స్త్రీల కష్టసుఖములను పట్టించుకోకుండా, వారిని అన్నివిధాలా సుఖముగా జీవించనియ్యకుండా, వారిపట్ల అకృత్యాలకు పాల్పడేవారిని శిక్షించని జాతి నశించిపోతుంది. వారిలో వర్ణసంకరము ఉత్పన్నమై కుటుంబ పరమైన సుఖశాంతులు మాయమై, కపటము-దుర్మార్గము, ద్వేషము మొదలైన దుర్భావనలు విస్తృతముగా వ్యాపిస్తాయి. అందుచేత అక్కచెల్లెళ్ళు రక్షింపబడాలనే ఉద్దేశ్యముతో రాఖీ కట్టడము జరుగుతుంది. ఇక్కడ ఒక సోదరి సమస్తమైన స్త్రీ జాతికీ ప్రాతినిధ్యం వహిస్తూ, తన అన్నకు అనగా పురుషులు యావన్మందికీ తమ కర్తవ్యమును గుర్తుచేస్తూ రాఖీ కట్టడమనే సాంప్రదాయము నెలకొన్నది. 'ఏ పురుషుడు, అబలయైన స్త్రీమీద అత్యాచారము చెయ్యకూడదు. అనగా పురుషజాతి యొక్క బలము, ప్రతి ఒక్క అబలకు న్యాయసమ్మతమైన సహాయమును అందించగలగాలి' అన్న విషయము రాఖీకి ఒక సవాలుగా నిలబడుతుంది.

5) గోధుమలు, బార్లీగింజల యొక్క మొలకెత్తిన అంకురాలను నాటడము, వాటిని పూజించడము వృక్షారోపణ మహోత్సవమును సూచిస్తుంది. శ్రావణీపండుగ సందర్భముగా

**క్రమశిక్షణతో మెలగడం విద్యార్థికి ఆభరణం వంటిది**

వనౌషధులను నాటడము జరుగుతుంది. పచ్చతనాన్ని ఇచ్చే వృక్షాలను పెంచడము ప్రపంచమునకు గొప్ప సేవ చెయ్యటమే. దీని గురించి ఆలోచించేకొద్దీ దాని ప్రాముఖ్యత తెలుస్తుంది. వృక్షములు గాలిలోని విషతత్త్వములను ఆహారముగా స్వీకరించి బదులుగా ప్రాణప్రదమైన ఆక్సిజన్‌ను మనకు అందిస్తున్నాయి. వృక్షములు అధికముగా ఉన్న ప్రదేశములలోనే వానలు విస్తారముగా కురుస్తాయని శాస్త్రజ్ఞులు నిరూపిస్తున్నారు. ఆకుల ఎరువుతో భూమి యొక్క ఉత్పాదకశక్తి పెరుగుతుంది. చెట్లనుండి లభించే కఱ్ఱ మనకు దైనందిన జీవితములో అత్యంత ఆవశ్యకమైన వస్తువు. వృక్షముల నీడన ఎన్నో ప్రాణులు సేద తీరుతుంటాయి. ఆరోగ్యరక్షణకు అవసరమైన రకరకముల విటమిన్లు చెట్లకు కాసే ఫలములలోనే మనకు లభ్యమౌతాయి. పండ్ల యొక్క సుగంధము, సౌందర్యము మన కళ్ళకు, మెదడుకు ఎంతో చల్లతనమును చేకూర్చుతాయి. ఔషధీమొక్కలు ఒక విధముగా అమృతముతో సమానమే. కఠినాతి కఠినమైన వ్యాధులకు కూడా వనౌషధులతో చికిత్స చెయ్యడము సాధ్యమే. దట్టమైన వృక్షములు ఉన్న ప్రదేశములలో నివసించే వ్యక్తులు ఎంతో దృఢముగా, ఆరోగ్యముగా, శాంతచిత్తులై, దీర్ఘజీవులుగా మనగలుగుతారు. ఈ విషయము స్పష్టముగా నిరూపించ బడినది కూడా!

పైన చెప్పబడిన అంశములన్నింటినీ దృష్టిలో ఉంచుకొని 'శ్రావణీ' పర్వదినమునాడు వృక్షములు నాటడమనే యజ్ఞము యొక్క ప్రాముఖ్యతను తెలుసుకొనాలి. పొలాలలోను, చేల గట్లమీదా, ఇంటిముందు, పెరటిలోను, ఖాళీ ప్రదేశములలో, బంజరు భూములలో, ఎక్కడ వీలైతే అక్కడ ఏమాత్రము స్థలం దొరికినా సరే తీగలు, లతలు, వృక్షములు, ఔషధీమొక్కలు, కూరగాయలు మొదలైనవన్నీ నాటాలి, వాటికి పాదులు చెయ్యాలి. వర్షఋతువు దీనికి అనువైన సమయం. స్త్రీలు ఎక్కువ కష్టము చెయ్యలేకపోయినా ఇంటిలోనే కుండీలలో చిన్న చిన్న మొక్కలను, తులసి మొదలైనవాటిని పెంచవచ్చు.

శ్రావణీ (రాఖీ) పండుగ ప్రతి సంవత్సరము మన కోసం ఐదు తథ్యములను తీసుకువస్తుంది. మనం వీటిని ఆచరిస్తే కనుక ఈ పండుగ మనకు అన్నివిధాలా మంగళప్రదం కాగలదు.

– *అఖండజ్యోతి, ఆగస్టు 1999*
అనువాదం: *శ్రీమతి కృష్ణకుమారి*

---

## విధాత హెచ్చరిక

*విధాత మనుష్యుల తయారుచేసి భూమిపైకి పంపుతూ ఇలా చెప్పాడు మనుష్యులతో "పుత్రులారా! మీరు మానవ జీవితాన్ని ఆత్మకళ్యాణానికై ఉపయోగించండి. మృత్యువు సమీపించిన వేళ పశ్చాత్తాపం చెందవలసిన అవసరం ఉండదు" అప్పుడు మనిషి విధాతను ఈ విధంగా కోరాడు. "అలాగే ప్రభూ! మృత్యువు మమ్ముల సమీపించుటకు ముందే మమ్ములను హెచ్చరించండి". దీనికి విధాత హామీ ఇచ్చాడు. భూమిపైకి వచ్చిన మనుష్యులు దారి తప్పి చరిస్తూ ఇంద్రియ సుఖాల రుచిలో పూర్తిగా నిమగ్నమై తమ జీవన లక్ష్యాన్ని మరచిపోయారు. గడువు పూర్తికాగానే వీరిని వృద్ధాప్యం వరించింది. పరలోకంలోని విధాతను చేరారు. అచ్చట వారు విధాతను ఇట్లు అడిగారు – "మీరు మాట ఇచ్చి తప్పారు, మృత్యువు మమ్ముల సమీపించుటకు ముందరే మమ్ముల తగిన రీతిలో హెచ్చరించెదమన్నారు. కానీ ఎట్టి హెచ్చరికలు మీ నుండి మాకందలేదు. దీనికి జవాబుగా విధాత ఇట్లు బదులిచ్చాడు. "పుత్రులారా! మీ కన్నుల దృష్టి సన్నగిల్లింది. గ్రుడ్డితనం ఆవరించింది. అట్లే చెవుల వినికిడి సన్నగిల్లింది, చెవుడు వచ్చింది. కాళ్ళు–చేతులు తమ పనిచేయుటకు మొరాయిస్తున్నాయి. అవిటితనం వచ్చింది. నా నుండి ఇన్ని హెచ్చరికలు అందినా వీనిని ఖాతరు చేయక మీరు సుఖాల వెంటబడి తిరిగారు. ఈ దోషమెవరిది?"*

*సత్యమేమనగా పరమాత్మ తనకు ప్రియమైన మానవుని అనుక్షణం హెచ్చరిస్తూ దారి తప్పకుండుటకై ప్రయత్నిస్తూ ఉంటాడు. బహుమూల్యమైన మానవ జీవితం వ్యర్థం కానివ్వరాదని ఆయన ఆకాంక్ష.*

– *అఖండజ్యోతి, మే 2014*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

---

**క్రమశిక్షణ వలన ఆనందం తగ్గదు, ఇంకా పెరుగుతుంది**

# జీవన దేవత సాధన, ఆరాధన -1

భగవంతుడు చిన్న చిన్న కానుకలతో, పూజలతో, భజనలతో ప్రసన్నుడు కాడు. ఇలా కొలిచే స్వభావం దుష్టులైన వారికి కూడా ఉంటుంది. భగవంతుడు న్యాయనిష్ఠ, వివేకం కలవాడు. వ్యక్తిత్వంలో ఆదర్శవాదమున్నవారిలో ఏ గొప్పదనం ఉప్పొంగుతుందో, దాని ఆధారంగానే ఆయన ప్రసన్నుడై తన అనుగ్రహాన్ని వర్షిస్తాడు.

విగ్రహారాధనకు అనేక విధానాలున్నాయి. వీటన్నింటి ఉద్దేశ్యం ఒకటే - మనిషిలోని వికారాలను తొలగించి సంస్కారాలను అభివృద్ధి చెందించి దైవానుగ్రహానికి అనుకూలంగా తయారు చేయడం.

సాధన ద్వారా సిద్ధి పొందడం అనే సిద్ధాంతం అందరు ఒప్పుకునేదే. ప్రశ్న ఏమంటే సాధన ఎవరిని ఉద్దేశించి చేయాలి? సమాధానమేమంటే జీవితాన్ని దేవతగా భావించి ముందుకుపోవాలి. ఇది ఈ చేతితో ఇచ్చి ఆ చేతితో పుచ్చుకునే విధానంలాంటిది. దీని ఆధారంతోనే ఆత్మసంతోషం, లోకంలో గౌరవం, దైవానుగ్రహంలాంటి అమూల్యమైన వరాలు లభిస్తాయి.

### ఆధ్యాత్మిక ప్రగతికి కీలకం జీవన సాధన

అతి సమీపంగా ఉన్నదానిని, అతి దూరంలో ఉన్నదానిని నిర్లక్ష్యం చేయడం మానవుని సహజ స్వభావం. ఈ సూక్తి జీవన సంపదలోని ప్రతిరంగానికీ అన్వయిస్తుంది. మనం ప్రతిక్షణం జీవిస్తుంటాం. కానీ దాని గొప్పతనాన్ని అర్థం చేసుకొని, దీనిని సద్వినియోగం చేయటం ద్వారా ఏఏ సిద్ధులను పొందగలమో ఆలోచించము. జీవులు జన్మించి కడుపు నింపుకుంటూ, జరుగుబాటు కోసం అవసరాలను పూర్తి చేసుకుంటూ, తుదిశ్వాస విడుస్తాయి. సృష్టికర్త ధనాగారంలో సర్వశ్రేష్ఠమైన కానుక మానవ జీవితం అనే ఆలోచన ఎప్పుడో కాని రాదు. ఈ జీవితం భగవంతుని అనుగ్రహము వల్ల లభించింది. దీనిని మనిషి సదుపయోగం చేయాలి. తనలోని లోపాలను పూరించడం ద్వారా తుచ్ఛుడైన మనిషి మహాత్ముడు అవుతాడు. విశ్వ ఉద్యానవనానికి కుశలుడైన తోటమాలివలె నీరు పోస్తాడు, పెంచుతాడు. స్వార్థ, పరమార్థాల సరైన జ్ఞానం పొందుతాడు. సంపత్తును సదుపయోగం చేయడంలో మొట్ట మొదటిది - పశు ప్రవృత్తుల కుసంస్కారాలను వదిలివేసి, సత్ప్రవృత్తులను తగిన పరిమాణంలో అలవరచుకోవడం. ఎవరు ఇందులో ఉత్తీర్ణులౌతారో, వారు దేవమానవుల కక్ష్యలో ప్రవేశిస్తారు. తమకు తాము మేలుచేసికోవడమే కాక, అసంఖ్యాకులను తన నావలో కూర్చోబెట్టి తీరాన్ని చేరుస్తారు. ఇటువంటి వారే అభినందనీయులైన, అనుకరించదగిన మానవులు. తృప్తి, తుష్టి, శాంతి అనే మూడు విధములైన ఆనందాలు ఇటువంటి వారికే లభిస్తాయి.

మానవజీవితం దివ్యశక్తి ప్రసాదించిన అమూల్యమైన సంపద. దానిని అప్పగించే సమయంలో అతని పాత్రతపై విశ్వాసం ఉంచబడుతుంది. మనుష్యుని ఎడల ఇది పక్షపాతం కాదు. ఉన్నతమైన వరం ప్రసాదించడానికి ఇది పరీక్ష. ఇతర జీవులు శరీరానికి సంబంధించిన ఆలోచనలు మాత్రం చేస్తాయి. కానీ సృష్టికర్త వారసుడైన, యువరాజైన కారణంగా - మానవుడు అనేకమైన కర్తవ్యాలు, బాధ్యతలు నిర్వర్తించవలసి ఉంటుంది. అందులోనే అతని గొప్పతనం, సార్థకత ఉన్నాయి. కడుపు నింపుకోవడానికి, లోభమోహాల తృప్తికి మాత్రమే తన కార్యక్రమాలను పరిమితం చేసుకొంటే అతనిని నరపశువు అని గాక ఇంకేమని అనగలము? లోభమోహాలకు అహంకారం కూడా కలిస్తే పరిస్థితి మరింతగా విషమిస్తుంది. అహంకారం అనేక విధములైన కుట్రలు పన్నుతుంది; పతన,పరాభవాల లోయలోనికి త్రోసివేస్తుంది. అహంకారంవల్ల ప్రేరేపింపబడిన వ్యక్తి అనాచారి, దురాక్రమణదారుడు అవుతాడు. అతని స్వరూపం భయంకరంగా తయారవుతుంది. దుష్టుల, దురాత్ముల, నరపిశాచాల స్థాయికి అతడు దిగజారుతాడు. ఈ విధంగా శ్రేష్ఠమైన సౌభాగ్యానికి ప్రతీక అయిన మానవ జీవితం దుర్గతికి కారణమౌతుంది. వరం శాపంగా మారుతుంది. ఈ రెండు మార్గాలనుంచి ఎవరైనా తనకు ఇష్టమైన మార్గాన్ని ఎన్నుకోవచ్చు. మనిషి తన అదృష్టాన్ని తానే నిర్మించుకుంటాడు.

సాధకులలో భిన్నత్వం ఉంటుంది. తాము ఇష్టపడిన దేవతలను వారు ఉపాసిస్తారు. ఆ దేవతల నుండి దయ, అనుగ్రహం ఆశిస్తారు. అందులో ఎంతవరకు సఫలమవుతారో

క్రమశిక్షణ ఉంటే ఏ పరీక్షలో అయినా నెగ్గవచ్చు

చెప్పలేము. ఎందుకనగా పరాధీన స్థితిలో అంతా యజమాని ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. సేవకుడు విధేయతనే చూపిస్తూ ఉంటాడు. కానీ, జీవనం అనే దేవత విషయం వేరు. తన అభ్యర్థన సముచితం అయితే, అతను సర్వం ఈ కల్పవృక్షం క్రింద పొందగలడు. దానిని మరోచోట పొందే అవకాశం లేదు.

బ్రహ్మాండం యొక్క అతి చిన్న రూపం పిండ పరమాణువు. బ్రహ్మాండంలో ఏమి ఉన్నదో అది మొత్తం పదార్థంలోని అతి చిన్న భాగమైన పరమాణువులో కూడా ఉన్నది. సౌరమండలం యొక్క సమస్త క్రియాప్రక్రియలు అందులో ధారణ చేయబడి ఉన్నాయి. విజ్ఞానవేత్తలు దీనిని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇదే సూత్రంలోని రెండవపక్షం ఏమిటంటే పరమసత్తా అయిన బ్రహ్మాండ చైతన్యం యొక్క చిన్నదయినా సమగ్రమైన ప్రతీక జీవి. వేదాంత దర్శనం ప్రకారం సంస్కరించబడిన ఆత్మయే పరమాత్మ. తత్వదర్శనం ప్రకారం ఈ శరీరంలోనే సమస్త దేవతలు నివసిస్తున్నారు. పరబ్రహ్మ యొక్క దివ్యశక్తుల సమస్త వైభవం జీవబ్రహ్మ యొక్క నిద్రిస్తున్న మండలాలలో సమగ్ర రూపంలో ఉన్నది. వాటిని మేల్కొల్పగలిగితే ప్రసిద్ధమైన అతీంద్రియ శక్తులు, అజ్ఞాత దివ్యశక్తులు జాగృతం, బలీయం, క్రియాశీలం కాగలవు. తపస్వి, యోగి, ఋషి, మనీషి, మహా మానవుడు, సిద్ధపురుషుడు ఇటువంటి శక్తులనే కలిగి ఉంటాడు. శాశ్వతం, సనాతనం అయిన సత్యం ఇది. ఎప్పుడో జరిగినది ఇప్పుడు కూడా జరుగవచ్చు. జీవితమనే దేవతను సాధన చేయడం ద్వారానే గొప్ప సిద్ధులు పొందవచ్చు. కస్తూరిలేడి విషయం గమనించండి. బయట వెదకడంవల్ల దానికి అలసట, విసుగు మాత్రమే మిగులుతాయి. ఆ సుగంధం యొక్క కేంద్రం తన నాభిలోనే ఉందని తెలిసినప్పుడు దానికి శాంతి లభిస్తుంది. పరమాత్మునితో సంపర్కం కోసం ఎక్కడో వెదకడం వ్యర్థం. **పరమాత్మ ఒక ప్రదేశానికో, ఒక కాలానికో, ఒక శరీరానికో పరిమితుడు కాదు. దానిని అతి సమీపంగా అంతఃకరణలో చూడవచ్చు.** జీవితం మొత్తం దాని ప్రత్యక్ష ప్రకటీకరణ. ఆ పరబ్రహ్మను శ్రద్ధతో మాత్రమే సాక్షాత్కరింప చేసుకొనవచ్చునని గీతాచార్యులు చెప్పారు. **ఎవరి శ్రద్ధ ఎంత గాఢంగా ఉంటుందో వారు అంతగా ఆ పరబ్రహ్మను పొందగలరు.** ఎవరు తమను తాము ఎలా ఊహించుకుంటారో వారు అలాగే తయారవుతారని కూడా చెప్పారు. తమను తాము తుచ్ఛులుగా, హేయమైన వారుగా తలుచుకుంటే, వారి వ్యక్తిత్వం ఈ విధంగానే మూస పోయబడుతుంది. తమ అంతఃకరణలో గొప్పతనాన్ని నింపుకున్న వారి అస్తిత్వం మానవీయ గరిమతో తొణికిసలాడుతుంది.

పరమాత్మ సర్వసమర్థుడు. ఆయనలో సర్వశక్తులు ఉన్నాయి. ఈ శాస్త్ర వచనాన్ని ఈ విధంగా కూడా చెప్పవచ్చు: ఆయన ప్రతినిధి, వారసుడు, యువరాజైన మానవుడు కూడా తన సృష్టికర్త విశేషతలను కలిగిఉంటాడు. ఆత్మవిస్మృతి అనే అజ్ఞానాంధకారం తన నిజస్థితిని కట్టివేసినప్పుడే కష్టాలు ఎదురవుతాయి. ఎటువైపు అడుగువేసినా ఎదురు దెబ్బలు తగులుతాయి. కాని అంధకారం తొలగిపోయి వెలుగు చూడగలిగితే అంతా ఉన్నది ఉన్నట్లుగా కనబడుతుంది. తన నిజ స్వరూపాన్ని తెలుసుకొని సరైన మార్గాన్ని ఎన్నుకోవడంలో ఆలస్యం జరగకపోవడమే ఆత్మజ్ఞాన ప్రకాశం ఉదయించడం.

గొర్రెల గుంపులో పెరిగిన సింహపు పిల్ల కథ మనందరికి తెలిసినదే. తనచుట్టుప్రక్కల ఉన్న వాతావరణం, ఆచారాలు మనిషిని తన సమూహానికి పరిమితం చేస్తాయి. కానీ, ఆత్మజ్ఞానం కలిగినప్పుడు ఆత్మశక్తి "శుద్ధోః - బుద్ధోః - నిరంజనోసి" అనే సిద్ధాంతాన్ని అక్షరాలా చరితార్థం చేస్తుంది. "మానవుడు దారితప్పిన దేవత" అనే మాటలో అతనిని గురించిన నిజమైన విశ్లేషణను చూడవచ్చు. అతడు సరైన దారిలోకి వస్తే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. సమస్తమైన భవబంధాల నుండి విముక్తి లభిస్తుంది. అజ్ఞానంలో చేసిన ఆలోచన వలన జరిగిన పొరపాటును సరిదిద్దు కునేందుకు మోక్షమార్గం ఒక్కటే మార్గం. సాలెపురుగు తన శరీరం నుండి కారిన ద్రవంతో వలను తయారు చేసి అందులోనే తిరుగుతుంటుంది. కానీ సంతోషం ఎక్కువైనప్పుడు ఆ వలను ఒకటిగా చుట్టివేసి మింగివేస్తుంది. హేయమైన జీవితం స్వయం కృతం. ఎలా ఆలోచిస్తే, ఎలా కోరితే అటువంటి పరిస్థితులు ఏర్పడతాయి. ఇపుడు వాటిని మార్చుకోవాలనిపిస్తే, ప్రాధాన్యతలు, కోరికలు, విధి విధానాలు తారుమారు అవుతాయి. నికృష్టుడు ఉత్కృష్టుడు అవుతాడు. క్షుద్రుని నుండి మహాత్ముడు తయారు కాగలడు.

"సాధన ద్వారా సిద్ధి" అనే సిద్ధాంతం సర్వసమ్మతమే. అయితే ఎవరికొరకు సాధన చేయాలి అనేదే తెలుసుకోవాలి. ఇతరేతర ఇష్టదైవాల స్వరూప స్వభావాలు మనం ఊహించినట్లు ఉన్నాయో లేవో చెప్పలేము. ఇందులో సందేహించడానికి

**పోటీ ప్రపంచంలో కష్టపడి పనిచేసే వారికే స్థానం ఉంటుంది**

స్పష్టమైన కారణ మున్నది. ఈ విశ్వ వ్యవస్థ అంతా ఒక్కటే. సూర్యుడు, చంద్రుడు, వాయువు సర్వవ్యాప్తములు. భగవంతుడు కూడా సర్వజనీనుడు, సర్వవ్యాపి. మరి ఆయనకు అన్ని రూపములు ఎలా వచ్చాయి? ఆయన యొక్క వివిధ ఆకారాలను, గుణ స్వభావాలను మనం ఎలా అర్థం చేసుకోవాలి? పై విశ్వాసం నిజమైతే, ఆయన స్వరూపం సర్వవ్యాప్తం కావాలి. వివిధ మతాలు కారణంగా ఆ స్వరూపం అనేక విధాలుగా ఉంటే, అది విశ్వాసాల చిత్ర విచిత్రమైన వ్యక్తీకరణమని భావించాలి. ఇటువంటి దశలో నిజం ఎలా తెలుసుకోవాలి? ఈ ప్రశ్నకు సరైన సమాధానం ఏమిటంటే జీవితాన్నే జీవం కలిగిన, జాగృతమైన దేవతగా భావించడమే; తనపైన పేరుకున్న కషాయ కల్మషాల క్షాళనకు ప్రయత్నించడమే. నిప్పుకణికపై పేరుకున్న బూడిద వలన అది నల్లగా కనబడు తుంది. ఆ పొరను తొలగిస్తే లోపల దాగి ఉన్న నిప్పురవ్వ స్పష్టంగా కనబడుతుంది. సాధన ఉద్దేశ్యం ఈ పొరలను తొలగించడమే. గాఢ నిద్ర నుండి మేలుకొలపడం అని కూడా దీనిని వర్ణించవచ్చు.

ఆధ్యాత్మిక విజ్ఞానతత్వవేత్తలు అనేక విధములైన సాధనా పద్ధతులను తెలియపరచారు. వాటిని లోతుగా విశ్లేషణ, వివేచన చేస్తే తెలిసేదేమంటే అవి చిహ్నపూజలు తప్ప మరేవీ కాదని; ఆత్మశుద్ధి కొరకు పసిపిల్లలకు అందించే ప్రతిపాదనలని. పాత్రతను, తీక్షణతను పెంపొందించుకొనడమే యోగానికి, తపస్సుకు లక్ష్యం. పాత్రత ఒక అయస్కాంతం. అది తనకు ఉపయోగపడే వస్తువులను, శక్తులను సహజంగానే తనవైపునకు ఆకర్షించుకుంటూ ఉంటుంది. మనిషిలోని వికసించిన దైవత్వం అనే అయస్కాంతం ప్రపంచంలో వ్యాపించిఉన్న శక్తులను, పరిస్థితులను తనవైపు ఆకర్షిస్తూ ఉన్నది. జలాశయాలు లోతుగా ఉంటాయి. అన్ని నదులు సముద్రంలోకి చేరుతాయి. ఇది వాటి లోతుకు ఫలితం. పర్వత శిఖరాలపైన చల్లదనం పెరగడం వలన మంచు పేరుకుపోయినా, ఉష్ణం పెరగటం వల్ల అది కరిగిపోయి, నదుల ద్వారా సముద్రంలోకి చేరుతుంది. ఈ లోతునే పాత్రత అంటారు. **పాత్రతను పెంచుకోవడమే సాధనలోని మౌలిక ఉద్దేశ్యం.** భగవంతునికి ఎవరి ముఖస్తుతి కాని, నైవేద్యం కాని అవసరం లేదు. చిన్న చిన్న కానుకలతో చేసే పూజల ద్వారా కాని, భజనల ద్వారా గాని ఆయన ప్రసన్నం కాడు. ఇటువంటి స్వభావం క్షుద్రులలో మాత్రమే ఉంటుంది. భగవంతునికి అటువంటి మనస్తత్వం లేదు. ఆయన న్యాయనిష్ఠ, వివేకం కలవాడు. **వ్యక్తిత్వంలోని ఉత్కృష్ట ఆదర్శవాదం వల్ల ఉద్భవించే గొప్పతనం ఆధారంగానే ఆయన ప్రసన్నుడై అనుగ్రహాన్ని వర్షిస్తాడు.** ఆయనను బుజ్జగించడానికి ప్రయాసపడేవారి బాలక్రీడ నిరాశనే ఇస్తుంది.

ఋషి అడిగాడు – "కస్మై దేవాయ హవిషా విధేమ". – అనగా "మేము ఏ దేవుని కోసం భజన చేయాలి"? దానికి ఖచ్చితమైన సమాధానం – "ఆత్మ దేవుని కొరకు". చింతన, శీలం, ప్రవర్తన అనే గీటురాయిపై శ్రేష్ఠతను సిద్ధంపచేసుకొనే స్థితియే 100 శాతం బంగారం. చెట్లపైన పూలు, పండ్లు పైనుండి రాలిపడి బరువెక్కవు. భూమినుండి పీల్చే సారం ద్వారా చెట్లు పెరిగి పుష్పించి ఫలిస్తాయి. అలాగే వేళ్ళు మన లోపలే ఉన్నాయి. అవి మన సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయి, సిద్ధులు, శక్తులు ప్రాప్తిస్తాయి; ఆధ్యాత్మిక గరిమ, భౌతిక ప్రగతి లభిస్తాయి. పాత్రత ఇతరుల ముందు చేయిచాచి బ్రతిమాలడం వలన లభించదు. తమకు తాము సహాయం చేసుకొనేవారికి, ఇతరులకు సహాయంచేసేవారికి మాత్రమే భగవంతుడు సహాయం చేస్తాడు. ఆత్మశుద్ధి, ఆత్మశోధన ఇవే జీవన సాధన. దీనినే పరమ పురుషార్థమంటారు. ఈ లక్ష్యాన్ని అర్థం చేసుకొన్నవారు తెలుసుకోవలసిందేమంటే వారు ఆధ్యాత్మిక తత్వజ్ఞానం యొక్క రహస్యాన్ని, మార్గాన్ని హస్తగతం చేసుకుంటారు; చరమ లక్ష్యాన్ని చేరే రాజమార్గాన్ని కనుగొంటారు.

– *అనువాదం: ఊటుకూరి సత్యనారాయణ గుప్త*

## ఆత్మ స్థైర్యం

*ఒక చెయ్యి, ఒక కాలు లేని అవిటివాడు ఒకసారి రైలు పెట్టెలోనికి ఎక్కాడు. ఆతనిని చూచి జాలిపడి ఒక వ్యక్తి పిలిచి రూపాయి బిళ్ళ చేతిలో పెట్టపోయాడు. కాని ఆ బాలుడు తీసికోవటానికి నిరాకరించాడు. "అయ్యా భగవంతుడు ప్రసాదించిన 12 అవయవాలలో 2 మాత్రమే నాకు కరువయ్యాయి. ఫరవాలేదు, మిగిలిన వాటితో జీవించగలను." అన్నాడు. తరువాత ఆ బాలుడే వేరుశనగ కాయలు అమ్మటం ప్రారంభించి బ్రిస్బేన్‌లో గొప్ప పారిశ్రామికవేత్తగా పేరు ప్రఖ్యాతులు పొందాడు.*

– *అనువాదం: పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**కష్టాలు రావచ్చు, నష్టాలు రావచ్చు, కానీ అనుకున్నది సాధించాలి**

# దేవ మానవుడు వచ్చారు

## తన పని ముగించుకు వెళ్ళారు - మనం గుర్తించలేకపోయాం !!



**డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు,** ఎం.ఎస్.సి., పి.హెచ్.డి.

| జననం: | జీవిత కాలం: | మహాప్రస్థానం: |
| --- | --- | --- |
| 14-10-1948 | 24,000 రోజులు | 30-06-2014 |

తన గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య శరీరాన్ని విడచిన **24 సంవత్సరాలకు** తాను కూడా తన శరీరాన్ని విడచారు.

# మాస్టర్ ఆర్.కె. గారికి శ్రద్ధాంజలి సుమాలు



వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట,
పండిత శ్రీరామశర్మ ఆచార్య,
పరమ వందనీయ మాతా
భగవతీదేవిశర్మల
మానస పుత్రులు

## డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు

ఎం.ఎస్.సి., పి.హెచ్.డి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో
గాయత్రీ మంత్రము మరియు
గాయత్రీ యజ్ఞముల
బీజాలు నాటి వ్యాప్తిగావించారు
వీరు చేసిన కృషిపై యుగశక్తి గాయత్రి
భక్తి శ్రద్ధలతో సమర్పించుచున్న
శ్రద్ధాంజలి సుమాలు...



## గాయత్రీ మహామంత్రము

**ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం। భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్॥**

**భావము:** ఆ ప్రాణస్వరూపము, దుఃఖనాశకము, సుఖస్వరూపము, శ్రేష్ఠము, తేజోవంతము, పాపనాశకము, దేవస్వరూపము అయిన పరమాత్మను మేము అంతరాత్మలో ధరించెదముగాక!
ఆ పరమాత్మ మా బుద్ధిని సన్మార్గము వైపు ప్రేరేపించుగాక!

**మాష్టారు తన జీవితంలో గాయత్రీమాతను అనుక్షణం స్మరిస్తూ ప్రతి అణువణువు నింపుకున్నారు**

# గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్ గురుయుగ్మము



## పరమ పూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు - పరమ వందనీయ మాతా భగవతీదేవి శర్మ

డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారు గారికి
గాయత్రీ మంత్ర దీక్షను ప్రసాదించి
సమర్థునిగా తీర్చిదిద్దిన
పూజ్య గురుదేవులు

మాస్టారు గారికి మాతృప్రేమను
పంచి, తమ మానస పుత్రునిగా
తన ఒడిలోనికి తీసుకున్న జగన్మాత



# श्री वेदमाता गायत्री ट्रस्ट

शान्तिकुञ्ज, हरिद्वार- 249411

डॉ. प्रणव पण्ड्या ( एम.डी. )
प्रमुख–अखिल विश्व गायत्री परिवार
निदेशक–ब्रह्मवर्चस शोध संस्थान
कुलाधिपति–देव संस्कृति विश्वविद्यालय

शैलबाला पण्ड्या
सुपुत्री: माता भगवती देवी शर्मा
वेदमूर्ति तपोनिष्ठ पं.श्रीराम शर्मा आचार्य

दिनांक:19-07-14

आदरणीय भाई साहब/ बहिन जी

परम पूज्य गुरुदेव के परम शिष्य अखिल विश्व गायत्री परिवार के वरिष्ठ कार्यकर्ता मास्टर रामकृष्ण जी के 30 जून 2014 को देहावसान के समाचार सुनकर हमको बहुत हार्दिक दुःख हुआ। परम पूज्य गुरुदेव युग परिवर्तन करने के लिए धरती पर अवतरित हुए, उनके साथ अनेक दिव्य आत्मायें उनकी लीला सहचर बनकर पृथ्वी पर आयी हुई हैं। उन्हीं दिव्य आत्माओं में से एक हमारे मास्टर रामकृष्ण जी थे। उन्होंने अपना सम्पूर्ण जीवन परम पूज्य गुरुदेव के संदेश को जन–जन तक पहुँचाने के लिए श्रद्धा–निष्ठापूर्वक कार्य किया। जिससे अनेक आत्माओं का गुरुदेव का प्रकाश मिला।

मास्टर रामकृष्ण जी की अंतिम इच्छा थी कि उनके सम्पर्क के भाई- बहिन आंध्र-प्रदेश को गायत्री प्रदेश बनाने के लिए घर–घर गुरुदेव का संदेश पहुँचाने का ईश्वरीय कार्य करें और अखंड ज्योति तेलुगू पत्रिका के एक लाख सदस्य बनायें। आशा है गायत्री परिवार के समर्पित भाई–बहिन पूज्य गुरुदेव के कार्य को श्रद्धा निष्ठापूर्वक अवश्य पूरा करेंगे। जिससे पूज्य गुरुदेव के अनुदान–वरदान मिलेंगे।

मास्टर रामकृष्ण जी परम पूज्य गुरुदेव एवं परम वंदनीया माता जी के गोद में पहुँच गये हैं । हम उनकी आत्मा की शांति, सद्गति एवं उच्चतर लोक में स्थान हेतु परम पूज्य गुरुदेव–वंदनीया माता जी के चरणों में हार्दिक प्रार्थना करते हैं।

आपका भाई

( डॉ. प्रणव पण्ड्या )

आपकी बहिन

( शैलबाला पण्ड्या )

फोन:01334- 260602, 260309, 260403, 261328 फैक्स:-91-133 260866
Email : shantikunj@awgp.org Website : www.awgp.org

తెలుగు సేత

# శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు

శాంతికుంజ్, హరిద్వార్ - 249411

డా॥ ప్రణవ్ పండ్యా (ఎమ్.డి.)
అఖిల విశ్వగాయత్రీ పరివార్ - ప్రముఖ్
బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్ - నిర్దేశక్
దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం - ఛాన్సలర్

శైలబాల పండ్యా
సుపుత్రి: మాతా భగవతీదేవిశర్మ,
వేదమూర్తి, తపోనిష్ఠ
పండిత శ్రీరామశర్మఆచార్య

ఆదరణీయ సోదర / సోదరీమణి

తేది : 19-07-2014

పరమపూజ్య గురుదేవుల పరమ శిష్యులు, అఖిల విశ్వగాయత్రీ పరివార్ వరిష్ఠ కార్యకర్త మాష్టార్ రామకృష్ణగారు 30 జూన్ 2014న స్థూల శరీరాన్ని విడచిపెట్టారన్న సమాచారాన్ని విన్నంతనే మేము మిగుల దుఃఖితులయ్యాము. పరమపూజ్య గురుదేవులు యుగపరివర్తన గావించుటకై ఈ అవనిపై అవతరించిరి. గురుదేవులతో పాటు అనేక దివ్యాత్మలు వారి లీలాసహచరులుగా అవనిపైకి వచ్చారు. అట్టి దివ్యాత్మలలో మన రామకృష్ణగారు ఒకరు. వీరు తమ సంపూర్ణ జీవితాన్ని పరమపూజ్య గురుదేవుల సందేశాన్ని ఇంటింటికి చేర్చుటకై అత్యంత శ్రద్ధ నిష్ఠలతో పనిచేశారు. దీనితో అనేకానేక అత్మలకు గురుదేవుల ప్రకాశము లభించింది.

మాష్టార్ రామకృష్ణగారి అంతిమ కోర్కెలు – వారి సంపర్కములోని సోదర సోదరీమణులు పూర్వపు ఆంధ్రప్రదేశ్‌ను గాయత్రీ ప్రదేశ్‌గా తయారు చేయుటకై, ఇంటింటికి గురుదేవుల సందేశాన్ని చేర్చుటను, భగవంతుని పనిలా చేయాలి. మరియు యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారుల సంఖ్యను లక్షకు చేర్చుట. గాయత్రీ పరివార్ పనికై సమర్పణ చేసుకున్న సోదర సోదరీమణులంతా పూజ్య గురుదేవుల పనిని మిగుల శ్రద్ధ నిష్ఠాపూర్వకంగా తప్పక పూర్తిచేసెదరని ఆశించుచున్నాము. దీనివలన పూజ్యగురుదేవుల అనుదానం - వరదానాలు వారికి లభిస్తాయి.

మాష్టార్ రామకృష్ణగారు పరమపూజ్య గురుదేవులు మరియు పరమ వందనీయ మాతాజీల ఒడిని చేరుకున్నారు. మేము వారి ఆత్మకు శాంతి, సద్గతితోపాటు సర్వోన్నత లోకంలో స్థానం కొరకై పరమపూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీల చరణాలకు హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాము.

మీ సహోదరుడు
డా॥ ప్రణవ్ పండ్యా

మీ సహోదరి
శైలబాలా పండ్యా

1948వ సం॥ అక్టోబరు 14, ఆశ్వీయుజ మాసం, గురువారం, ద్వాదశి తిథి, **శతభిషా (24వ)** నక్షత్రయుక్త కుంభలగ్నాన మచిలీపట్నం లో శ్రీ కామరాజు-సక్కుబాయి పుణ్య దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించారు.

వీరి తాతగారు శ్రీ సోమేశ్వరరావుగారు శ్రీరామకృష్ణ పరమ హంసగారి భక్తులు, ఆరాధకులు. శ్రీ కృష్ణుని అంశతో ఒక మనుమడు పుడితే చూచి ఆనందించి తరించాలనెడి ప్రగాఢ వాంఛతో ఆయన అనునిత్యము జపిస్తూ ఉండేవారట. "సిరీస్" నక్షత్రం నుండి మానవజాతి ఉద్ధరణకై, అఖండ గురుసత్తా కోరిక మేరకు దివ్యాత్మలు మానవజన్మను ధరించి భూమిపైన నడయాడదరనెడిది భాగవతోత్తముల ఉవాచ. కొందరి జ్యోతిష శాస్త్రవేత్తల లెక్కలు కూడా దీనినే బలపరుస్తున్నాయి. ఈ రీతిగా మారెళ్ళ శ్రీరామకృష్ణ జన్మను తీసికొనుట జరిగింది.

శ్రీరామకృష్ణగారి బాల్యం నుండి తన తాతగారైన సోమేశ్వరరావు గారి వద్ద చనువెక్కువ. ఆయన వెంట తిరుగుతూ, కథలు వింటూ బాల్యసాధనలైన సంధ్యావందనం మున్నగు వానిని చక్కగా శ్రద్ధాసక్తులతో నేర్చుకొనుట చూచి తాతగారు ఎంతో మురిసిపోయే వారు. దీనితో మనుమనిపై మమతాను రాగాలు ముప్పిరిగొనగా తన వెంట కాశీకి మనుమని తీసికొని పోయారు. దీనితో రామకృష్ణగారి బాల్యంతో పాటుగా, విద్యాభ్యాసం కూడా కాశీలోనే పూర్తిచేశారు. తదుపరి కళాశాల ఉన్నత విద్య కాశీ విశ్వవిద్యాలయంలో పూర్తిచేసి, ఎమ్.ఎస్.సి. మరియు పి.హెచ్.డి. పట్టాలను రసాయన శాస్త్రంలో పొందారు.

శ్రీరామకృష్ణగారు ఒక ప్రక్క తన భౌతిక జీవనానికి కావలసిన విద్యలనభ్యసిస్తూ, మరో ప్రక్క తన ఆధ్యాత్మిక జీవన ప్రగతికి కావలసిన సాధనలను ముప్పది ముగ్గురు (33) గురువుల వద్ద నేర్చుకొన్నారు. ఈ గురువులలో పేరెన్నికగన్న నిష్ణాతులైనవారిలో కొందరు శ్రీ లంబోదరస్వామి, లాల్ భయ్యా యోగి, సాయిబాబు శోభామాత, త్రైలింగస్వామి, మాతా ఆనందమయి మున్నగువారున్నారు.

కాశీలో ఉన్నప్పుడు ఒక సాధువు ద్వారా అయాచితంగా "మహాసర్ప" మంత్రాన్ని పొందారు. (దీని సహాయంతో మృత్యు ఒడిలోనున్న వారికి ప్రాణదానం గావించి, పునర్జన్మను ప్రసాదించగలరు. తరువాతి కాలంలో దీనిని ప్రయోగించి పునర్జన్మను ప్రసాదించారు తన శిష్యులలో కొందరికి). అదే విధంగా కాశీలోని పంచ గంగ ఘాట్‌వద్ద నున్న బిందు మాధవ స్వామి దేవాలయంలో, ఒక సాధువు సహాయంతో "నక్షత్ర" సాధనను పూర్తిచేశారు. ఈ సాధన ద్వారా సప్తర్షుల అనుగ్రహాన్ని పొందారు.


తీవ్రసాధనలో మాస్టార్ ఆర్.కె.






నిత్య సంధ్యావందనంలో మాస్టార్ ఆర్.కె.



ఒడిశాలోని కోణార్క్ సూర్యదేవాలయం వద్ద



బెంగుళూరులోని కోటి లింగాల క్షేత్రంలో



అమెరికాలోని నయాగారా జలపాతం వద్ద




కర్నాటకలోని సిరిగుప్ప పిరమిడ్ ధ్యానకేంద్రంలో

బాల్యదశ నుండి మాతామహుల సాంగత్యంలో, శిక్షణలో కాశీ విశ్వేశ్వరుని కృపాకటాక్షముతో ఆధ్యాత్మిక వాసనల అఘ్రాణించిన శ్రీరామకృష్ణ పువ్వు పువ్వు నుండి జుంటి తేనెను ప్రోగుచేసెడి భ్రమరములా అనేకానేక ఆధ్యాత్మిక గురువుల నుండి ఆధ్యాత్మిక మకరందాన్ని అపారంగా ప్రోదిచేసుకుని ఆఖరి మజిలీగా గాయత్రీ ఉపాసకులు, యుగద్రష్ట, తపోనిష్ఠ, పూజ్యశ్రీ పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు మరియు వందనీయ మాతా భగవతీదేవిశర్మల అనుంగు శిష్యునిగా మథురలోను, శాంతికుంజ్‌లోను **తన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పటుతరం గావించుకొని, ప్రౌఢత్వాన్ని సంతరించుకొన్న అఖండ జ్ఞానఖని.**

శ్రీరామకృష్ణగారు అతి పిన్న వయస్సులోనే ఆధ్యాత్మిక విద్యా శిఖరాగ్రానికి అతి శీఘ్రంగా చేరుకున్నారు. కాశీలో ఒక రోజు సిటీ బస్సులో ప్రయాణిస్తుండగా తన ఎదుట నిలబడి ప్రయాణించుచున్న ఒక వ్యక్తి చంకలో నుండి "అఖండజ్యోతి" హిందీ మాస పత్రిక జారిపడింది. దీనిని శ్రీరామకృష్ణగారు అందుకొని వీక్షించారు. దానిలోని విషయాలు తనలో ఉత్సుకతను రేకెత్తించగా, **ఆ పత్రికను నడుపుచున్న వారిని చూడాలనెడి కోరిక మొగ్గ తొడిగింది.** తదుపరి తన భావి గురువును కలిసికొనుటకై మథురకు బయలుదేరి వెళ్ళి గాయత్రి ప్రతిరూపమైన పండిత శ్రీరామశర్మ ఆచార్యుని కలిసికొన్నారు. "నీ రాకకోసం ఎదురుచూస్తున్నాను. ఎన్నిసార్లు పిలవాలి నిన్ను?" అనెడి ఒక్క ఆత్మీయ పరామర్శతో శరీరం గగుర్పొడచగా తన గురువు పాదాలను స్పృశించారు శ్రీరామకృష్ణ. **ఈ రీతిగా ఈ గురుశిష్యుల సంబంధం పుష్పించింది.**

అటు తర్వాత శ్రీరామశర్మగారి వద్ద అనేక ఆధ్యాత్మిక సాధనలను పూర్తి చేశారు. కుండలినీ జాగరణ విద్యలో కూడా ప్రావీణ్యాన్ని సంపాదించిరి. **ఈ విధంగా పరమపూజ్య శ్రీరామశర్మ ఆచార్య మరియు పరమ వందనీయ మాతా భగవతీదేవి శర్మల మానసపుత్రునిగా ఎదిగారు.** ఉత్తర భారతదేశం ఋషుల భూమిగా పేరుగాంచి ఉంది. ఇదే విధంగా **దక్షిణ భారతదేశాన్ని కూడా తపోభూమిగా మలచాలనెడి సంకల్పం మదిలో మెదలగా, మహాకాలుని ప్రతిరూపమైన శ్రీ శ్రీరామశర్మ ఆచార్య, తన మానస పుత్రుడైన డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణను ఈ బృహత్కార్య సాధనకై ఎంచుకొనుట జరిగింది.**

తన గుర్వాజ్ఞను శిరస్సునదాల్చి, తన కప్పగించిన పనిని ప్రారంభించుటకై తన జన్మస్థలమైన ఆంధ్ర రాష్ట్రానికి చేరుకున్నారు. కొంతకాలంపాటు రాయలసీమలోని అనంత పురం పట్టణంలో ప్రముఖ హోమియో వైద్యులైన డా॥ చలపతి రావుగారి వద్ద హోమియో వైద్యాన్ని అభ్యసించి, వారి ఆశీస్సులతో వైద్యాన్ని ఒక హాబీగా చేపట్టి బాధాతప్తులకు బాధానివారణ గావించారు.

"ఉద్యోగం పురుష లక్షణం" అనెడి లోకోక్తిననుసరించి ఉదర పోషణార్థమై, స్వావలంబన కాంక్షతో గుంటూరు పట్టణంలోని టి.జె.పి.ఎస్. కళాశాలలో రసాయనిక శాస్త్ర ఉపన్యాసకునిగా దాదాపు రెండు దశాబ్దాల పైచిలుకు పనిచేశారు. ఈ కాలములో పట్టాభి పురమునకు సమీపంలో నున్న వేణుగోపాలనగర్, ఎన్.జి.జి.ఓ. కాలనీలో నివాసమేర్ప రచుకొని తన గుర్వాజ్ఞను నెరవేర్చుటకై తన ప్రణాళికను అమలుచేయనారంభించారు. దీనిలో మొదటిమెట్టుగా అనేకానేక మందికి గాయత్రీ మంత్రాన్ని, గాయత్రీ యజ్ఞాన్ని నేర్పించి, వీరి ద్వారా ఆంధ్ర రాష్ట్ర నలుచెరగులా గాయత్రీమంత్రోపాసనను మరియు గాయత్రీ యజ్ఞాన్ని బహుళ వ్యాపితం గావించిన కృషీవలుడు. ఈ కాలమందే, డా॥ తుమ్మూరి శివరామకృష్ణారెడ్డి, శ్రీ అశ్విని సుబ్బారావు, శ్రీమతి రాజ్యలక్ష్మి, శ్రీ డి.వి.ఎన్.బి. విశ్వనాథ్, శ్రీమతి సావిత్రి-ఎన్.ఎల్.ఎన్.మూర్తి దంపతులు మున్నగు ప్రముఖులంతా శ్రీరామకృష్ణగారి ద్వారా గాయత్రీ విజ్ఞానానికి పరిచయమై గాయత్రీ పరివార్ కార్యక్రమాలను ఆంధ్రదేశం నలుచెరుగులా వ్యాప్తి గావించుటలో ప్రముఖ పాత్రను పోషించుట జరిగింది.

తదుపరి అనేకానేక మంది పరిజనులకు ప్రేరణనిస్తూ గాయత్రీ సాధనలు తెలుపుతూ, సప్తఋషి ఆశ్రమం-గుంటూరు; అగస్త్య ఆశ్రమం-రేపల్లె, గుంటూరు జిల్లా; శ్రీ హంసరామ ఆశ్రమం-కాకివాయి, నెల్లూరు జిల్లా; శ్రీరామ హంస సహ్యాద్రి ఆశ్రమం-ఓడరేవు, చీరాల; నిత్య దత్తావతార క్షేత్రం-వేటపాలెం, చీరాల; అనుగ్రహపీఠం-ఒంగోలు; గ్లోబల్ పవర్ సెంటర్ మౌంట్ శంబళ-దేశ్‌ముఖి గ్రా॥, హైదరాబాద్ మున్నగువానిని స్థాపింపజేసి సకల జనుల తరింపజేసెడి స్థావరాలను ఏర్పాటు చేశారు.

వివిధ ఆధ్యాత్మిక సంస్థల అధిపతులను ఒకే వేదిక పైకి చేర్చి, సర్వమతముల సారము ఒక్కటే సర్వ ఆధ్యాత్మిక విధి విధానాల లక్ష్యమొక్కటే అనెడి సత్యాన్ని బోధిస్తూ **అంతర్యాగ మనెడి ఒక నూతన యజ్ఞానికి రూపునిచ్చారు. దీని వేదిక ద్వారా "ఒకే మతం, ఒకే విశ్వం, ఒకే భాష" అనెడి దానిని అందరి లక్ష్యంగా చేస్తూ ఈ సంస్థల మధ్య సామరస్యానికై పాటుపడిరి. ఈ లక్ష్యసాధనలో భాగంగా, పిరమిడ్ ధ్యాన సంస్థను, స్వామి అయ్యప్పగురుస్వాములను, ఓంశాంతి సంస్థను, శ్రీ విఠల్‌బాబాగారిని, అమలాపురంలోని గీతా ఆశ్రమాన్ని, థియోసాఫికల్ సొసైటీ వారిని, అరబిందో సొసైటీ, షిర్డిసాయి సంస్థాన్ భక్తులను, అవతార్ మెహర్‌బాబా సంస్థను, మున్నగువారి మధ్య ఒక పరస్పర అవగాహనను పెంపొందించెడి దిశగా బీజాలను నాటారు.** "Heart and Head must be Linked" అనగా "ఆలోచనలు, సద్బుద్ధికి దారితీసి ఏకీకృతం కావాలి". ఇదే గాయత్రీ ఉపాసనా లక్ష్యం అని **ఆధ్యాత్మిక విద్యను సూక్ష్మీకరించి చెప్పిన జ్ఞానదాత.**





తాడేపల్లి కృష్ణానది తీరాన భక్తి చైతన్యానంద ఆశ్రమంలో




బెంగుళూరులోని అరబిందో ఆశ్రమంలో ప్రసంగించుచున్న మాష్టార్ ఆర్.కె.




చెన్నైలోని అడయార్ థియోసాఫికల్ సొసైటీలో మాష్టార్ ఆర్.కె.



రమణి బాబాతోపాటుగా దత్తసాయి విగ్రహ ప్రతిష్ఠలో మాష్టార్ ఆర్.కె.




అమలాపురం ప్రహ్లాద్ బాబాతో మాష్టార్ ఆర్.కె.



ఋషికేష్‌లోని స్ఫటిక లింగముతో మమేకమైన మాష్టార్ ఆర్.కె.




తమిళనాడులోని తిరువణ్ణామలైలోని శ్రీ భగవాన్ రమణ మహర్షి ఆశ్రమంలో

తన అనుచరులు, శిష్యులు, ఆధ్యాత్మిక జగతిలో ఆణిముత్యాలుగా మార్గదర్శకులుగా ఎదగాలనెడి దివ్య సంకల్పంతో దాదాపు పదివేలకు పై చిలుకు ప్రవచనాల రూపంలో సాధనాది విద్యలను మార్గదర్శనాలను, దిశా నిర్దేశాలను అందించుట జరిగింది. వానిలో ప్రధానమైనవి. భగవద్గీత ఉపన్యాసాలు, మేడమ్ బ్లావెట్‌స్కీ విరచిత "సీక్రెట్ డాక్ట్రిన్" పై ఉపన్యాసాలు, ఐశ్వర్యం యొక్క మానసిక స్థితి, వేదమయ జీవనం, భారతీయ జీవన విధానం, శ్వాసపై ధ్యానం, నవ్య యుగావతరణకు ఏకాదశ పుష్పములు, అనుగ్రహ మాల మంత్రం, యూనివర్సల్ మైండ్, అమృతత్వ విద్య, రహస్య జ్యోతిర్ విద్య, పతంజలి యోగా సూత్రాలు, సాయి భక్తుల జీవనశైలి, సాయి అనుగ్రహానికి అనుసరించవలసిన సూత్రాలు, నా లక్ష్యం-నా సందేశం, ప్రకృతి ఎల్లవేళలా సరియైనదే, శ్రవణము, కీర్తనము, నీవు శిష్యుడివి కాగలవా?, అశ్వమేధ యజ్ఞం మున్నగువానిపై ఉపన్యసించారు. 'మేధా' మాసపత్రిక ద్వారా తన ఉపన్యాసాల మాధ్యమంగా ప్రజలకు చేరువయ్యారు.

పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య ఆత్మకథను, వందనీయ మాతా భగవతీదేవి దివ్య చరిత్రలను మొట్టమొదట తెలుగులోనికి అనువదించి తెనుగుజాతికి అందించిన మహనీయుడు.

అదేవిధముగా ఆంధ్రదేశంలో మానవ ప్రగతికై కృషి చేసిన పేరుగాంచిన అవధూతలైన శ్రీ వెంకయ్య స్వామి, శ్రీ సొరకాయస్వామి, జిల్లెలమూడి అమ్మ మున్నగువారి గొప్ప తనాన్ని తెలియజెప్పి వారి పట్ల ప్రజలకు గల భక్తి శ్రద్ధలకు తిరిగి ప్రాణం పోశారు.

"నా రాక మీ ఆలోచనలను మార్చి జీవుల పరిణామ క్రమంలో మీరు ఎదిగేలా చేయుటకే తప్ప మీ కోర్కెల తీర్చుటకు కాదు" అని నిర్ద్వంద్వంగా ప్రకటించి తన శిష్యులకు తన లక్ష్యాన్ని వెల్లడించారు. దీనికి అనుగుణ్యంగా నడుచుచున్న వారికి వారి వారి పాత్రతను బట్టి వారు తన లక్ష్యసాధనకు తోడ్పాటును అందించెడి దానిని కొలమానంగానెంచుకొని వారి వారి అవసరాలను (భౌతిక, ఆధ్యాత్మిక) తీర్చిన వివేక చూడామణి మరియు శక్తి సమన్వితుడు.

అట్లే తనచే స్థాపించబడి ప్రాణ ప్రతిష్ఠ గావించబడిన శక్తి కేంద్రాలు (ఆశ్రమాలు) దుష్టచింతన పరుల పాలనలోకి పోవుట పసిగట్టి వెనువెంటనే అచ్చటి దేవతాశక్తులను (ప్రాణశక్తిని) ఉపసంహరింపచేసి దుష్టశక్తులను నర్మగర్భితంగా హెచ్చరించిన శక్తిశాలి మరియు ప్రేమమూర్తి.

"నీతోటి వారికి నీవు చేయూతనిస్తే నా శక్తివంతమైన చేయి నీకు అందుతుంది" అనెడి ధర్మ సూక్ష్మాన్ని దైవీశక్తి వశీకరణ మంత్రాన్ని అతిసులభంగా బోధించిన తత్త్వవేత్త.

"తన శరణు కోరిన వారిని తాను నడిపించెదనని" చెప్పి శరణన్న వారి బరువు బాధ్యతలను తానే మోసెదనని భరోసా ఇచ్చి **వారిని తన లక్ష్యసాధనకై వినియోగించిన కార్యదక్షుడు మరియు చతురుడు.**

**"పరిపక్వమైన సమిధ అగ్ని సంపర్కంతో అగ్నిలా మారినట్లు సమర్పణ గావించుకొన్న శిష్యుడు తన గురువు సంపర్కంలో గురువులా ఎదుగుతాడు. అట్లే తడితోనున్న సమిధ అగ్నిలో పడి పొగచూరినట్లు కోరికలతోనున్న శిష్యుడు గురువులా మారజాలడు" అనెడి నగ్నసత్యాన్ని అతి సున్నితంగా చెప్పిన సత్యమూర్తి.**

లబ్ధిని పొందిన మానవుడు పంచభూతాత్మకమైన దైవాన్ని విస్మరించుటచే ప్రకృతి వైపరీత్యాలను తరచూ ఎదుర్కొనుచూ అశాంతితో తన కోర్కెల వలయం (తన గూటి) లో చిక్కుకొన్న సాలీడులా సాంసారిక జీవితములో బంధింపబడి దారితెన్నూ కానక అలమటించుచున్నాడు. ఇట్టి దయనీయ స్థితిలోనున్న మానవ సమాజానికి దారిచూపనెంచి భారతీయతకు పట్టుకొమ్మలా ప్రసిద్ధి గాంచిన యజ్ఞయాగాదులను తిరిగి మానవజాతిచే సార్వజనీనకంగా, సామూహికంగా నిర్వహింప చేసెడి పద్ధతిని ఆంధ్రదేశంలో ప్రవేశపెట్టిరి. **రాష్ట్రం నలుమూలలా వేలకొలది గాయత్రీ యజ్ఞాలను నిర్వహింప జేసిన యాజ్ఞవల్క్య శాఖీయుడు.**

**"వ్యక్తి తన భాగ్యానికి తానే నిర్మాత"** అనెడి తన గురుదేవులు అందించిన నగ్న సత్యాన్ని **వాడవాడలా వ్యాప్తి చేసిన యదార్థ వాది.** తన ప్రాణ సమానులైన పరమపూజ్య గురుదేవులైన **పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యులపై అష్టోత్తర శతనామావళిని రచించి పరివార్ నిత్యపఠన గ్రంథంగా చేసి తన గురుదక్షిణను చెల్లించుకొన్న అపర కృష్ణుడు.**

మహా శూన్యోపాసన అనెడి దివ్య సందేశం ద్వారా మానవుడు మహామానవునిగా ఎదిగే మార్గాన్ని ఈ క్రింది మాటలలో ప్రబోధించారు శ్రీరామకృష్ణ మాష్టారు.

**భగవంతుడా!**

**నాకు శక్తినిమ్మని అడిగితే,**

**కష్టాలనిచ్చి శక్తిని పొందమన్నావు.**

**జ్ఞానమునిమ్మని అడిగితే,**

**సమస్యలనిచ్చి సాధనతో జ్ఞానమును పొందమన్నావు.**

**సిరిసంపదల నడిగితే,**

**తెలివినిచ్చి సంపదలను స్వయంగా పొందమన్నావు**

**ధైర్యమునిమ్మని అడిగితే,**

**ప్రమాదములనిచ్చి వానినధిగమించి ధైర్యమును పొందమన్నావు.**




**సిద్ధి సమాధి యోగ రిషి ప్రభాకర్‌జీ తో మాష్టార్ ఆర్.కె.**



**మౌలానా బాబాతో మాష్టార్ ఆర్.కె.**




**మంత్రాలయంలో శ్రీ మహా సత్రయాగ సందర్భంగా విఠల్ బాబాగారితో...**



**మహబూబ్‌నగర్ జిల్లా వల్లభపురం దత్తపీఠం ప్రక్కన కృష్ణానది తీరాన...**

ప్రేమనందించమని అడిగితే,

ఆపదలోనున్నవారిని ఆదుకొని, ప్రేమతత్త్వమును అనుభవించమన్నావు.

వరములనిమ్మని అడిగితే,

పలు అవకాశములనిచ్చి, కోరికలను తీర్చుకోమన్నావు

భగవంతుడు అందరికీ అన్నీ ఇచ్చాడు. వానిని అందిపుచ్చుకొని అనుభవింపవలసినది మనమే.

నీలోనున్న అంతర్జ్యోతిని వెలిగించి,

ఆత్మవిశ్వాసముతో అన్నింటిని పొందుము.

బీజం లేకుండా ఎట్లు మొలక రాదో అట్లే వ్యక్తి యొక్క ప్రతి పని కంటికి కనిపించని తన ఆలోచనా బీజాల నుండి ఉద్భవించుననెడిది సత్యం. అసూయతో గాంధారి తన గర్భాన్ని మోదుకొనగా అసూయకు ప్రతిరూపంగా దుర్యోధనుడు జన్మించి వంశనాశనానికి కారకుడయ్యాడు. ఈర్ష్య, అసూయ, ద్వేషాలతో కూడిన ఆలోచనలు వ్యక్తి ఔన్నత్యానికి అతి ప్రధాన ప్రతిబంధకాలు. కుకర్మలన్నీ పై వానితోనే పెనవేసుకొని ఉంటాయి. వీనిని అధిగమించుటయే సుఖశాంతులకు ప్రథమ సోపానమని విడమర్చి ప్రబోధించిన ప్రబోధకుడు.

మనిషికి బాధలు అతని మనోదౌర్బల్యం వలన మరికొన్ని బానిసత్వ ఆలోచనలతో సంప్రాప్తమవుతాయి. తన కాళ్ళమీద తాను నిలబడుట నేర్చిన వ్యక్తి మూడొంతుల కష్టాలను అవలీలగా అధిగమిస్తాడు. కొన్ని కష్టాలతో సహజీవనం చేస్తూ వానిని అధిగమిస్తాడు. కానీ, వచ్చిన చిక్కుల్లా కష్టాలకు మూలకారణం తానేననెడి చేదు నిజాన్ని అంగీకరించడు. తాను మారి తన దృష్టి కోణాన్ని మార్చుకొనగలిగినచో అన్ని పరిస్థితులలోను ఆనందంగా ఉండగలడనెడి చేదు నిజాన్ని తెలియజెప్పిన యదార్థవాది.

ప్రపంచంలో నేడు అనేక విశిష్టమైన ప్రతిభా సంపన్నులు ఉన్నారు. వీరి ప్రతిభా పాటవాలు ఇప్పుడు ఉపయోగపడుచున్న రీతిలో కాక మంచి వైపు మళ్ళించగలిగిన నాడు అనేక మహిమాన్వితమైన పనులు సులువుగా జరిగిపోతాయి. అనగా ప్రతిభా సంపన్నుల ఆలోచనా విధానాలను విశ్వకళ్యాణ దిశగా మార్చగలిగిననాడు ఆశించెడి అద్భుత ఫలితాలు తప్పక ఒనగూడుతాయి. దీనికి తార్కాణంగా పార్వతి, ధృవుడు, ప్రహ్లాదుడు, వాల్మీకి మున్నగువారి ఆలోచనా విధానములను నారద మహర్షి మార్చుటచే వారి జీవన విధానాన్ని మార్చుకొని వారు తమ నూతన జీవన విధానంతో సంపూర్ణ విశ్వమానవాళికి ఆదర్శమూర్తులై నిలిచారు. అట్లే ఆనందుడు, ఆమ్రపాలి, అశోకుడు, హర్షవర్ధనుడు, క్రూరత్వానికి మారుపేరైన అంగులీమాలుడు మున్నగు



క్రాంతిధర్మ సాహిత్య ఆవిష్కరణ సందర్భంగా అశ్విని సుబ్బారావుగారితో....



మహబూబ్‌నగర్ జిల్లా కడ్తాల్ పిరమిడ్ సొసైటీ వేదికపై అశ్విని సుబ్బారావుగారితో...



కడ్తాల్ పిరమిడ్ వేదికపై పత్రీజి మరియు విఠల్ బాబాగార్లతో...



కడప జిల్లాలోని కందిమల్లయ్యపల్లె గ్రామంలో బ్రహ్మంగారి జీవసమాధివద్ద

ప్రతిభాశాలుర ఆలోచనా సరళిని బుద్ధభగవానుడు ప్రభావితం గావించుటతో వారు ఆదర్శ ప్రాయులై విశ్వవిఖ్యాతినిగాంచారు. ఇదే రీతిలో నేటి సమాజాన్ని తమ తమ వృత్తుల ద్వారా భావనల ద్వారా, పనుల ద్వారా అనుక్షణం ప్రభావితం చేస్తున్న రాజకీయ నాయకులను, కళాకారులను, ఉపాధ్యాయులను, వ్యాపార వేత్తలను మరియు వైజ్ఞానికవేత్తలను సంస్కరించెడి మహత్కార్యాన్ని చేబూనిన గొప్ప సంస్కర్త శ్రీరామకృష్ణ మహనీయులు.

నీలోనున్న అంతర్జ్యోతిని వెలిగించి ఆత్మ విశ్వాసంతో అన్నింటిని పొందుము అంటూ మీరంతా దేవతా స్వరూపులే అని తట్టి నిదురలేపారు. మన జీవితాలలో వెలుగు నింపారు.

ఈ రీతిగా మానవాకృతిని ధరించిన ఆ దివ్య చేతనాశక్తి మనందరిలో నిద్రాణమై ఉన్న అంతర్జ్యోతులను వెలిగించి పదుగురికి తానందించిన రీతిలో జ్ఞానాన్ని అందించ వలసినదిగా కోరుచూ మార్గదర్శనం గావించి తన భౌతిక శరీరాన్ని వీడి సూక్ష్మశరీర ధారియై విశ్వావ్యాపితమై తన గురుదేవునిలా పంచవీరభద్రుని రూపాలను ధరించి భూమిని స్వర్గంగా మార్చెడి పనిలో సోమవారము 30 జూన్ 2014 ఉదయం గం॥ 7.10 ని॥లకు పయనమై వెళ్ళారు.

## డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి పార్థివ శరీరానికి అంత్యేష్టి సంస్కార విశేషాలపై నివేదిక:

66 సంవత్సరాల క్రితం మానవ శరీరంలో ప్రవేశించిన ఆ దివ్య చేతనా శక్తి మారెళ్ళ శ్రీరామకృష్ణ నామంతో ఈ నేలపై నడయాడి తన పని ముగించుకొని తదుపరి కార్యాన్ని చేబూనుటకై సోమవారం 30 జూన్ 2014 ఉదయం గం॥ 7.20 ని॥లకు స్థూల జగత్తు నుండి నిష్క్రమించింది.

ఆ పార్థివ శరీరాన్ని శ్రీరామకృష్ణగారి ప్రేరణతో స్థాపించిన మౌంట్ శంబళ అనెడి ప్రాంగణానికి చేర్చారు. అటుపిమ్మట మాష్టారి అనుచరులు, అభిమానులు మరియు శిష్యుల సందర్శనార్థమై ఆ పార్థివ శరీరాన్ని జులై 1వతేది 2014 వరకు అచ్చట భద్రపరచారు. తదుపరి ఉదయం 10 గం॥లకు గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్ ప్రతినిధి డా॥ బ్రిజ్ మోహన్‌గౌడ్‌జీగారి (పరమ పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య అనుంగు శిష్యులలో ఒకరు) రాకతో పార్థివ శరీరానికి గాయత్రీ పరివార్ సంస్కార పద్ధతి ప్రకారం వీరి సారథ్యంలో అంత్యేష్టి సంస్కారం నిర్వహింపబడింది. చితికి మాష్టారి సోదరుడైన శ్రీ విశ్వనాథ్ ప్రసాద్‌గారు అగ్ని సంపర్కం కావించిరి. ఈ రీతిగా ఆ చేతనా శక్తిని 66 సంవత్సరములు (24,000 రోజులు) తనలో ధరించిన ఆ పార్థివ శరీరం తిరిగి పంచభూతాలలో లీనమై పోయింది.



2007లో నవంబర్ 24-26 తేదీలలో వరంగల్‌లో జరిగిన శిక్షణా శిబిరంలో...


2011లో నారాకోడూరులో జరిగిన నవసృజన సాధన పుష్పాంజలిలో...


కేరళలోని ఆనంద ఆశ్రమ పరివారంతో...


శ్రద్ధాంజలి ఘటించుచున్న డా॥ బ్రిజ్‌మోహన్ గౌడ్‌జీ




కేరళలోని ఆనంద ఆశ్రమంలో గో సేవలో లీనమై...



హిమాలయాలలో సాధన చేసెడి యువసాధకునితో...



గుంటూరు జిల్లా పురుషోత్తమపట్నంలో దత్త స్థూప ఆవిష్కరణ సందర్భంగా...




హైదరాబాద్‌లో 'దియా' వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న మాష్టార్ ఆర్.కె.

శత శతకోటి ప్రణామం!
సద్గురు నీకు ప్రణామం - సద్గురు నీకు ప్రణామం

జ్ఞానజ్యోతుల వెలిగించావు!
మమ్ముల జ్ఞానమార్గంలో నడిపించావు
సద్గురు నీకు ప్రణామం

ప్రేమను పంచుటే ఉత్తమ జీవనమన్నావు
ప్రేమను పంచావు ప్రేమించుట నేర్పావు
జీవితాలను ధన్యం చేశావు
సద్గురు నీకు ప్రణామం

యాచన తప్పన్నావు - అర్హత పొందుటే మిన్న అన్నావు
జనహితం కావాలి - మీదు పనులన్నావు
సద్గురు నీకు ప్రణామం

అందుకో ఓ మార్గదర్శి! - మా అందరి శత శతకోటి ప్రణామం



## మాష్టారి చిరకాల వాంఛలు - వారి జీవిత లక్ష్యాలు

1) యుగశక్తి గాయత్రి మాస పత్రిక చందాదారుల సంఖ్యను లక్షకు పైగా నమోదు చేయుట

2) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను గాయత్రీ ప్రదేశ్ గావించుట

3) గాయత్రి పరివార్ పరివ్రాజకుల సంఖ్యను లక్షకు చేర్చుట

### శాంతి మంత్రము

ఓం ద్యౌః శాంతిరన్తరిక్ష గ్ం శాంతిః, పృథివీ శాంతిరాపః,
శాంతిరోషధయః శాంతిః।
వనస్పతయః శాంతిర్విశ్వేదేవాః, శాంతిర్బ్రహ్మశాంతి, సర్వగ్ం శాంతిః,
శాంతిరేవ శాంతిః, సా మా శాంతిరేధి ॥
ఓం శాంతిః, శాంతిః, శాంతిః। సర్వారిష్ట - సుశాంతిర్భవతు।

లోకాః సమస్తాః సుఖినో భవన్తు



2007 సం॥లో హైదరాబాదులో జరిగిన 3 రోజుల కార్యశాలలో డా॥ ప్రణవ్ పండ్యాగారితో...



2011 సం॥లో పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది వేళ శాంతికుంజ్‌లోని ప్రఖర ప్రజ్ఞ - సజల శ్రద్ధ వద్ద



2011 సం॥లో పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది వేళ శాంతికుంజ్‌లో
ఆంధ్రప్రదేశ్ పరివారాన్ని పరామర్శిస్తున్న డా॥ ఆర్.కె.



2007 సం॥లో గుంటూరు జిల్లా కోటప్పకొండలో జరిగిన కార్యకర్తల శిబిరంలో
శాంతికుంజ్ ప్రతినిధి డా॥ బ్రిజ్‌మోహన్ గౌడ్ గారితో



2009 జనవరి శిరిడిలో జరిగిన సాధనా శిబిరంలో డా॥ బ్రిజ్‌మోహన్ గౌడ్ గారితో



2014 జనవరి బెంగుళూరులో జరిగిన గాయత్రీ అశ్వమేధ మహాయజ్ఞ వేదికపై మాష్టార్ ఆర్.కె.




2014 జనవరి బెంగుళూరులో జరిగిన గాయత్రీ అశ్వమేధ మహాయజ్ఞ ప్రాంగణంలో
ఫోటో ఎగ్జిబిషన్ గ్యాలరీలో మాష్టార్ ఆర్.కె.



2014 జనవరి బెంగుళూరులో జరిగిన గాయత్రీ అశ్వమేధ మహాయజ్ఞం సందర్భంగా
కలశయాత్రలో పాల్గొన్న మాష్టార్ ఆర్.కె.



డా॥ శ్రీరామకృష్ణ మాష్టారి పార్థివ శరీరం



మాష్టారి గారి పార్థివ శరీరానికి అంత్యేష్టి సంస్కార ప్రక్రియ



చితికి నిప్పంటించుచున్న సోదరుడు మారెళ్ళ విశ్వనాథ్ ప్రసాద్



చితికి ఆహుతులు సమర్పించుచున్న పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపకులు శ్రీ పత్రీజీ



అగ్ని సంపర్కములో మాష్టారి గారి పార్థివ శరీరము



చిత భస్మాన్ని భద్రపరుస్తున్న మాష్టారి గారి సోదరుడు విశ్వనాథ్ ప్రసాద్



విశ్వగాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు డా॥ ప్రణవ్ పండ్యాగారితో మాష్టారి గారి సోదరుడి సంభాషణ



హరిద్వార్ వద్ద గంగానదిలో మాష్టారి గారి అస్థికల నిమజ్జనము





మౌంట్ శంబళ ప్రాంగణములో మాష్టారి గారికి శ్రద్ధాంజలి ఘటించున్న గాయత్రీ పరివార్ పరిజనులు

బోధ కథ

# అంధకూపములో ఐదు ప్రేతములు

మహీధర ఆచార్యులవారు తమ శిష్యసమేతముగా తీర్థ యాత్రలకు బయలుదేరారు. రాత్రి అయిన కారణముగా విశ్రాంతి కోసము ఒక సురక్షితప్రాంతమున ఆగారు. అలసిపోయిన శిష్యబృందము వెంటనే మంచినిద్రలోకి జారిపోయింది.

మహీధరులవారికి నిద్ర రావటము లేదు. ఎక్కడో దూరముగా కొంతమంది వ్యక్తుల కరుణాపూరితమైన ఆక్రందనలతో కూడిన స్వరము వినిపిస్తున్నది. వారు వెంటనే లేచి ఆ ఆక్రందనలు వస్తున్న దిశగా పయనించి ఆ ప్రదేశమునకు చేరుకున్నారు. అది ఒక పాడుబడిన బావి. తొంగిచూడగా ఆ బావి లోపల ఐదుగురు వ్యక్తులు ముఖాలు క్రిందికి దించుకొని రోదిస్తున్నారు.

వారిని బయటకు తీసే ప్రయత్నము చెయ్యటానికన్నా ముందే ఆచార్యులవారు 'మీరెవరు? ఎందుకు ఈ బావిలో పడి దుఃఖిస్తున్నారు? బయటకు వచ్చే ప్రయత్నము ఎందుకు చెయ్యటము లేదు?' అని అడిగారు.

వారిలో ఒకరు 'మేము ఐదుగురము ప్రేతాలము. కర్మ ఫలమును అనుభవించటానికి ఈ బావిలోపడి ఉన్నాము. విధి విధానమును కాదని మమ్మల్ని ఇందులోనుండి బయటకు తీసుకు రావటము సాధ్యము కాని పని' అని సమాధానమిచ్చాడు. ఆచార్యులవారికి మరింత కుతూహలము కలిగినది. 'బాగుంది, మరి ఏ కారణముచేత మీరు ఇంతటి దుర్గతిని అనుభవిస్తున్నారు?' అని ప్రశ్నించారు.

ప్రేతాలలో ఒక్కొక్కరు తమ దుర్గతికి కారణము చెప్పుకొచ్చారు. అందులో మొదటి ప్రేతము తాను పూర్వజన్మలో ఒక బ్రాహ్మణుడనని, దక్షిణ స్వీకరించి దానిని విలాసాల కోసం ఖర్చు చేశానని, బ్రహ్మకర్మలను నిర్లక్ష్యము చేశానని, అందుచేతనే ఈ స్థితి అనుభవించవలసి వచ్చినదని వివరించింది.

రెండవ ప్రేతము తాను క్షత్రియుడనని, దుఃఖితులను, పీడితులను రక్షించటానికి బదులుగా మద్యమాంసములను సేవిస్తూ, వేశ్యలతో సహజీవనము చేస్తూ, దుష్కృత్యాలను చేయడము వలన ప్రేతము కావలసి వచ్చినదని చెప్పింది.

ఇక మూడవ వ్యక్తి తానొక వైశ్యుడనని, మితిమీరిన లాభాలను ఆర్జించటానికి అమ్మవలసిన వస్తువులతో అక్రమాలకు పాల్పడి, డబ్బు ఉన్నప్పటికి పిసినారితనాన్ని అనుసరించి ఎవ్వరికీ ఏమీ దానము చెయ్యకుండా కఠినముగా ఉండేవాడినని చెప్పాడు.

నాలుగవ వ్యక్తి 'అహంకారముతో నిండిన, దుర్వ్యసనములు కలిగిన, సోమరిపోతునైన శూద్రుడనని, ఎవ్వరు చెప్పిన మాటా వినేవాడిని కానని, బాధ్యతారహితముగా ఉండేవాడినని' చెప్పాడు.

ఇక ఆఖరుదైన ఐదవ ప్రేతము స్థితి మరీ విచిత్రముగా ఉన్నది. అతడు తన సహచరులకు కూడా తమ ముఖము కనిపించకుండా వీపు వారివైపు త్రిప్పి రెండు చేతులతో ముఖమును కప్పుకుని కూర్చున్నాడు. మహీధరుడు అతని ఈ విచిత్రస్థితికి విస్మయము చెంది, అందుకు కారణము చెప్పమని కోరగా, రుద్ధ కంఠముతో అతడిలా చెప్పాడు. 'నేను పూర్వజన్మలో కళాకారుడను, సాహిత్యకారుడను. కానీ నేనెప్పుడూ నా కలముతో నీతి, న్యాయము, ధర్మము, సదాచారము, శిక్షణ మొదలైనవానిగురించి ఒక్క వాక్యము కూడా వ్రాయలేదు. అశ్లీలత, కాముకత, దురలవాట్లను పెంపొందించే సాహిత్యమును వ్రాసి ప్రజలను పతితులుగా తయారుచేసే వాడిని. తగాదాలు రేకెత్తించే, విషయ వాసనలను పెంచే సంగీతము, అభినయము మొదలైనవాటిని సృజించేవాడిని. చిత్రాలను వెయ్యటము, బొమ్మలను తయారు చెయ్యటములో నిష్ణాతుడనైనప్పటికీ వాటిని చెడుమార్గములో ఉపయోగించాను. సమాజము అంతటిని తప్పుదారి పట్టించినందుకు ఆగ్రహించిన యముడు నాకు మిగిలిన ప్రేతాలకంటే ఎక్కువ శిక్ష విధించి, ఎంతో కష్టతరమైన ఈ స్థితిలోకి త్రోసివేశాడు. ఇక్కడ కూడా నాకు నా ముఖమును నా సహప్రేతములకు చూపించటానికి కూడా సిగ్గుపడే స్థితిలో ఉన్నాను.' తరువాత అతనిక మాట్లాడలేకపోయినాడు.

పాడుబడిన బావిలో నుండి వారు ప్రయత్నించి వెలుపలికి రావటము లేదా ఎవరైనా వారిని వెలుపలికి తీసే ప్రయత్నము చెయ్యటము కూడా వ్యర్థమేనని చెప్తూ, ఆ ఐదు ప్రేతములు మహీధరుడిని 'స్వామి! తమరు చెయ్యగలిగితే ఒక్క చిన్న సహాయము చెయ్యండి. ప్రజలలోకి వెళ్ళి, ప్రతి ఒక్క మనిషికీ మాకు పట్టిన దుర్గతిని గురించి వివరించండి. తద్వారా ఇతరులెవ్వరూ ఇలాంటి తప్పులు చెయ్యకుండా ఉండాలని మా కోరిక. చేసిన పాపమును గురించి చెప్పుకుంటే, ఆ పాపము యొక్క భారము కొంత తగ్గుతుంది. దానివలన ఇతరులకు జ్ఞానము కలుగుతుంది' అని వేడుకున్నాయి.

మహీధరుడు తిరిగి వచ్చాడు. అప్పటినుండి వారు తమ ప్రవచనములలో ఈ ఐదు ప్రేతముల గురించి ప్రజలకు వివరముగా చెప్తుండేవారు.

*– అఖండజ్యోతి, మార్చి 1984*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**క్రమశిక్షణతో కష్టపడితే జీవితాంతం సుఖాలు అనుభవించడానికి అర్హత వస్తుంది**

భావసంవేదనల గంగోత్రి-2

# చైతన్యుడు ఉదయించాడు

సమస్యలు అనేకము. కలహములు, ఆపదలు, చిక్కుల వలయము ఎంత పెద్దదంటే దానిని బయటనుండి చూసే వారు నివ్వెరపోతారు. కానీ అంతర్దృష్టి లభించిన వారు సులభముగా దీనికి మూలము ఎక్కడ ఉన్నదో తెలిసికొని, దానిని కూకటి వ్రేళ్ళతో తొలగిస్తే తప్ప సమస్య పరిష్కారము కాదని తెలుసుకుంటారు. ఈ అంతర్దృష్టి విశ్వంభర మిశ్రాకు లభించింది. దానితో ఆయన చైతన్య మహాప్రభువయ్యాడు.

ఆ రోజులలో ఆయన గయకు వచ్చారు. వారితోపాటు వారికి కీర్తి కూడా వచ్చింది. వారిని చూడగానే ప్రజలు ఇలా అనుకున్నారు - "అరే! ఈయన నవద్వీపము వారుకదా. ఈయన పాండిత్యమును బెంగాలులో అందరు గుర్తించారు. ఇటీవల ఈయన ఒక కాశ్మీరు పండితుని వాదనలో ఓడించారు. అతను చర్చ మానివేసి పారిపోయాడు. నిజానికి శాస్త్రార్థములో ఆయనకు ఎదురు లేరు" - ఈ విధముగా రకరకాల మాటలు వింటూ మిశ్రా పండితుడు మెప్పుదలల మధ్య శాంతముగానే ఉన్నాడు. ప్రశంసకుల పొగడ్తలు, నిందించేవారి కఠినోక్తులు ప్రసిద్ధిపొందిన వ్యక్తికి సంపదలు. ఇంతకంటే ఎక్కువ ఏమి ఇవ్వగలరు ఎవరైనా?

గయలో ఉన్న సాధువు ఈశ్వరపురి ఈ కథలన్నీ విన్నాడు. విన్న మాటలు ఎక్కువ భాగము అతిశయోక్తులే అయినప్పటికీ, ఆయన ప్రతిభావంతుడని అంచనావేశాడు. ఆ ప్రతిభ భావ శ్రద్ధలతో కలసినట్లయితే? ఈ ఆలోచన ఆయనను ముందుకు నడిపించింది. ఆలోచిస్తూ వెళ్తున్నాడు. అయితే అతడు ప్రజల జీవితమును సరిదిద్దుటతో పాటు అనేక మందికి మార్గము చూపించగలడా? ప్రతిభ అనేది మనస్సు, శరీరము యొక్క సక్రియతకు శిఖరాగ్రము. భావము శ్రద్ధతో కలవని కారణమున ఇది అహంకారమునకు దాస్యము చేస్తుంది. విలాసము, వైభవముల వెంట పరుగుల తీస్తుంది. ప్రతిభ ఉన్నతమైన భావములతో కలసినట్లయితే స్థితి తలక్రిందులవుతుంది. "సర్వజనహితాయ - సర్వజన సుఖాయ" కొరకు క్రియాశీలునిగా మలుస్తుంది.

దారంతా ఇదే ఆలోచన కొనసాగింది. ఎప్పుడు ఆయన గుడారము వద్దకు చేరారో తెలియలేదు. "బెంగాల్‌కు చెందిన మిశ్రాగారు ఇక్కడ ఉన్నారా?" అని ఒకరిని అడిగాడు.

ప్రక్క గుడారంలో ఉన్నారని అతను చెప్పాడు. లోపలికి వెళ్ళి చూస్తే ఒక తెల్లని యువకుడు శాస్త్ర చర్చ జరుపుతున్నాడు. ఈయన కూడా ఒక మూల కూర్చున్నారు. చర్చ కొనసాగింది. చర్చ పూర్తయిన తరువాత వారిని వదలి అందరూ వెళ్ళిపోయారు. చర్చిస్తున్న యువకుడు ఆయనను చూచి -

"మీ పని ఏమిటి? అని అడిగెను.

"ఒక జిజ్ఞాస."

"చెప్పండి."

"మీకు నిజముగా శాస్త్రముయొక్క అర్థము తెలుసా?"

విన్న వ్యక్తి అంతరంగము కదిలింది." అంటే ఏమిటి"- అని ఆయన అడిగారు.

"మరోలా అనుకోవద్దు - నా ఉద్దేశ్యము మీ వ్యాఖ్యానాలు బుద్ధి కుశలతతో కూడినవా, లేక వీటి వెనుక మీ అనుభూతులు కూడా కలసి ఉన్నయా?"

విన్న వ్యక్తి మౌనం వహించాడు. ఈనాడు మొదటిసారిగా ఒకరు తన బుద్ధిని నిందించారు.

"గోరీ, గజనీ, ఐబక్ భరతభూమిని ఎంతో అణగ ద్రొక్కారు. భక్తియార్ అత్యాచారాలు బెంగాల్‌ను ఎంతగా హింసించాయో! నేటి మానవుడు ఆత్మ విశ్వాసమును కోల్పోయాడు. తానుకూడా కొంత మంచి చేయగలను అని మరిచాడు. ఇతరుల అవినీతి, అన్యాయములను సహించటము మొదలుపెట్టాడు. వాక్ చాతుర్యం మాత్రం అలవరచుకున్నాడు. హాస్యాస్పదముగా లేదా?" సంవేదనతో అన్నాడు.

అవి మాటల పొగులు కావని, వాటి వెనుక విలవిలలాడే తపన ఉన్నదని ఆ తెల్లటి యువకుడు గ్రహించాడు. ఆయన

**కలలు కనడం సులభమే, వాటిని నెరవేర్చుకోవాలంటే కష్టపడవలసినదే**

మాటలు అతని అంతరంగాన్ని మథించాయి. స్మశానములో కాలుతున్న శవాలను చూచినప్పుడు ఇతరులకు తమ మృత్యువు గుర్తుకువస్తుంది. పెళ్ళివేడుకలు చూసినప్పుడు జీవితపు ఆనందము తెలుస్తుంది. ఇదేవిధముగా ఎవరి అంతరంగములో మానవాళి ఎడల తపన ఉన్నదో, ఎవరి హృదయం ఉండి ఉండి మానవత్వం కొరకు ఆక్రోశిస్తుందో – అతడే ఇతరులలో అటువంటి ఆర్ద్రతను సృష్టించగలడు. యువకుని కన్నులలో వ్యాపించిన మిధ్యా పాండిత్య తెర జారిపోసాగింది. అతడు "మీరు చెప్పింది నిజమే. కాని పరిష్కార మార్గం ఏమిటి?" అని అడిగాడు.

"మానవునికి అతడు కోల్పోయిన మానవత్వాన్ని వెతికితెచ్చి ఇవ్వాలి. అతని అంతరంగపు లోతులను స్పృశించాలి. భావచేతనత్వం లేనప్పుడు, జీవించిఉన్న మనిషి కూడా శవమే. అది తాను క్రుళ్ళి, వాతావరణాన్ని కలుషితము చేస్తుంది. ఆ భావచేతనత్వం ఉంటేనే మానవుడు సమర్థుడు, సుందరుడు అవుతాడు. బాధ, పతనముల నివారణ కొరకు పరుగుతీస్తాడు. చనిపోయిన వాడిదేముంది? వాడి లక్షణం అకర్మణ్యత. వాడికి దగ్గర కూర్చున్న వారి ఏడుపు కూడా వినిపించదు. ఈనాడు నలుదిక్కులా అలాటి మృతులే కనిపిస్తున్నారు. అలాంటివారిని తిరిగి జీవింప జేయగలవా?

"ఎలా?"

"భావ శ్రద్ధను మేలుకొలపాలి".

"కానీ సమస్యలు బుద్ధివి అయినప్పుడు సమాధానము కూడా బుద్ధికి సంబంధించిందే అయి ఉండాలి. ఇనుమును ఇనుమే కోస్తుంది అంటారు కదా!"

"సరిగ్గా చెప్పావు. కానీ వేడి ఇనుపముక్క చల్లని ఇనుప ముక్కను కోస్తుంది. దుర్బుద్ధి చల్లని ఇనుపముక్క. భావము దీనిని మార్చి, మంచి ఆకృతిని ఇచ్చి, ఉపయోగకరముగా చేయు వేడి ఇనుపముక్క. పరిష్కారం ఇది ఒక్కటే".

యువకుడు ఒక్కొక్క మాటను జీర్ణించుకుంటున్నాడు. అతని నోటినుండి "ఈనాడు శాస్త్రాల రహస్యము తెలిసినది ఇప్పటివరకు నేను జీవచ్ఛవాన్ని, మీరు నన్ను చైతన్యవంతునిగా చేశారు."– అనే మాటలు వెలువడినాయి. యువకుడు గురువు గారి పాదధూళి తలపై ధరించాడు. గురుశిష్యులు ఇరువురి హృదయములు సంతోషముతో నిండాయి. ఇప్పుడు ఒకరి బాధ ఇంకొకరిది.

యువకుడు బెంగాల్‌లోని నదియాకు తిరిగి వచ్చాడు. అతడి జీవితములో వచ్చిన కాయకల్పము చూచి అందరు ఆశ్చర్యచకితులయ్యారు– అరే ఇదేమిటని. ఒకరోజు దారిలో ఒక కుష్టువాడు కనిపించాడు. ఉపేక్ష, తిరస్కారములతో అందరూ ముఖం త్రిప్పుకొని వెళ్తున్నారు. చైతన్యకు గురువుగారి ఈ మాటలు జ్ఞప్తికి వచ్చాయి. **"చనిపోయిన వారికి ఇతరుల శోకము వినిపించదు, ఇతరుల కష్టాలు కనిపించవు."** ప్రత్యక్షముగా ఉన్నదానికి రుజువులెందుకు? నిజంగా వీరు శవాలే – అని ఆయనకు నమ్మకం కలిగింది. ఆయన కుష్ఠు వానిని లేపి, గాయాలు కడిగి, మందు తెచ్చి పూశారు. సేవా కార్యక్రమముతో పాటు జీవచ్ఛవాలలో ప్రాణము పోయుటకు భజనమండలిని ప్రారంభించారు. ఒక చైతన్యమహాప్రభువు అనేకమందిలో చైతన్యమును మేల్కొపాడు. మేల్కొనినవారు ఇతరులలో చేతనత్వమును కలిగించారు. చైతన్యతో నితాయి, శ్రీవాస్, గదాధర్ వంటి అనేకమంది వచ్చి కలిశారు. శక సం.1455 వరకు వారి కృషి కొనసాగినది. అందరూ దీనిని స్వీకరించవలసి వచ్చినది. భావ శ్రద్ధ వెలుగులోనే మానవుడు తాను కోల్పోయిన మానవత్వమును కనుగొనగలడని అందరూ అంగీకరించవలసి వచ్చింది. మానవత్వం తిరిగి దొరికింది.

మానవత్వానికి ఒకటే గుర్తు. మనిషికోసం చనిపోయేవాడే మనిషి. అందరూ చనిపోతారు కాని జీవితమంతా ఇటుకలు, రాళ్ళు, కంకర, కాగితాలు ప్రోగుచేసుకుంటూ చనిపోతారు. వీరిని భూతాలు, ప్రేతాలు అంటే తప్పు లేదు. వీరు స్మశానములో, గోరీలలో చోటు చేసుకొని కూర్చుంటారు. ఆ దారిన వెళ్ళేవారిని భయపెడుతుంటారు. మనిషి అలాంటి దరిద్రపు పనులు ఎందుకు చేస్తాడు? సంవేదనా రహితుల దశ ప్రేతాల దశ. సంవేదనా శీలురస్థితి బ్రతికి ఉన్న, మేలుకొన్న మానవుల స్థితి. వీరిలో ఎవరివలె ఉండాలి? అది మనం నిర్ణయించు కోవలసిన విషయము.

– *అనువాదం: డి.వి.ఆర్. మూర్తి*

**వెన్ను చూపక పోరాడితే విజేతలు అవుతారు**

# నీరే ఇంధనమైతే!

ప్రఖ్యాత వైజ్ఞానిక కాల్పనిక రచయిత జూల్స్‌వర్న్ ఉత్కంఠను రేకెత్తిస్తూ వ్రాసిన 'ది మిస్టీరియస్ ఐలాండ్' లో ఒక పాత్ర ఇలా ప్రశ్నిస్తుంది. 'బొగ్గు, పెట్రోల్ వంటి ఇంధనములు అడుగంటి పోతే, తరువాత మనిషి దేనిని మండిస్తాడు? దేనిని ఇంధనముగా వినియోగిస్తాడు?' 'ఒకానొకరోజు నీరు ఇంధనరూపములో సర్వ సామాన్యమైన మూలస్రోతముగా వాడుకలోకి వస్తుంది అని నేను విశ్వసిస్తున్నాను' అన్న ఒక విచిత్రమనిపించే జవాబు ఇవ్వబడినది. హైడ్రోజన్, ఆక్సిజన్ కలయికతో నీరు ఏర్పడుతుంది. $H_2O$ అనగా ఒక భాగము ఆక్సిజన్, రెండు భాగములు హైడ్రోజన్‌తో కలిసి నీరుగా రూపొందుతుంది. ఇందులో నీటికి మూలమైన హైడ్రోజన్ ఒక్కటిగాకాని లేక మరేదైనా జ్వలనశీలపదార్థముతో కలిపిగాని మండించినప్పుడు వేడి మరియు వెలుగు యొక్క అపారమైన శక్తిని పొందవచ్చును. ఒకనాడు తప్పకుండా ఇలాంటిరోజు వస్తుంది. స్టీమ్-ఇంజన్ (ఆవిరియంత్రం)లో వినియోగించబడే బొగ్గు స్థానములో ద్రవరూప హైడ్రోజన్ మరియు ఇతర గ్యాస్ పదార్థములు పెద్ద ఎత్తున వినియోగించబడతాయి. 1878లో వ్రాయబడిన ఈ వైజ్ఞానిక కల్పితగాథ ఒక్క శతాబ్ది తరువాత సత్యము, సాకారము అవుతున్నది.

అంతర్జాతీయంగా పలుచోట్ల 'హైడ్రోజన్-ఎనర్జీ'కి సంబంధించిన అనేక ప్రణాళికలు లేక ప్రోజెక్ట్స్ కార్యరూపంలోకి తేబడుతున్నాయి. కొన్నిచోట్ల అమలుపరచబడుతున్నాయి కూడా. కొన్ని సంవత్సరములకు పూర్వం కెనడాలోని క్యూబెక్ ప్రాంతముతోపాటు పలుచోట్ల లక్షలాది డాలర్లు వెచ్చించి అఖండ విద్యుత్ భాండాగారములో ప్రవహించే నీటినుండి హైడ్రోజన్‌ను వేరుచేసి, దానిని ద్రవరూపములోకి మార్చి అవసరమైన ప్రదేశములకు పంపించే ప్రక్రియను చేపట్టే అవగాహనాపత్రం మీద యూరప్‌దేశములు సంతకము చేశాయి. ఈ ప్లాంట్ నిర్మాణమునకు ఆనాడే 42 కోట్ల డాలర్లు ఖర్చవుతాయని లెక్కించారు. క్యూబెక్ ప్రాంతము నుండి సముద్ర మార్గం ద్వారా ఈ ద్రవరూప హైడ్రోజన్‌ను పశ్చిమజర్మనీలోని హేంబర్గ్‌కు చెందిన బదర్‌గాహ్‌కు మళ్ళించే ప్రయత్నం చేశారు. సౌభ్రాతృత్వభావముతో మెలగే యూరప్‌దేశములకు హేంబర్గ్ ప్రాంతము హైడ్రోజన్‌ను నిక్షిప్తము చేసే స్టేషన్‌గా ఉండేది. 1990వ సంవత్సరమునుండే పశ్చిమజర్మనీలో సౌర-హైడ్రోజన్‌ను 500 కిలోవాట్స్ మేర ఉత్పత్తి చేయగల ప్రోటోటైప్ ప్లాంట్ పనిచెయ్యటం ఆరంభమైనది. ఇదే రీతిలో సౌదీ అరేబియాలోని రియాద్ సమీపంలో 350 కిలోవాట్స్ హైడ్రోజన్‌ని ఉత్పత్తి చేయగల ప్లాంట్ నిర్మించబడినది. దాని పేరు 'హై-సోలార్'. ఈ ప్లాంట్ జర్మన్ ఏరోస్పేస్ ఏజెన్సీ ద్వారా అబ్దుల్ అజీజ్ నగరంలో పనిచేస్తున్నది.

యంత్రపరికరములను నిర్మించే ఎన్నో సంస్థలు పెట్రోల్ స్థానంలో హైడ్రోజన్‌ను ఇంధనముగా ఉపయోగించుటకు చేసిన ప్రయోగాలలో సత్ఫలితములను పొందాయి. మోటర్ వాహనముల ఇంజన్స్‌లో తదనుగుణ్యముగానే మార్పుచేర్పులు చేయబడుతున్నాయి. అంతేకాకుండా అత్యంత తక్కువ హైడ్రోజన్‌ను ఇంధనముగా ఖర్చుచేస్తూ ఎక్కువ మైలేజ్‌ని పొందుటకు కావలసిన ప్రయోగములు కూడా చేపట్ట బడుతున్నాయి. ఈ పరిశోధనల నిమిత్తము పశ్చిమ జర్మనీ ప్రతి సంవత్సరము కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నది. ఈజిప్ట్ కూడా హైడ్రోజన్‌ను ఇంధనముగా ఉపయోగిస్తూ జెట్ విమానములను నడపటం, హైడ్రోజన్‌ను మరికొన్ని ఇతర పదార్థములతో కలిపి ఇంధనముగా వినియోగిస్తూ నడపగలిగే మోటార్‌సైకిల్స్, ట్రాక్టర్స్ మరియు రవాణాసౌకర్యములను సులభతరం కావించే రీతిలో హైడ్రోజన్‌ను రూపొందించే ప్రయోగములను చేస్తున్నది. క్రోనర్-కార్పొరేషన్ వ్యవస్థాపకుడు జోల్టన్ ఇలా అంటాడు - 'ఈనాడు యాంత్రికమైన పనులను చెయ్యటానికి విద్యుత్తును వినియోగిస్తున్నాము. కానీ భవిష్యత్తులో హైడ్రోజన్‌ను ఇంధనముగా వెచ్చిస్తూ ఆ పనులన్నింటిని పూర్తి చేసుకుంటారు. అంతేకాదు, రవాణాసౌకర్యములలో వినియోగించ బడే పెట్రోల్ మరియు డీజిల్‌ల స్థానములో హైడ్రోజన్ మండించ బడుతుంది, ఖర్చుచేయబడుతుంది.

భూమి యొక్క భౌగోళిక నిర్మాణము మీద ఆధారపడే బొగ్గు, పెట్రోల్ వంటి ఖనిజతైలముల నిల్వలు వేర్వేరు ప్రాంతములలో ప్రోదిచెంది ఉంటాయి. తత్కారణముగా ప్రపంచములో ఎంతో భయంకరమైన దుర్దశ తాండవిస్తున్నది. చివరికు అది ప్రపంచ యుద్ధమునకు దారితీసే దుస్థితికి తీసుకొచ్చింది. భావికాలములో ఏ దేశము వద్ద ఎంత అనంతమైన జలరాశులు ఉంటాయో, ఎంత అపరిమితమైన సౌరశక్తి ఉంటుందో, వారివద్ద ఖనిజతైల భాండాగారము కంటే ఎన్నోరెట్లు ఎక్కువ సంపద ఉన్నట్లుగా భావిస్తారు. అలాంటి దేశములు ఈనాడు సర్వత్రా ఉన్న ఈ విషమ సమస్యను అధిగమించగలవు.

*- అఖండజ్యోతి, జులై 2010*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*


**పట్టుదల ఉన్నవారికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా అవి ఒక లెక్కలోకి రావు**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# జ్ఞానయోగము యొక్క తత్త్వదర్శనము - 2

*పరమపూజ్య గురుదేవులు ఈ విశిష్టమైన ప్రవచనాక్రమములో యోగములోని ప్రత్యేకమైన అంశము -జ్ఞానయోగమును గురించి అత్యంత సరళముగా అర్థమయ్యేటట్లు చెప్తూ, జ్ఞానయోగమంటే 'మన ఆలోచనలను సదుపయోగపరచుకొనటము, దృష్టికోణమును సంస్కరించుకొనటము' అని తెలియజేస్తున్నారు. 'ఆలోచనలు ఉన్నతముగా ఉంటే జీవితము సుఖమయమౌతుంది. విస్తృతమైన భావాల వల్ల ఆలోచనలకు ఔన్నత్యము చేకూరుతుంది. జ్ఞానయోగములోని వేదాంతసారమిదే!' అని చెప్తూ గురుదేవులు ఆధ్యాత్మికత యొక్క మూలరూపమును నిర్వచిస్తూ 'మానవుడు తనను తాను తెలుసుకొన్నప్పుడు, తన లక్ష్యమును గుర్తించినప్పుడు, అతనిలోని ఆలోచనలు అభివృద్ధిచెందుతాయి, తత్ఫలితముగా అతనిలో ఆధ్యాత్మికత ప్రకటీకృతమౌతుంది, ఆధ్యాత్మికతను గుర్తించగలిగే మార్గమిదే' అని ప్రబోధిస్తున్నారు. రండి! దీనిని గురించి మరింత వివరముగా తెలుసుకుందాము.*

## మనము 'శరీరము' మాత్రమే కాదు



ఒక సింహపుకూన తన గుంపు నుండి విడిపోయి మేకలు, గొఱ్ఱెల మందలో కలిసిపోయింది. వాటితో పాటే గంతులువేస్తూ ఆకులు, గడ్డి తింటూ పెరుగుతున్నది. ఒకరోజు అనుకోకుండా నీటిమడుగులో తన ముఖమును చూసుకుని తాను మేక పిల్లను కానని, సింహపుకూనని గుర్తించినది. 'నేను సింహమును! నా జీవనవిధానము, ఆహారపు అలవాట్లు, ఆలోచనాధోరణి మొదలైనవన్నీ వేరుగా ఉండాలి' అని తలచింది. ఎగిరిగంతు వెయ్యడము, దూకటము మొదలైనవన్నీ చెయ్యటము ప్రారంభించినది. వేటాడటము మొదలెట్టింది. మనము కూడా ఆ సింహపు కూనవలె మన యొక్క పద్ధతులను మార్చుకుంటే బాగుంటుంది. కానీ మనము అలా చెయ్యటము లేదు. మనకు ఎంతసేపు శరీరము పైననే దృష్టి. మనమంటే కేవలము శరీరము మాత్రమే కాదు, దీని లోపల జీవాత్మ ఉన్నది, అదే నేను అన్న విషయమును మనము ఎంతమాత్రము గుర్తించడము లేదు. 'శరీర సుఖమే మన సుఖము. శరీరమునకు లభించే కీర్తియే మనకు లభించే కీర్తి' అన్న ఆలోచనవరకే మన దృష్టికోణము పరిమితమవుతున్నది. మనము శరీరమునకు బానిసలమవుతున్నాము. ఈ శరీరము కోసమే పనిచేస్తున్నాము, కీలుబొమ్మవలె ప్రవర్తిస్తున్నాము.

ఒక్కొక్కసారి మనము కూడా మన ఆలోచనలను మార్చుకొనగలిగితే, మన యొక్క అసలు స్థితిని గుర్తించగలిగితే మన యొక్క కాయకల్పము జరిగినట్లే. దీనినే మహాజాగృతి లేదా ది గ్రేట్ ఎవేకనింగ్ (Great awakening) అని అంటారు. దీనినే ఆత్మబోధ అనికూడా చెప్పుకోవచ్చు. నిన్ను నువ్వు తెలుసుకొనడము, నిన్ను నీవు చూడగలగటము, నీ ప్రవర్తనను చక్కబరచుకొనటము ఇదే ఆత్మబోధ అంటే. మీరు గనుక కొంచెము ధైర్యమును కూడదీసుకొనగలిగితే' మనలోని 'నేను' అనేది, 'శరీరము' అనేది వేర్వేరు అన్న విషయము మీకు బోధపడుతుంది. ప్రస్తుతము మీలోని జీవాత్మ నిద్రాణమై ఉన్నది. శరీర పోషణే మీకు సర్వస్వముగా ఉన్నది. జీవాత్మతో మీకు ఇంకా ఎలాంటి సాన్నిహిత్యం ఏర్పడలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే, మరణానంతరము నరకమునకు వెళ్ళకతప్పదు. 'అయినా పరవాలేదు. జీవాత్మతో మాకు ఎలాంటి సంబంధము లేదు. శరీరమే మాకు ముఖ్యము. శరీరమే మా యజమాని. శరీరమునకు సుఖసౌఖ్యాలను అందించి ఆనందము పొందగలిగితే చాలు. జీవాత్మకు మేలు కలిగినా, కలగకపోయినా ఇబ్బంది లేదు' అని మీరు భావిస్తుంటారు. పైన చెప్పిన ఆలోచనలను తొలగించుకొని పరిస్థితిని మార్చుకొనగలిగితే మీకు కాయకల్పము జరిగినట్లే. అందుచేత జీవాత్మ యొక్క

**జీవితంలో ఓడిపోయానని మాత్రం ఒప్పుకోనని ఒట్టు వేసుకోండి**

ప్రాముఖ్యముతను తెలుసుకొని, దానిలో ఇమిడి ఉన్న శక్తులను గుర్తించి అభివృద్ధిచేసుకునే ప్రయత్నము చెయ్యవలసి ఉన్నది. జీవాత్మకు కలిగే మేలు, శరీరమునకు కలిగే మేలు, ఈ రెండింటికీ మధ్య తేడాను అర్థము చేసుకొండి. సుఖభోగాలు సాధారణ స్థాయిలో ఉన్నంతవరకు బాగానే ఉంటుంది. కానీ అవి మరింత తీవ్రమయ్యేకొద్దీ ఎలాగో ఒకలాగా త్వరగా మరింత డబ్బు సంపాదించాలనే వ్యాకులత, ఆత్రుత మనిషిలో పెరిగిపోతుంది. ఫలితముగా దొంగతనము, హత్య, దోపిడీ, నమ్మకద్రోహము. ఇలా ఎన్నిరకాల పాపాలు ఉన్నాయో వాటన్నింటికీ సిద్ధమవుతాడు. భౌతికసుఖాలను అనుభవించాలనే కాంక్ష, వాటిని త్వరగా పొందాలనే లాలస, జాగృతమైనంత వేగంగా వాటిని సరియైన మార్గములో పయనిస్తే పొందలేము. కాబట్టి తప్పుదారిన వెళ్ళడము మినహా మరొక మార్గము లేదు. వాటిని పొందాలనే వ్యాకులత నిండిన మనిషి ప్రశాంతముగా ఉండలేడు. అదే మనిషిని పతనము వైపు లాక్కొనిపోతుంది.

## మౌలిక ఆలోచనల యొక్క పేరే ఆధ్యాత్మికము

వీటినుండి రక్షించుకొనటానికి అవసరమైన మౌలిక చింతనయే ఆధ్యాత్మికత. 'మా పిల్లవాడు కష్టపడి చదవకుండా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడు కావాలి.' దయచేసి ఆవిధముగా ఆశీర్వదించండి' అని మీరు గురువు దగ్గరకు వెళ్ళి వేడుకుంటారు. ఈరోజులలో అందరికీ ప్రతిదీ వేగముగా, కష్టపడకుండా, ఖర్చుపెట్టకుండా ఏదో ఒక అద్భుతము జరిగినట్లు లభించాలని కోరుకుంటుంటారు. అది చాలా తప్పు. గాంధీ భారతదేశ స్వతంత్రపోరాటములో అనేకులను కలుపుకుని స్వేచ్ఛను తీసుకు రాగలిగారు. ఆయన నిరాడంబరి. ప్రకృతి–చికిత్సాలయమును ఏర్పాటుచేసి అభివృద్ధిచేశారు. ఆయన వ్యక్తిత్వము కూడా ఉన్నతమైనదే. ఆంగ్లేయులను తరిమికొట్టడములో ఆయన ముందు నిలిచారు. ఆయన పిలుపుమేరకు దేశములోని ముఖ్యనాయకులు, ప్రజలు ఏకమయ్యారు.

## ఆధ్యాత్మికత అంటే గారడీకాదు

ఆధ్యాత్మికవేత్తలను గారడీవాళ్ళతో పోల్చవద్దు. జుట్టులో నుండి కోడిని తియ్యటము, చెవిలోనుండి పిల్లిపిల్లను తియ్యడము మొదలైనవన్నీ గారడీవాళ్ళు చేసే పనులు. ఆధ్యాత్మికతలో అలాంటి అద్భుతాలు ఉండవు. ఆధ్యాత్మికత శక్తివంతమైనది. ప్రజలు దానిని గారడీగా భావిస్తే చాలా పొరపాటు. ఆధ్యాత్మికత భౌతికమైనది కాదు. అది వేదాంత పరమైనది. మనిషి తనలో దాగి ఉన్న శక్తులను తెలుసుకొని వెలికితీసే ప్రయత్నము చెయ్యాలి. మనలను గురించి మనము తెలుసుకొనగలిగితే, భవిష్యత్తు ఎంతో అందముగా, ఉజ్జ్వలంగా ఉంటుంది.

## గాయత్రి యొక్క మూడుచరణములు

మేము గాయత్రీమంత్రములోని మూడు చరణములను గురించి మీకు ఇంతకుముందే చెప్పి ఉన్నాము. వాటిని సత్యం, శివం, సుందరం అనే పేర్లతో కూడా పిలవవచ్చు. జ్ఞానమునకు కూడా సత్–చిత్–ఆనంద అనే మూడు చరణములున్నాయి. గాయత్రీ మంత్రములోని మూడు చరణములను మనము జ్ఞానయోగము, కర్మయోగము, భక్తియోగములని కూడా అర్థము చేసుకొనవచ్చు. మనలోని మూడు శరీరములను కూడా ఎంతో విలువైన రీతిలో రక్షించుకొనగలగాలి. వానిలో మొదటిది స్థూలశరీరము, దీనినే మన భౌతిక శరీరముగా చెప్పుకుంటాము. ఈ భౌతికశరీరము కర్మతో జోడించబడి ఉంటుంది. మనము చేసే కర్మలు ఎంతో ఘనముగా, నైపుణ్యముగా సాహసోపేతమైనవిగా ఉండాలి. ఆ పనులు చేసేటప్పుడు ఒక్క క్షణము కూడా వ్యర్థము కాకూడదు. చెడు పనులు చెయ్యకుండా ఉండటమేకాదు, మన జీవితములో సగభాగము వ్యర్థమైన పనులు చెయ్యటములోనే గడచి పోతుంది. దానిని మనము చక్కదిద్దుకోవాలి. రబ్బరును సాగదీసేవిధముగా మనము సమయమును వీలయినంత ఎక్కువగా ఉపయోగించుకోవాలి. సోమరితనము, బద్ధకము వల్ల మన జీవితము అస్తవ్యస్తమైపోతున్నది. కొంచెము పని చేసినంత మాత్రమునే, 'అయ్యో! నాకు పని ఎంతో భారమై పోతున్నది' అని బాధపడకూడదు. **పనిచెయ్యడములో ఆనందమును, ఉల్లాసమును పొందగలిగితే మనము చేసే పని భారమనిపించదు, పనిలో అభిరుచిని జోడించగలిగితే, సాధారణముగా చెయ్యగలిగే పనికి పదిరెట్లు పనిని సునాయాసముగా నిర్వహించవచ్చు.** మనిషికి సోమరి తనమును మించిన దురదృష్టము మరొకటి లేదు. అసలు 'సోమరితనము లేదా బద్ధకము' అనేదే లేదు అని మనలను మనము సమర్థించుకుంటాము. ఎందుకంటే మనకంటే పెద్ద పనిదొంగలతో మనలని మనము పోల్చుకొని సంతృప్తి చెందుతుంటాము. అది చాలా పెద్ద తప్పు. మనకన్నా ఎక్కువ

గెలవాలి, గెలిచి తీరాలి అని తీర్మానించుకుంటే నిన్ను ఓడించడం ఎవరి తరం కాదు

పనిచేసేవాళ్ళతో మనలను మనము పోల్చుకోవాలి. అప్పుడు మనము ప్రస్తుతము చేస్తున్న పనికంటే ఇంకా ఎంత ఎక్కువ పని చెయ్యగలిగే శక్తి సామర్థ్యములు మనకున్నాయో అర్థమవుతుంది. పనిని క్రమబద్ధమైన రీతిలో చెయ్యడమనేది మేము గాంధీగారి వద్ద నేర్చుకున్నాము. పనిని ఒక క్రమములో వ్యవస్థీకృతపద్ధతిలో, స్థిరసంకల్పముతో చెయ్యడము వలన ఎటువంటి లాభములను పొందగలమో, మేము వారినుండే నేర్చుకున్నాము. మీరు ఒక్కోరోజు విపరీతముగా పనిచేసి 'అబ్బా! రాత్రి 12 గంటల వరకు పనిచెయ్యవలసి వచ్చింది అని అనుకుంటుంటారు. అలా చెయ్యవలసిన అవసరమే లేదు. నిర్ణీత సమయములో సరిగ్గా అనుకున్న పనిని చేస్తుండటము వలన సమయము సదుపయోగమవుతుంది.

## కర్మయోగములోని తత్త్వసారము

కర్మయోగము అనేది మనకు అలవడితే ఖచ్చితముగా మన జీవితము భౌతికముగాను, ఆధ్యాత్మికంగాను అభివృద్ధి చెందుతుంది. ఎంత సమయమును మీరు వ్యర్థముగా, నిరుపయోగముగా గడుపుతున్నారో ఒక్కసారి గమనించండి. కేవలము సమయమును గడపటముపైననే కాదు, మనము చేసే పనియొక్క స్వరూపమును, ఆ పనియొక్క సిద్ధాంతమును, ఆదర్శమును కూడా పరిగణనలోకి తీసుకొని అర్థము చేసుకుంటే మీకు అందులోని ఆనందము అనుభవమౌతుంది. మీరు మీ కోర్కెలను పనిమీద కేంద్రీకరించి చెయ్యాలి కానీ, అలా జరగటము లేదు. మీరు మీ కోరికలను భౌతికసుఖ సౌకర్యములపైననే కేంద్రీకరిస్తున్నారు. వాటికి అంతమనేదే ఉండదు.

## నిష్కామకర్మయే కర్మయోగము

మన సుఖసంతోషములు మనము చేసే పనుల యొక్క ఫలితాల మీద, పరిణామాల మీద ఆధారపడి ఉంటాయి. ఫలితాల నుండి తప్పించి, కేవలము కర్మవరకే మన ప్రయత్నమును పరిమితము చెయ్యగలిగితే, 24 గంటలు మనకు సంతోషమే లభిస్తుంది. మనము చెయ్యవలసిన పనిని పూర్తిచేశాము, అంతే, ఇక ఫలితమును గురించి అసలు ఆలోచించవలసిన అవసరమే లేదు. మనము మన పిల్లవాడిని చదివిస్తాము. అతను న్యాయవాది అవుతాడో, వైద్యుడవుతాడో, విజ్ఞానవేత్త అవుతాడో మనకు తెలియదు. 'కర్మణ్యేవాధికారస్తే' అని గీతలో చెప్పబడిన ఒక్క వాక్యమును సర్వదా గుర్తుంచు కుంటే చాలు, మీకు కొంత ఊరట కలుగుతుంది, సంతోషము లభిస్తుంది.

మనము పనిచెయ్యాలి, చేస్తాము. పొలము దున్ని విత్తు నాటాము. వర్షము కురిస్తే పైరు సక్రమముగా పెరిగి పంట చేతికొస్తుంది, వర్షము కురవకపోతే... కురవకపోనువచ్చు. అది మన చేతిలో లేదు. కాబట్టి సంతోష, దుఃఖముల మధ్య మనము ఊయలలూగుతుంటే, మనకు ప్రశాంతత ఎప్పటికీ లభించదు. అందుచేత మీరు మీరు చెయ్యవలసిన పనిమీద, మీ కర్తవ్యము మీద దృష్టిని కేంద్రీకరించండి. దీనినే ధార్మికత అంటారు. జీవితానికి మూడు చరణములు ఉంటాయి. గాయత్రికి కూడా మూడే చరణములున్నాయి. అందులో ఒకటి కర్మకు సంబంధించినది. దానినే మీకు ఇప్పటిదాకా వివరిస్తున్నాను. ఆధ్యాత్మికగ్రంథాలలో దీనినే 'ధార్మికత'గా వర్ణించడము జరిగింది. ధార్మికత అనేది ఈ జీవనము యొక్క పద్ధతి. ధర్మము అనగా కర్మ! 'ధర్మక్షేత్రే!' అనగా ధర్మక్షేత్రమే కురుక్షేత్రము. ధర్మము యొక్క అర్థము కేవలము కర్మతోనే జోడింపబడినది. మానవుడు చేసే ప్రతి పని శ్రేష్ఠమైనదిగా ఉండాలి. ఆ చేసే పనిలో అతనికి అభిరుచి ఉండాలి. పూర్తి నిజాయితీతో పనిని నిర్వహించాలి.

మనిషి తాను చెయ్యవలసిన పనులను తన విధిగా భావించి చెయ్యాలి. నేను చెయ్యవలసిన విధులను సక్రమముగా నిర్వహించాను' అని మీరు భావిస్తే మంచిదే, కానీ శరీరమునకు సంబంధించి కూడా మీకు కొన్ని విధులున్నాయి. **'ఈ శరీరము మన ఇల్లు, జీవాత్మయొక్క మందిరము, నివాసస్థలము. దీనిని సంయమనముతో రక్షించుకోవాలి. స్వచ్ఛముగా, శుభ్రముగా కాపాడుకోవాలి'** అని మీరు తెలుసుకుంటే, శరీరము పట్ల మీ కర్తవ్యము అర్థమౌతుంది. తద్వారా శరీరమనే క్షేత్రములో ధర్మాత్ములుగా నిలబడటానికి మీరు చెయ్యవలసిన ప్రయత్నము బోధపడుతుంది. నేడు ప్రతి వ్యక్తీ ప్రతి వస్తువులో, ప్రతి అవకాశంలో ఆనందం పొందటానికి ప్రయత్నిస్తున్నాడు. అది చాలా తప్పు. మనలోని శక్తి సామర్థ్యములను ఉపయోగించు కొని శరీరము పట్ల మన ధర్మమును, కర్తవ్యమును సముచితమైన రీతిలో నెరవేర్చుకొనగలగాలి.

*– అఖండజ్యోతి, డిసెంబరు 2013*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**తోటివారి సమస్యలను కూడా పరిష్కరించడానికి కృషి చెయ్యాలి**

## నా వారితో నా మాట

# గురుప్రేమ మహాపర్వం



12 జులై, 2014 నాడు మన కుటుంబంలో అందరూ గురుపూర్ణిమను ఘనంగా జరుపుకుంటాము. గురుదేవుల సంపూర్ణ వ్యక్తిత్వం 'ప్రేమ' అనే రెండు అక్షరాలకు ప్రతిరూపం. వారిని కలిసిన వారందరికీ 'ఆత్మీయ సద్భావనలు మరియు సంవేదనలకు పేరు ప్రేమ' అని నేర్పించారు.

వారి ప్రేమ యొక్క విస్తృత అనుభూతికి రూపమే గాయత్రీ పరివార్. ప్రేమనే పరమేశ్వరు డంటారు. ప్రేమను పంచేవారికి అపార సంతోషం కలుగుతుంది, పొందినవారు కృతకృత్యులవుతారు. ప్రేమ అనేది ఏదో వ్యావహారికంగా మిత్రులతో-పరిచితులతో లేదా బంధువులతో-రక్తసంబంధీకులతో పంచుకునేది కాదు. మన వ్యక్తిత్వంలో, స్వభావంలో ప్రేమను సమ్మిళితం చేసుకోవాలి. ప్రసన్నత, సువాసన అనేవి పువ్వు యొక్క స్వభావం. అందుకు పువ్వు ఏమీ నేర్చుకోవలసిన పని లేదు. ప్రేమ కూడా ఇంతే.

స్త్రీ, పురుషుల మధ్య ఆకర్షణను తరచూ ప్రేమ అంటుంటారు. గురుదేవులు తమ చర్చలలో చాలాసార్లు ఈ ఆకర్షణ, ప్రేమ వేరు వేరు అని చెప్తూ వచ్చారు. వంశవృద్ధికి అవసరమైన ప్రకృతికి మాత్రమే అది ప్రేరణగా పని చేస్తుంది. పశు పక్షాదులలో, క్రిమికీటకాల్లో కూడా ఈ ఆసక్తి కనిపిస్తుంటుంది. ప్రేమ అనేది వేరేరకమైన అనుభూతి. భౌతిక లావాదేవీల మీద ప్రేమ ఆధారపడదు. ఇదొక ఉన్నత స్థాయి ఆధ్యాత్మిక లావాదేవి. గురుశిష్య సంబంధంలో సహజంగా ప్రవహించే ప్రేమలో దీనిని ప్రత్యక్షంగా దర్శించవచ్చు. ఈ మార్గంలో మొదటి అడుగు వేసేవారు త్యాగం చేయాలి. స్వీకరించే వారు ఇస్తున్న వారిని గుర్తించాలి, కృతజ్ఞత చూపెట్టాలి.

ఇందులో ఇద్దరు ఒకరినొకరు ఉద్ధరిస్తారు, ఎవరూ ఎవరినీ వదిలేయరు. ఏ బాంధవ్యం వల్ల ఆదర్శాలను పాలించడానికి బలం వస్తుందో, శ్రేష్ఠత్వం వెల్లడవుతుందో, సన్మార్గంలో పయనించడానికి సహాయం లభిస్తుందో ఆ బంధాన్నే ప్రేమ అనాలి. సద్గురువు యొక్క ఆధ్యాత్మిక ప్రపంచంలోనే అలాంటి ప్రేమ లభిస్తుంది. మామూలు ప్రపంచంలో ప్రేమ పేరుతో పతనం సంతలో అమ్ముడుపోతోంది. నిజానికి ప్రేమ అనేది ఆత్మిక గుణం, శారీరిక ఆకర్షణ కాదు. **ప్రేమలో తీసుకోవాలని ఉండదు, ఇవ్వాలనే ఆతురత ఉంటుంది, శాంతి ఉంటుంది.** ఆకర్షణ, ఆసక్తి, అనుబంధం సాధారణ మనుషుల మధ్య ఉంటుంది. నియమాలను, మర్యాదలను మరచిపోయి ఎదుటి వారి నుండి ఏదో పొందాలనే ఆశతో బంధాలను అల్లుతుంటారు. కాని ప్రేమలో ఇలాంటిదేమీ ఉండదు. పిల్లల పట్ల తల్లి ప్రేమను సాధారణంగా ఆదర్శంగా తీసుకుంటారు. ఇక్కడ భావనాత్మక లావాదేవీలే ఉంటాయి. ప్రత్యక్ష వ్యవహారాలలో ప్రేమ పంక్తిలో ముందు నిలబడినవారికి నష్టమే ఎక్కువ ఉంటుంది, ఎందుకంటే వారి మీదే ఎక్కువ బాధ్యత ఉంటుంది. ప్రేమించే వారి వ్యవహారం, బాధ్యత తీసుకునే విధానంతోనే ఫలిస్తుంది. తల్లి బిడ్డను ఒడిలో ఎత్తుకుంటుంది, తండ్రి భుజానికి వేసుకుంటాడు. ఎత్తుకుని తిరిగే వాత్సల్యం ఎంతగా ఉప్పొంగితే అంతటి నిజమైన ప్రేమ ఉన్నట్టు కనిపిస్తుంది.

ఆదర్శాలను మాత్రమే నిజంగా ప్రేమించవచ్చని యుగఋషి, పరమపూజ్య గురుదేవులు చెప్పారు, నేర్పారు. ఆత్మ పట్ల ఉన్న ఉత్కృష్ట ప్రేమ పిపాసనే పరమేశ్వరుడు అంటారు. ప్రేమకు నిజమైన కేంద్రం పరమేశ్వరుడు. ఇందులో స్థిరత్వం ఉంది, కోరుకున్న ఉద్దేశాల పూర్తి కూడా అవుతుంది. భౌతిక ప్రేమలో ఎన్నో రకాల స్వార్థాలు కూడా ఉంటాయి. ప్రతిఫలాన్ని ఆశిస్తుంటారు, దక్కనప్పుడు ఆ ఉన్మాదంలో ఎన్నో ఆటుపోట్లు తలెత్తుతాయి. నేటి మిత్రుడు రేపటి శత్రువవుతాడు. దీన్ని ప్రేమ అనాలో లేక వ్యాపారమనాలో! లాభం ఉన్నప్పుడుండే ఆకర్షణ, నష్టం వచ్చినప్పుడు వికర్షణగా మారడం స్వాభావికం.

కాని ఆధ్యాత్మిక ప్రేమలో లాభమే లాభం. ఇది ఒక వైపు నుండే వచ్చే వరం. ఇందులో బదులుగా దేనిని ఆశించరు. విగ్రహారాధన ఉపదేశంచే తత్త్వదర్శనం కూడా ఇదే అని గురువుగారు చెప్తుండేవారు. భక్తుడు చేసే ఆరాధన, అర్చన,

**శక్తివంచన లేకుండా శ్రమిస్తే ప్రపంచం సలాం చేస్తుంది**

అభ్యర్థన అన్నిటికీ విగ్రహం కనీసం నవ్వదు, పైగా నిశ్చలంగా ఉంటుంది. అయినప్పటికీ భక్తుడు ఏమాత్రం తడబాటు లేకుండా, మనస్సులో అపనమ్మకం రానివ్వకుండా ఉపాసనలో లీనమై ఉంటాడు. భక్తుడి గొప్పదనం ఇదే. ఏ ఆశ ఉండదు, ఏ అపేక్ష ఉండదు. ఇందులో ఎలాంటి అడ్డంకులు ఉండవు. సామాన్య మానవులలో హెచ్చు తగ్గులు కనిపిస్తూనే ఉంటాయి. గాలిపటంలా ఒక్కోసారి ఆకాశంలో ఎగురుతూ, మరోసారి నేల మీద కనిపిస్తుంటారు. ఇందులో వింతేమీ లేదు.

ఇచ్చే ముందు ఏదైనా పొందాలనే అత్యాశ ఉంటే మాత్రం నిరాశ తప్పదు. అయినా మనలను మనం నియంత్రించు కోవచ్చు కానీ ఎదుటి వారిది మన చేతిలో ఉంటుందా! ప్రేమలోని ఆరాధన ప్రత్యేకమైనది. మరొకరి కృపతో దక్కేదీ కాదు, తగ్గేదీ కాదు. మన అంతఃకరణలో అంకురిస్తుంది. అవతలివారు సహరించడం, లేకపోవడం అనేది వారి ఇష్టం. ప్రేమించినప్పుడు బదులుగా ఏదీ కోరదు. ఇలా అయితేనే ఆధ్యాత్మిక ప్రేమ సాధ్యమవుతుంది. దీనిని అనుభూతి చెందాలనుకునే వాళ్ళు తమ ఆంతరిక ఉత్కృష్టతను, ఉదార భావసంవేదనను వెల్లడించడానినే ప్రేమ అంటారని తెలుసు కోవాలి, అర్థం చేసుకోవాలి.

తల్లి-బిడ్డ, భార్య-భర్త, స్నేహితులు-బంధువులు మధ్య ఉండే స్నేహంలో కూడా స్వార్థం లేకుండా స్నేహ సౌజన్యాలుండాలనే కోరుకుంటారు. ప్రియమైన వారి పట్ల అనన్య సద్భావన ఉంటుంది. తప్పులు సరిదిద్దుతూ, ఆదర్శాల పట్ల నిష్ఠ కలిగి ఉండాలని కోరుకుంటారు, కానీ ఏ అపేక్ష ఉండదు. ఈ విధంగా ప్రేమ పరాకాష్ఠకు చేరడంలో ఏ సందేహం ఉండదు. ఈ ప్రేమ సాధనలో మనుషులు విగ్రహాలు, చిహ్నాలలాగా ఉపకరణాలుగానే ఉంటారు కానీ లక్ష్యం కాదు. భర్త చనిపోయినా పతివ్రతకు తన భర్త మీదున్న ప్రేమ రవ్వంతైనా తగ్గదు. **శరీరం లేనంత మాత్రాన ఆత్మతో బాంధవ్యం ఏర్పర్చుకోవడానికి ఏ అడ్డంకీ ఉండదు.** ఈ దృష్టిలో గురుసత్తా పట్ల ప్రేమ, పరమాత్మ పట్ల ప్రేమ పూర్తిగా వ్యవహారికమైనది. ఇందులో ఆత్మ సమర్పణ ముఖ్యం. గురుకృప లేదా ఈశ్వరుని అనుగ్రహం కోసం వేచి ఉండవలసిన అవసరమే లేదు. మన ఆత్మ సమర్పణ గురుచైతన్యాన్ని, ఈశ్వరుని చైతన్యతను తాకి ప్రతిధ్వనిస్తుంది. ప్రేమ ప్రతిధ్వనిస్తే లక్ష్యసిద్ధి కలుగుతుంది. బ్రహ్మాండమంతా అది ప్రతిధ్వనించి, అనంతమైన భావ సంవేదనలు తిరిగి అందడం వల్ల అంతరాత్మ అనంత ఆనందాన్ని పొందుతుంది.

ప్రేమపాత్రులు ఎంత తోడ్పడ్డారు అన్నది ముఖ్యం కాదు. మనకి కావలసింది ప్రేమ, సంవేదనలతో దక్కాలి తప్ప అవతలి వారి సహకారంతో కాదు, ఆంతరిక బలం ఆధారంగా ఏకాకిగా వికసించడానికి చేసే తపశ్చర్యనే ప్రేమసాధన అంటారు. భక్తియోగమంటే ఇదే, సద్గురుప్రేమ అంటే ఇదే. ఆత్మ సాక్షాత్కారంతో మొదలుకుని ఈశ్వర దర్శనం వరకు ఆధ్యాత్మిక లబ్ధులన్నిటికీ ఇదే ఆధారం. **గురుదేవులు తమ అనుభవ సారాన్ని వివరిస్తూ ఎన్నోసార్లు చెప్పారు, మనిషిలో దైవత్వం ఉదయించడానికి, పరమాత్మ ప్రత్యక్షమవడానికి ఆధారం ఈ ప్రేమ యోగం.** గురుదేవులు సాకారంగా ఉన్నప్పుడు, వారి సాన్నిధ్యంలో ఉన్నప్పుడు, సమర్పణ చేసుకున్నప్పుడు కలిగిన ఆనందం, భావపూరిత ప్రేమ సంవేదనలు ఇప్పుడు కూడా అనుభూతి చెందవచ్చు.

పరమాత్మ ఎవరు? ఎలా ఉంటాడు? ఆ స్వరూపాన్ని మనిషి తన కల్పనతో ఊహించాడు. ఉపాసనకు సౌకర్యంగా, ధ్యాన ధారణలు, జీవితతథ్యాల నిర్ధారణ సక్రమంగా జరిగేట్టుగా మాత్రం జాగ్రత్తలు తీసుకున్నారు. నిజానికి భగవంతునికి రూపం, ఆకారం అయితే లేదు. కానీ భక్తుల భావనలను అనుసరించి అన్ని రూపాలు ధరించగలడు. కానీ ఏ రూపంలో ఊహించుకున్నా ఉత్కృష్టత, ఆదర్శవాదం తప్పక ఉండేవిధంగా జాగ్రత్త పడాలి. భగవత్ స్వభావంలో నికృష్టతకు, దుష్టత్వానికి చోటులేదు.

భగవంతుడు నిరాకారుడు అనుకుంటే సత్, చిత్, ఆనందాలను సత్యం, శివం, సుందరానికి కేంద్రంగా, సత్‌జ్ఞాన ప్రవాహంగా భావించాలి. ఈ అనుగ్రహాన్ని అందించే పరమేశ్వరుడే సవిత. ప్రాతః సూర్యుడు అందుకు ప్రతీక. శ్రద్ధాళువైన శిష్యుడు సద్గురువులో ఇది అనుభవిస్తాడు. శ్రద్ధతో, భక్తితో తాదాత్మ్యాన్ని పొందచ్చు. శ్రేష్ఠత్వం పట్ల అపరిమిత ప్రేమే శ్రద్ధ. ఔదార్యంతో చేసే ఆత్మీయ సంవేదనాత్మక సేవని భక్తి అంటారు. ఇదే యోగం, తపస్సు. వీటి ఏకీకరణే ప్రేమ. శిష్యులకు, గురుభక్తులకు, సాధకులకు ప్రేమయోగమే అన్నింటి కన్నా ముఖ్యం. కర్మయోగ, జ్ఞానయోగ సోపానాలను

**గొప్పవాళ్ళు కావాలనుకుంటే ప్రతిభ సరిపోదు, ప్రతికూల పరిస్థితులను ఎదురించి పోరాడాలి**

అధిరోహించి లక్ష్యాన్ని చేరాలంటే ప్రేమయోగ సాధన చేసి తీరాలి.

అందుకు ప్రతిఫలం తక్షణం లభిస్తుంది. 'కాక్ హోయగీ పిక్, బకఉఃా మరాలా' అని తులసీదాసు రామచరితమానస్‌లో వ్రాసారు. అంటే, కాకి తక్షణం కోయిలగా మారుతుంది, కొంగ హంసగా మారుతుంది. ఆధ్యాత్మిక శాస్త్రాల్లో 'రసం' అని దేనిని అంటారో, ఏ రసానుభూతి ఆత్మతృప్తిని కలుగుతుందో, ఆ రసమే గురుప్రేమ. ఈ ప్రేమ వికసించి ఈశ్వర సాక్షాత్కారంగా, అంతఃకరణతో శాశ్వత ప్రేమగా ఉప్పొంగు తుంది. గురుస్మరణ, సమర్పణ, పరమేశ్వర ఉపాసన, ఆరాధన, భక్తియోగం ద్వారా ఈ ప్రేమను అభ్యసిస్తారు.

సద్గురువును ప్రేమించి, భక్తి సాధనను అభ్యసించే సాధకులు తమ అంతరంగాలలో భావనాత్మకంగా, మరియు బహిరంగంగా తమ క్రియాత్మక ప్రేమను ప్రదర్శిస్తారు. ప్రేమసాధన సార్థకం అవడానికి ప్రమాణం-సత్కార్యాలతో నిండిన కర్మక్షేత్రం, సదాలోచనలతో నిమగ్నమైన జ్ఞానక్షేత్రం, సద్భావనలతో నిండిన అంతఃకరణ.

శరీర నిర్వహణకు ఆహారం ఎలా అవసరమో, ఆత్మతృప్తికి ప్రేమతో నిండిన భావసంవేదనలు అలా అవసరం. వ్యవహారంలో ప్రసన్నత, ఉల్లాసం, ఉత్సాహం, ఆశ వంటి ఆనందకరమైన సంవేదనల ఉచ్ఛస్థరీయ అనుభూతి ప్రేమ. వస్తువులను గాని, మనుషులను గాని ప్రేమిస్తున్నాము అంటే అవి అత్యంత ప్రియమైనవిగా అనిపిస్తాయి. అది ఆ వస్తువు లేదా మనిషి గొప్పతనం కాదు. మన ఆత్మీయ సంవేదన యొక్క ప్రతిక్రియ. రూపం, గుణం, స్వభావం మంచివైనా కూడా ఎవరినైనా శత్రువులు అని భావిస్తే వారిని నిందిస్తాము. అదే నిందారోపణ చేయబడ్డవారైనా మనకు ఆత్మీయులు అనుకుంటే వారిలో ఏ లోపం కనిపించదు, పైగా ప్రశంసిస్తూనే ఉంటాం.

సామాన్యులలో గుణాలతో పాటు దోషాలు ఉంటాయి. సందర్భానుసారంగా అవి కూడా బయటపడతాయి. కాబట్టి ప్రేమ సాధనకు గురుప్రేమ, ఈశ్వర ప్రేమ సర్వశ్రేష్ఠమైనవి. మన అంతఃకరణాన్ని సద్గురు వ్యక్తిత్వంలో సమర్పించాలి, విసర్జించాలి, విలీనం చేయాలి. దానికోసం వారి వ్యక్తిత్వాన్ని, ఆలోచనలను నిరంతరం స్మరిస్తూ, మననం చేస్తూ ఉండాలి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగడం చాలా అవసరం. సద్గురువు, పరమాత్మ వేరు కాదు అన్న విషయం గుర్తుంచుకోవాలి. ఆయన ఎప్పుడో అవ్యక్తునిగా మారారు. వారికి సమర్పించుకుంటే పరమాత్మకు సమర్పించుకున్నట్టే. ప్రేమ సాధనలో లీనమైతే, అనుభూతుల కోణం తక్షణం మారుతుంది. అప్పుడు శిష్యుడు, భక్తుడు అనుక్షణం ఇదే అనుభవిస్తాడు -

**మనస్సు గోతిలోకి పడినప్పుడల్లా; వెనకుండి పట్టుకున్నది ఎవరు?**

**జీవితంలోని వనరులన్నీ ఎండిపోయినప్పుడు; ప్రవాహానికి ఒడ్డుకు కొట్టుకుపోయినప్పుడు**

**ఇన్ని కష్టాలలో కూడా దృఢవిశ్వాసంతో; జీవితానికి రేయింబవళ్ళనిచ్చిందెవరు?**

**జీవితంలో చీకట్లు అలముకున్నప్పుడు; కాలం కలిసిరానప్పుడు**

**నీడలా వెన్నుండి జీవితం కుదుటపరిచిందెవరు?**

**సమాజం హింసించినా,**

**ఒంటరితనంలో సౌఖ్యాన్నిచ్చి జీవితానికి కొత్త కోణం చూపిందెవరు?**

*- అఖండజ్యోతి, జులై 2014*
*అనువాదం: ఎం.వి.ప్రసాద్*

## విధి నిర్వహణ

*ఇటలీలోని పొంపీ నగరంలో 200 సం॥ పూర్వం భయంకరమైన భూకంపం వచ్చింది. వెంటనే అగ్ని పర్వతం ప్రేలుడు కూడా సంభవించింది. నగరంలోని ప్రజలంతా ప్రాణభయంతో ఊరు వదలి పారిపోయారు. నగరం ధ్వంసమైపోయింది. కానీ ఈ మధ్య పురాతత్వ పరిశోధన శాఖవారు శిథిలాలను త్రవ్విచూడగా, శిథిలాలలో ఇరుక్కొని ఒక అస్థిపంజరం భుజాన తుపాకి ధరించి నిశ్చలంగా పహారా కాస్తున్న భంగిమలో వారికి లభించింది. ప్రాణాలను సైతం లెక్కచేయక తన విధి నిర్వహణను నిష్ఠతో, నిజాయితీతో నిర్వహించిన ఆ మహానుభావునికి (పహారాదారునికి) నివాళులర్పించి, దానిని పురాతన వస్తు ప్రదర్శనశాలలో పదిలపరచటం జరిగింది.*

- ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**ఏ లక్ష్యమైనా నెరవేరాలంటే పగలనక, రాత్రనక కష్టపడాలి**

# స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 4

**శ్రీమతి ఎ. సావిత్రీ నర్సింగరావు, ఫోన్: 9704778451**



శ్రీమతి ఎ. సావిత్రీ నర్సింగరావుగారు 1958లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రములోని ఖరగ్‌పూర్‌లో జన్మించారు. ప్రి యూనివర్సిటీ కోర్సులో ఉత్తీర్ణులైనారు. ఆంగ్ల భాషా మాధ్యమంగా విద్యాభ్యాసం సాగింది. బెంగాలీ భాషలో ప్రవేశమున్నది. మాతృభాష తెలుగు. తన 19వయేట, 1977లో శ్రీ నర్సింగరావుగారితో వివాహం జరిగింది. భారతీయ రైల్వేలో రైల్వేలైన్ ఇన్‌స్పెక్టర్ పదవిలో పనిచేసేవారు. భర్త ఉద్యోగరీత్యా రాంచీలో పనిచేస్తూ ఉండగా, ఒక పర్యాయం 1985లో పూజ్యగురుదేవులు సమీపంలోని "మురి" అనే గ్రామంలో యజ్ఞం చేయు నిమిత్తం వచ్చినారని తెలిసి అచ్చట వారిని దర్శించుట జరిగింది. ఆనాటి నుండి గాయత్రీ పరివార్‌తో అనుబంధం దిన దిన ప్రవర్ధమానం కాసాగింది. బొకారో మరియు రాంచీలో గాయత్రీ శక్తిపీఠాలున్నాయి. దుర్గా నవరాత్రులందు ఇచ్చట అనుష్ఠానాలు బాగా నిర్వహిస్తూ ఉంటారు. కపిల్ కేసరిగారు శాంతికుంజ్ టోలీతో వచ్చి 5 రోజులు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. యజ్ఞాలు 3 రోజులు నిర్వహించేవారు. మొదటి రోజు ఇంటింటా అక్షతలు పంచి యజ్ఞానికి అందరిని ఆహ్వానించేవారు. రెండవరోజు కలశ యాత్ర, మూడవరోజు గాయత్రీ యజ్ఞాన్ని నిర్వహించుట జరిగేది. ఈ సందర్భాలలో ఎక్కువగా, సత్సంగాలు చేస్తూ గాయత్రీ చాలీసా, ప్రజ్ఞాపురాణ కథాగానం ద్వారా జ్ఞానయజ్ఞం చేస్తూ ఉండేవారు. పూజ్య గురుదేవులతో సంపర్కం, వీరి కుటుంబంలో అనేక లాభదాయకతలకు ఆలవాలమై, వీరి భర్త 22 సంవత్సరాల పాటు బదిలీ లేకుండా ఒకే స్థానంలో ఉండుట 3 పదోన్నతులు పొందుట అత్యంత అరుదైన సంఘటన. మరియు వీరిపై గురుదేవుల కృపకు నిలువెత్తు తార్కాణం. ఈ సభ్యులంతా వరకట్న విముక్తికై, వ్యసన విముక్తికై తీవ్రంగా కృషి చేసి సత్ఫలితాలను పొందారు.

2000లో రాంచీ వెళ్ళారు. అప్పుడు హరిద్వార్‌లో నిర్వహించిన రెండవ పూర్ణాహుతిలో పాల్గొన్నారు. శాంతికుంజ్ నుండి వెలువడెడి అఖండజ్యోతి (హిందీ) మరియు యుగ నిర్మాణ యోజన పత్రికలను క్షుణ్ణంగా చదువుట వీరికి అలవాటుగా మారింది. దాదాపు 30 పై చిలుకు సక్రియ కార్యకర్తలు అచ్చట స్త్రీల విభాగంలో పనిచేసేవారు. వీరంతా గాయత్రీ యజ్ఞాలు మరియు సప్త ఆందోళన కార్యక్రమాల ప్రచారంలో శ్రీ కపిల్ కేసరిగారి సారథ్యంలో చక్కగా నిష్ణాతులైనారు. ఈ రీతిగా సాగిన జ్ఞాన ప్రచార ఉద్యమ ప్రభావంతో ఆ పరిసర ప్రాంతాలలో బందిపోటు దొంగల దాడులు, అరాచకాలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. వీరి సేవలను పూజ్య గురుదేవులు ఈ రీతిలో వినియోగించి సమాజ సేవకు తగిన రీతిలో తీర్చిదిద్దుట వీరి పూర్వజన్మ సుకృతం.

సంతానం యొక్క ఉన్నత చదువుల కొరకై కుటుంబాన్ని విశాఖపట్నానికి తరలించారు. అప్పుడు క్రియాన్వితంగానున్న భీమిలిలోని గాయత్రీ శక్తిపీఠం ద్వారా కార్యక్రమాలు చేపట్టారు. తన సంతానానికి ఎట్టి కట్నకానుకలు లేకుండా గాయత్రీ సిద్ధాంతాల కనుగుణ్యంగా వివాహం చేశారు. విజయనగరం జిల్లాలోని కురుపాం, చినమేరంగి మున్నగు అనేక చోట్ల గాయత్రీ యజ్ఞాల ద్వారా గాయత్రీ పరివార్‌ను విస్తరింప చేశారు. శ్రీమతి సావిత్రీగారు తన సుస్వరంతో పూజ్య గురుదేవుల మరియు వందనీయ మాతాజీల విరచితమైన ప్రేరణ గీతాలను వీనులవిందుగా పాడి శ్రోతలను అలరించుచూ వారిని గాయత్రీ ఉపాసన పట్ల ఆకర్షితులను గావించుచున్నారు.

పైవానికి తోడుగా గాయత్రీ జ్ఞాన యజ్ఞం ద్వారా గురుదేవుల సాహిత్యాన్ని ఇంటింటికి చేర్చెడి దానిలో భాగంగా తన భర్తయైన శ్రీ నర్సింగరావు సహకారంతో మారుతి

**శ్రమించడం వాయిదా వేస్తే విజయం విశ్రమిస్తుంది**

వాహనాన్ని (ఓమ్ని) ఖరీదు చేసి విస్తృతంగా ప్రచారం చేస్తూ గురుదేవుల సాహిత్యాన్ని ప్రజలకు అందుబాటులోనికి తెచ్చుట మిగుల ప్రశంసనీయము. శ్రీ నర్సింగరావు ఇతరుల వలె పదవీ విరమణానంతరం ధనార్జనలో మునిగిపోక తన వానప్రస్థ జీవితాన్ని తన అర్ధాంగితో కలసి పూజ్యగురుదేవుల మార్గంలో చరిస్తూ సమాజ కళ్యాణానికి కృషిచేయుట మనందరికి ఆదర్శం మరియు ఆచరణీయం. ఈ ఆదర్శ పుణ్యదంపతులు వీరి కుటుంబం ఇదే రీతిలో గురుదేవుల మార్గంలో చిరకాలం నడవాలని కోరుకుంటూ దీర్ఘాయురోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థించుదాం.

**జుజ్జూరి సాంబశివరావు, ఫోన్: 9849859576**



గుంటూరు జిల్లా, అచ్చంపేట మం॥, పోనూరు గ్రామంలో 1949 సం॥లో తల్లిదండ్రులకు ప్రథమ సంతానంగా జన్మించారు. వీరి తల్లిదండ్రులు చాలా కాలం సంతానలేమితో బాధపడు చుండగా, విజ్ఞుల సూచన మేరకు సమీప గ్రామమైన గ్రంథసిరిలో వేంచేసియున్న శివుని ఆలయంలోనున్న పుట్ట చుట్టూ ప్రదక్షిణలు వీరి తల్లి చేయుటకు ప్రతిఫలముగా మన సాంబశివరావుగారు ఆమెకు తొలి సంతానంగా జన్మించారు. ఈవిధంగా ముమ్మందు మహాకాలుని ప్రతిరూపమైన పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యుల యుగనిర్మాణ కార్యక్రమంలో ఒక సైనికునిగా పనిచేయుటకు కావలసిన అర్హతను తన తల్లి శివాలయ ప్రదక్షిణల ద్వారా జన్మతః సాంబశివరావుగారు పుణికి పుచ్చుకొన్నారు.

యుక్త వయస్సు రాగానే 1972లో బ్రతుకుపోరులో బాటను వెతుక్కుంటూ గుంటూరు పట్టణానికి వలస వచ్చారు. తన 16వ ఏటనే ఆనాటి సమాజ పోకడలకనుగుణంగా తల్లిదండ్రులు వివాహం చేశారు. ఇంటిలో తయారు చేసిన ఇడ్లీలను ఇంటింటికి తిరిగి అమ్ముతూ తన కుటుంబ జీవన యాత్ర ప్రారంభించారు. తదుపరి కొన్నాళ్ళకు కుటుంబ ఆదాయాన్ని పెంచుకొనెడి దిశగా సైకిల్‌పై బట్టల మూటను పెట్టుకుని గ్రామాలలో విక్రయించుట ప్రారంభించారు. వ్యాపార మెళకువలు నేర్చుకొని, ఆర్థికంగా పుంజుకొన్న సాంబశివరావు గారు 1983లో మరొక ఇరువురితో కలసి బట్టల దుకాణాన్ని గుంటూరులో ప్రారంభించారు. బట్టల దుకాణాదారుల సంఘంలో ప్రముఖ పాత్రను పోషిస్తూ యేటేటా శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తూ శ్రీరాముని భక్తునిగా మారాడు. 1992లో శ్రీరామ నవమి వేడుకల నిర్వహణలో భాగంగా గాయత్రీ యజ్ఞాన్ని శ్రీరామనవమి పందిరిలో ఏర్పాటు చేయగా మిగుల ప్రభావితుడై గాయత్రీ ప్రచార సంస్థతో అనుబంధం ఏర్పడింది. దీనితో డా॥ తుమ్మూరి శివరామకృష్ణారెడ్డి గారితో అనేక గాయత్రీ యజ్ఞాలు, సత్సంగాలు చేస్తూ గాయత్రీ పరివార్‌కు మరింత చేరువై, 1993లో గురుపౌర్ణమిని శాంతికుంజ్, హరిద్వార్‌లో చేసికొన్నారు. అదే సమయంలో యుగశిల్పి శిక్షణను కూడా పొంది 40 దినాలు శాంతికుంజ్‌లో గడిపారు.

పై రీతిగా మరింత ప్రభావితులైన శ్రీ సాంబశివరావుగారు తన కుమారుని భాగస్థుల షాపులో గుమాస్తాగా చేర్చి, పెద్ద కుమార్తె వివాహ పూర్తిచేసి, రెండవ కుమార్తెకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి, బిడ్డల సంపాదనను కుటుంబ పోషణకై వెచ్చిస్తూ తాను పూర్తి సమయదానమిచ్చి గాయత్రీ పరివార్ కార్యక్రమాలలో, శ్రీ తుమ్మూరిగారికి చేదోడు వాదోడుగా నిలచి పనిచేయసాగారు. తదుపరి "గాయత్రీ పరివార్" పేరుతో ప్రారంభించిన మాసపత్రిక ముద్రణ, పంపిణీ వగైరా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ గాయత్రీ శక్తిపీఠం, నారాకోడూరును బలపేతం చేయుటలో గణనీయమైన పాత్రను పోషించుట జరిగింది. గాయత్రీ శక్తిపీఠ నిర్మాణం వివిధ దశలలో సాంబశివరావుగారు పటిష్టమైన సేవలనందించారు.

పై రీతిగా సాగిపోవుచున్న సాంబశివరావుగారు ఆధ్యాత్మిక జీవనంలో అనుకోని విధంగా భార్య అనారోగ్యం పాలైన కారణంగా, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అదుపుతప్పగా, జీవన సహచరి అర్ధాంగి కోరిక ప్రకారం, తనయుని వివాహం పూర్తిచేసి, తిరిగి కుటుంబ భారాన్ని పూర్తిగా తన భుజ స్కంధాలపైన నిడుకొని, గాయత్రీ శక్తిపీఠం నారాకోడూరు నుండి వెలికి వచ్చి, కుటుంబ ఆర్థిక పటిష్టతకై పాటుపడ సాగారు. 2002లో పత్నీవియోగంతో, కుటుంబ భారం మరింతగా పెరుగుటచే గాయత్రీ శక్తిపీఠానికి సమయమివ్వ జాలక, తన గృహంలోనే "గాయత్రీ జ్ఞాన్‌మందిర్" పేరిట

**గమ్యం చేరేవరకు అలుపు సొలుపు లేకుండా ప్రయత్నించవలసినదే**

ప్రజ్ఞామండలికి అంకురార్పణ చేసి 2005 నుండి నిత్య హవనం చేయుట ప్రారంభించారు.

ఎన్ని అవాంతరములు ఎదురైనను, గ్రంథసిరి గ్రామంలో వేంచేసియున్న శివుని అనుగ్రహంతో జన్మించిన సాంబ శివరావు, ఆ మహాకాలునిచే స్థాపించబడిన గాయత్రీ పరివార్ గుంటూరు జిల్లా శాఖలో ప్రముఖ సేవకునిగా తన జీవితాన్ని చక్కగా మలచుకున్నారు. 2001లో తిరుపతిలో జరిగిన అశ్వమేధయజ్ఞంలో, మధురైలో, 2011లో జరిగిన జన్మ శతాబ్ది కార్యక్రమంలో ఎక్కువ సమయదానాన్ని అందించి మరుజన్మకు కావలసిన సాధన సంపత్తుల బీజాలను నాటుకున్నారు.

గ్రంథ సిరి శివుని కృపతో జన్మ తీసికొన్న సాంబశివుడు (సాంబశివరావు) మహాకాలుని ప్రణాళికలో, ఒక సుశిక్షిత సైనికునిగా మారి సేవలనందించుచున్న, మహాకాలుని ప్రేమాదరాభిమానాలను తాను తన కుటుంబ సభ్యులు, తనివి తీరా గ్రోలుచున్న ధన్యజీవి, మనందరికి స్ఫూర్తిదాత.

**శ్రీమతి ఎన్. మునిలక్ష్మి, ఫోన్: 9963243740**



29, మే నెల 1957లో 'సట్టు' వారి కుటుంబం మొదటి సంతానంగా తిరుపతి పట్టణములో గంగిరెడ్డి-అనసూయమ్మ దంపతులకు జన్మించారు. తండ్రి గంగిరెడ్డిగారు జన్మతః దండిగా ఆధ్యాత్మిక వాసనలు కలిగియున్న వారగుటచే, ఆ వాసనలు శ్రీమతి మునిలక్ష్మిగారికి జన్మతః అలవడ్డాయి. ప్రతిపనిని శ్రద్ధాసక్తులతో ఏకాగ్రతతో చేయమని ఆమె తండ్రి ఆమెకు బోధిస్తూ వచ్చారు. అదే విషయం ఆమె హృదయంలో బలంగా నాటుకోగా, దానిని ఆచరణలో పెట్టింది. తత్ఫలితంగా ఆమెలో శ్రద్ధాసక్తులు పనిపట్ల ఏకాగ్రతను అలవాటు చేసికొంది. మే నెల 27, 1973లో శ్రీ ఎన్.రాజారెడ్డిగారితో వివాహమైంది. గృహిణిగా తన జీవితాన్ని కొనసాగిస్తూ ఇరువురి మగ సంతానానికి తల్లి అయ్యింది.

2001 తిరుపతిలో జరిగిన అశ్వమేధయాగం ద్వారా ఆమె జీవితంలో గాయత్రి ప్రవేశించుటకు దారితీసింది. డిసెంబరు 28, 2001న ఆమె ఇంటిలో దేవస్థాపన జరిగింది. నిత్య గాయత్రీ జపం, ఆమె నిత్య జీవితంలో ఒక భాగంగా మారింది. దీనితో గాయత్రీ పట్ల ఉత్సుకత పెరిగి పూజ్య గురుదేవుల ఆత్మకథ, ఏకాంత సహచరులు మున్నగు పుస్తకాలను పఠించింది. దీనితో ఆమెలో గురుదేవుల పట్ల ఆరాధనా భావము ద్విగుణీకృతం కాసాగింది. తిరుపతి ఎల్.ఐ.సి.లో పనిచేస్తున్న కోటేశ్వరరావుగారి ఇంటిలో జరిగిన గాయత్రి యజ్ఞములో పాల్గొని మరింత ఉత్తేజితురాలైంది.

అశ్వమేధం జరిగెడి తేదీలలో తన ఇంటిలో నీటి ఎద్దడి ఎక్కువగానున్నది. నిత్యం 5-6 గురికి మించి నీరు వచ్చేది కాదు. అదే సమయంలో దాదాపు 120 మంది యాగంలో పాల్గొనుటకై ఆమె ఇంటిలో చేరారు. నమ్మశక్యం కాని రీతిలో ఆమె ఇంటిలోని గొట్టపు బావి నుండి నీటి లభ్యత పెరిగింది. అది నేటికీ కొనసాగుతున్నది.

ఈ రీతిగా సాగుచున్న ఆమె ఆధ్యాత్మిక జీవనం 2004లో శాంతికుంజ్, హరిద్వార్ సందర్శనతో మరింత బలపడింది. అచ్చట ఆమెకు పూజ్యగురుదేవుల సూక్ష్మ సందర్శనానుభూతి కలిగింది. 2006లో ఆయుర్వేద వైద్యులు నిర్వహించిన ఆయుర్వేద వైద్యంలో ఆరు మాసములు శిక్షణ తీసికొన్నది.

దీనికి సంబంధించిన ఆయుర్వేద పుస్తకాలను చదివి, ఆయుర్వేద చికిత్సలో ప్రావీణ్యాన్ని సంపాదించి, వైద్యం ప్రారంభించి, ప్రజల ఆమెదాన్ని, ఆదరణను చూరగొన్నారు. 2005లో త్రిఫలచూర్ణం తయారీ విధానాన్ని శాంతికుంజ్‌లో నేర్చుకొనుటతో ఆమె ఆయుర్వేద వైద్యానికి బీజాలు పడ్డాయి.

2007లో గుంటూరు జిల్లా నారాకోడూరు, గాయత్రీ శక్తి పీఠంలో పరమ పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి గారి సందర్శన భాగ్యం కలిగింది. వారి ఉపన్యాసాలతో మరింత ప్రభావితురాలై గాయత్రీ ప్రజ్ఞాపీఠాన్ని తన ఇంటిలో స్థాపించి పదుగురికి ప్రేరణనందిస్తూ, సత్సంగాల నిర్వహిస్తూ, పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల విరచిత సాహిత్యాన్ని, యుగశక్తి గాయత్రీ మాసపత్రికను పదుల సంఖ్యలో పంచుతూ సంవత్సరానికి అంశదాన రూపంలో, జ్ఞానదానరూపంలో 2 లక్షల రూపాయల వరకు తన సంపాదనను వెచ్చించుచున్న వితరణ శీలి, స్ఫూర్తిదాత. నాటు-కోసుకో అనెడి మంత్రాచరణకు చిరునామా.

**వేలమైళ్ళ ప్రయాణమైన ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి శ్రద్ధాంజలి కార్యక్రమాలు

పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి శ్రద్ధాంజలి కార్యక్రమం గుంటూరులోని సప్తర్షి ఆశ్రమంలో 2014, జులై 12 ఉదయం శ్రీ డి.వి.ఎన్.బి. విశ్వనాథ్‌గారి అధ్యక్షతన జరిగింది. రాష్ట్రం నలుమూలల నుండి మాష్టారి శిష్యులు, అనుచరులు, అభిమానులు దాదాపు 1700 మంది దీనిలో పాల్గొన్నారు.

**శ్రీ డి.వి.ఎన్.బి. విశ్వనాథ్‌గారు** సభను ప్రారంభిస్తూ, డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ – "ఒక స్నేహితుడు, మార్గదర్శి, గురువు, ఆధ్యాత్మికవేత్త ఆత్మీయుడు, సంరక్షకుడు, హితుడు, ప్రాణదాత, మనల నడిపించిన ఒక గొప్ప శక్తి. ఇట్టి మహనీయుడు తన స్థూల శరీరాన్ని వీడి, సమాజ ఉద్ధరణ దిశగా మరిన్ని పనుల చేపట్టుటకై ఆ సూర్యునిలో, ఆ సవితా శక్తిలో విలీనమైపోయారు, తద్వారా ఏకీకృతమై పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ, వందనీయ మాతాజీల దివ్యాత్మలో సమ్మిళితమై ఒకే దివ్యాత్మగా రూపుదాల్చారు. మాష్టారిగారిని ఒక శక్తి సమన్విత వ్యక్తిలా చూడక, ఒక జ్ఞానిలా, ఒక ప్రేమస్వరూపునిలా, వివేకానికి మారుపేరులా చూడాలన్నారు. తన వారు తిన్న పిదపనే తాను తినేవారు, తనవారిని తొలుత ఆసీనులగావించి తదుపరి ఆయన ఆసీనులయ్యేవారు – నేడు మనకు తెలిసిన వివిధ ఆధ్యాత్మిక సంస్థలను ఒకే వేదికపైకి తెచ్చి, వారి మధ్య గల సారూప్యతలను విడమరచి, ప్రజలకు తెలియజెప్పి, అన్నింటి లక్ష్యమొక్కటే – "అదే మానవుని దేవమానవునిగా చేయుట", దారులేవేరు అని తెలుపుచూ, ప్రజలను ఏకత్రాటిపై నడిపిస్తూ ప్రేమాను రాగాలతో జీవించేలా ప్రబోధించారు. వీరి ఆలోచనలను, మార్గదర్శకాలను ప్రజలకందిస్తూ, మనమంతా కలసికట్టుగా ఆ మార్గంలో నడచుటే అసలైన నివాళి, శ్రద్ధాంజలి అన్నారు.

**శ్రీ మారెళ్ళ విశ్వనాథ్:** కాశీలో విద్యనభ్యసించెడి కాలంలో, మాష్టారుగారు 33 మంది గురువుల వద్ద ఆధ్యాత్మిక మెళకువలను, సాధనలను అభ్యసించారు. 34వ గురువుగా పండిత శ్రీరామశర్మగారిని ఎంచుకొని, వీరిని మించిన గురువు లేరని నిశ్చయించుకొని, గురువు అన్వేషణను నిలిపివేసి, తమ ఆఖరి శ్వాసవరకు తన అంతిమ గురువైన శ్రీరామశర్మగారి బోధనలను, ఆంధ్రప్రదేశ్‌లో, దక్షిణభారతావనిలో ఇంటింటికి చేర్చే గురుతర బాధ్యతను అత్యంత శ్రద్ధాసక్తులతో నిర్వర్తించారు. కావున మనమంతా వారికోరిక మరియు లక్ష్యానుసారం, శాంతికుంజ్‌తో అనుసంధానమై, శాంతికుంజ్ కార్యక్రమాలను పూర్తి సమర్పణాభావంతో చెయ్యాలి అన్నారు.

**శ్రీ సీతారాముడు, భీమవరం:** పూజ్య రామకృష్ణ గురుదేవులు బీజాలు నాటారు – వానికి మనం నీరు, ఎరువు అందించి పెంచి పెద్దవానిని చేసి భావితరాలకు అందించాలి. ఇదే మాష్టారికి నిజమైన నివాళి అని అన్నారు.

**శ్రీమతి రాజ్యలక్ష్మి:** శ్రీరామకృష్ణ మాష్టారు పరమ గురువుల దీర్ఘ ప్రణాళికలో భాగంగా భూమిపై మానవ శరీరాన్ని ధరించి, "భూమిపై స్వర్గావతరణ అనెడి లక్ష్యాన్ని" చేబూనారు. దీనికై అనేకానేక సాధనలు, జ్ఞానాన్ని మనకు అందించి మనల శక్తిమంతులగావించారు. ఆధ్యాత్మిక విజ్ఞానము కూడా ఒక శాస్త్రమేనని, తన ఆచరణద్వారా నిరూపణ గావించారు. దీనికై పలు ఆశ్రమాలను స్థాపింపజేశారు, వానిలో ఈ విద్యను నేర్పించుటకై విధి విధానాలకు రూపకల్పన చేశారు. తన గురుదేవులైన శ్రీరామశర్మ ఆచార్య బ్రహ్మయజ్ఞాలు పెట్టించి 1990లో తన స్థూల శరీరాన్ని విడువగా శ్రీరామకృష్ణ మాష్టారు ఆధ్యాత్మిక విస్ఫోటన గావించుటకై తన స్థూల శరీరాన్ని విడచారు. మనమంతా స్వాధ్యాయ, సత్సంగాలు, సేవల ద్వారా ఆయనకు శ్రద్ధాంజలి ఘటించుట ఉత్తమం అని అన్నారు.

**శ్రీమతి మాధురి, బెంగుళూరు:** మహనీయులు, మహా పురుషులు తమ భౌతిక దర్శన భాగ్యంతోనే జీవులను పరిణామ క్రమంలో ముందుకు తీసికొని వెళతారు. అదేవిధంగా మాష్టారు తన దర్శన భాగ్యంతోనే అనేక మందిని పరిణామక్రమంలో ఎదిగేలా చేశారు. అన్ని ఆధ్యాత్మిక దారులను మనం ఆకళింపు చేసికొని మనలో ఇముడ్చుకొని / వానిలో మనం ఇమిడేలా

ఏకాగ్రత లేని చదువు చదివినా ఒకటే చదవకపోయినా ఒకటే

మనల తీర్చిదిద్దారు. మాస్టర్ సి.వి.వి., భగవాన్ రమణ మహర్షి, మేడమ్ బ్లావట్స్కీ, మహర్షి అరవిందులు ఎందరినో మనకు పరిచయం చేశారు. అంశ, సమయదానాలు నేర్పి నాటు కోసుకో అని ప్రబోధించి మనం తరించుటకై సులువైన మార్గాన్ని అందించారు. ఆత్మనిర్మాణం ద్వారా పరివార్ నిర్మాణం తద్వారా సమాజం నిర్మాణం జరగాలి. మనమంతా వారికి ప్రతిబింబాలుగా మారి ఆ మహనీయుడు మనల చూచి గర్వపడేలా మనం బ్రతకాలి అని ఉద్బోధించారు - ఇదే నిజమైన శ్రద్ధాంజలి అన్నారు.

**శ్రీ పేరిశాస్త్రి, నర్సరావుపేట:** మాస్టారుగారు తరచు సభలలో "పేరిశాస్త్రి నాకు లంచం ఇవ్వు" అని మరీ అడిగి తనకు ఇష్టమైన పాటను పాడించుకొనేవారు - అదే పాట "ఎంత నోము నోచినాము మేమని ....." అనే పాటను సుమధురంగా పాడారు శ్రీ శాస్త్రిగారు. లక్ష్యం ఉన్న ప్రాణి మరణించదు - లక్ష్యాన్ని పూర్తిగావిస్తూ తన ఉనికిని శాశ్వతం చేసుకుంటుంది అన్నారు. కావున మాస్టారి లక్ష్యాలే మన లక్ష్యాలుగా మలచుకొని మనమంతా ద్విగుణీకృత ఉత్సాహంతో పని చేయండి అని ఉద్బోధించారు.

**శ్రీమతి విజయశ్రీ:** "ఓజోన్ లేయరులో రంధ్రం పడింది. మానవ ఆలోచనా విధానంలో వచ్చిన మార్పే దీనికి కారణం. మానవోత్తములు కనుమరుగౌతారు. కాని మానవజాతి ఉంటుంది. జాతి, మత, వర్ణ, వర్గ, కులరహితంగా గాయత్రీ మంత్రాన్ని విశ్వవ్యాపితం గావించండి. పృథ్వీపైన సూర్య కేంద్రంగా, సవితాశక్తి కేంద్రంగా బీజాలను నాటారు. పరిణామ క్రమంలో ముందుకు పోవుటయే మనందరి లక్ష్యం - సర్వమతాలను, సర్వ గురుసత్తాను ఏకీకృతం గావించి, ఒకే మతం, ఒకే భాష, ఒకే విశ్వం కావాలి" అని నొక్కి వక్కాణించారు. శ్రీరామకృష్ణ గురుదేవులు. దీనిని నిజం చేయుటకై మనమంతా కలిసి పనిచేద్దాం అన్నారు.

**శ్రీ సీతారామ్:** శ్రీరామకృష్ణ మాస్టారు అత్యంత ఉన్నత స్థాయియైన సిరీస్ నక్షత్రం నుండి అఖండ గురుసత్తా కోరిక మేరకు, మానవజన్మను పొంది మన మధ్య నడయాడారు. ఒక ప్రత్యేక పనిని పూర్తిచేయుటకై మాత్రమే సిరీస్ నక్షత్రం నుండి దివ్యాత్మలు జన్మతీసికుంటాయి అన్నారు.

సభనుద్దేశించి శ్రీ ఘటకాల మల్లిఖార్జునరావు, శ్రీ అంకారావు, శ్రీ కె.టి.నాయుడు, శ్రీమతి భువన, శ్రీమతి మునిలక్ష్మి, శ్రీ టి.వి.ఎస్.నాగేశ్వరరావు, శ్రీ మణికుమార్, శ్రీమతి రమణ కుమారి, డా॥ వెంకటేశ్వరరావు, శ్రీమతి విజయా విశ్వనాథ్, శ్రీ వెంకటేశులు, శ్రీమతి గౌతమి మున్నగు వారు శ్రద్ధాంజలి ఘటించారు.

పరమపూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్య, పరమ వందనీయ మాతా భగవతీదేవిశర్మల మానస పుత్రులైన పరమ పూజ్యులు డా॥మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారికి శ్రద్ధాంజలి ఈ క్రింది గాయత్రీ పరివార్ కేంద్రాలలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు.

### గాయత్రీ చేతనాకేంద్రం, హైదరాబాద్‌లో

2014 జులై 6వ తేదిన ఆదివారము ఉదయం 10.30 గం॥లకు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారిగారి శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని శ్రీ అశ్విని సుబ్బారావు మరియు శ్రీ మారెళ్ళ కామరాజుగార్ల సారథ్యంలో నిర్వహించారు. శ్రీ మాస్టారుగారు గొప్ప సాధకుడు, పవిత్రాత్మ అని చెప్పుచూ, వారు గాయత్రీ వ్యాప్తికై ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో అందించిన సేవలను కొనియాడుచూ శ్రద్ధాంజలి ఘటించారు. పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారి సేవలను వారివలన పరిజనులు వారి నిత్య జీవితాలలో పొందిన లాభాలను, జ్ఞప్తికి తెచ్చుకొని చెమర్చిన కన్నులతో శ్రద్ధాంజలి ఘటించారు. "పూజ్యులు మాస్టారు వారి స్థూల శరీరాన్ని వీడి ఆ మహాచైతన్యంలో లీనమై విశ్వవ్యాపితమైనారు" అని శాంతికుంజ్ అధినేత డా॥ ప్రణవ పండ్యాగారు తెలిపినట్లు శ్రీ మారెళ్ళ విశ్వనాథ్‌గారు సభకు తెలియజేశారు. సభలో ప్రముఖ కార్యకర్తలైన శ్రీ విఠల్, శ్రీ హనుమంతరెడ్డి, శ్రీ రత్నాకర్, శ్రీమతి భానుమతి, శ్రీమతి విజయా విశ్వనాథ్‌గార్లు, మాస్టారి గారితో తమకు గల అనుభవాలను తెలియజేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు.

పూజ్యులు మాస్టారి ఆశయాలు 1) ఆంధ్రప్రదేశ్ గాయత్రీ ప్రదేశ్ కావాలని, 2) లక్షమంది గాయత్రీ పరివార్ కావాలని 3) యుగశక్తి గాయత్రీ మాసపత్రిక చందాదారుల సంఖ్య లక్షకు మించాలని" మనమంతా వీనిని నెరవేర్చుటకై అవిరళ కృషి చేయాలని ఉద్బోధించుట జరిగింది.

### గుంటూరు జిల్లాలో

**మంగళగిరి:** గాయత్రీ పరివార్ కార్యాలయంలో 2014 జులై 6వ తేదిన ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ

**ఓరిమిని ఎప్పుడూ కోల్పోవద్దు**

ఐ.వి.తాతారావు, భోజనపల్లి ప్రసాద్, కోటేశ్వరరావు మరియు బి.ఎల్.ఎన్. మూర్తి మున్నగువారు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

**శ్రీకృష్ణానంద ఆశ్రమం-ఎర్రబాలెం:** 2014 జులై 8వ తేదిన శ్రీ డి.వి.ఎన్.బి. విశ్వనాథ్‌గారి సారథ్యంలో, శ్రీ శర్మగారి అధ్యక్షతన డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణమాష్టారికి శ్రద్ధాంజలి ఘటించారు. గాయత్రీవ్యాప్తికై మాష్టారు చేసిన మార్గదర్శనాన్ని, కృషిని పలువురు అభినందించుట జరిగింది. జడ్.పి.టి.సి. శ్రీమతి ఆకుల జయసత్య, బి.ఎల్.ఎన్.మూర్తి మున్నగువారు పాల్గొన్నారు.

**గాయత్రీ శక్తిపీఠము, నారాకోడూరు:** 2014 జులై 9వ తేదిన బుధవారము నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠములో డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి శ్రద్ధాంజలి కార్యక్రమం, పూజ్యులు శ్రీ డి.వి.ఎన్.బి. విశ్వనాథ్‌గారి సారథ్యంలో శ్రీ డి.వి.ఆర్. మూర్తి చీరాలవారి అధ్యక్షతన నిర్వహించబడినది. సభలో శ్రీ మణికుమార్, శ్రీ బి.ఎల్.ఎన్.మూర్తి, డా॥ శ్రీరామ్, శ్రీ బ్రహ్మారెడ్డి, శ్రీమతి మోరపాకలక్ష్మి, శ్రీ ప్రసాద్‌మున్నగు వార్లు, మాష్టారితో వారికి గల అనుభవాల వివరిస్తూ, శ్రద్ధాంజలి ఘటించుట జరిగింది. మాష్టారుగారు చూపిన మార్గంలో, వారి అడుగుజాడల్లో నడచుట మనందరి కర్తవ్యం. అదే వారికి మనం అర్పించెడి నిజమైన శ్రద్ధాంజలి అని శ్రీ డి.వి.ఎన్.బి. విశ్వనాథ్‌గారు వివరించుట జరిగింది.

"పూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీ మరియు రామకృష్ణ మాష్టారు ఒకే దివ్యాత్మకు చెందిన మూడు మానవాకృతులు" అని సభలో వివరించారు.

## విశాఖపట్నంలో

గాయత్రీ జయంతిని పురస్కరించుకొని జూన్ 7 మరియు 8 తేదీలలో 24 కుండముల గాయత్రీ యజ్ఞాన్ని గ్రీన్‌వ్యాలీ ప్లెజంట్ వ్యాలీ గృహ సముదాయంలో గాయత్రీ పరివార్ ప్రజ్ఞామహిళా మండలి, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. 7వ తేది కలశయాత్ర, దీపయజ్ఞం, 8వ తేది యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీ ధన్‌జీ భాయి పటేల్‌గారు దీప ప్రజ్వలన గావించగా, శ్రీ మహేష్ మరియు శ్రీ హేమచంద్ర రావుగార్లు సంయుక్తంగా యజ్ఞాన్ని నిర్వహించారు. దక్షిణ భారత గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులైన శ్రీ అశ్విని సుబ్బారావుగారిని, విశాఖపట్నం ప్రముఖ కార్యకర్తలలో ఒకరైన శ్రీమతి రూపవాణిగారు సభకు పరిచయం చేశారు. శ్రీ సుబ్బారావుగారు, గాయత్రీమంత్ర అర్థాన్ని, విశిష్టతను వివరిస్తూ, ఉపాసన, సాధన మరియు ఆరాధనల ప్రాశస్త్యాన్ని వివరించారు. సుమారు రూ. 4,000/- గురుదేవుల సాహిత్యం విక్రయించబడింది. పరిజనులు మంచి ప్రేరణను పొందారు.

## యలమంచిలో

విశాఖపట్నం జిల్లా యలమంచిలి గ్రామంలో 2014 జూన్ 5,6,7 తేదీలలో శ్రీమతి కె. నాగమణి గారి ఆధ్వర్యంలో సాధనా శిబిరం నిర్వహించబడింది. ఉదయం 5 గం॥ల నుండి సామూహిక జపం, ధ్యానం, జీవన దేవతా సాధన పద్ధతిలో నిర్వహించబడినది. గాయత్రీ జయంతి నాడు గాయత్రీ యజ్ఞం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది పరిజనులు పాల్గొన్నారు. శ్రీ కె.బసవరాజు, నాగేశ్వరరావుగార్లు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.

## శాంతికుంజ్‌లో తెలుగువారికి ప్రత్యేక శిబిరములు

***5 రోజుల శిబిరము (కొత్తవారికి):*** *గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లో 2014 అక్టోబరు 7 నుండి 11 వరకు 5 రోజుల వ్యక్తిత్వ పరిష్కారము (వ్యక్తి నిర్మాణం) పై శిక్షణా శిబిరము నిర్వహింపబడును. పాల్గొనదలచిన వారు 6వ తేది సాయంత్రానికి సౌత్ సెల్, శాంతికుంజ్, హరిద్వార్‌లో హాజరు కావాలి.*

***9 రోజుల కార్యకర్తల ప్రశిక్షణ శిబిరము:*** *అట్లే 2014 అక్టోబరు 12 నుండి 20 వరకు 9 రోజుల కార్యకర్తల ప్రశిక్షణ శిబిరం నిర్వహింపబడును. ఈ శిబిరంలో సమయ దానమిచ్చెడి కార్యకర్తలకు మాత్రమే ప్రవేశం లభించును.*

*ఆసక్తి ఉన్నవారు వెంటనే తమ పూర్తి చిరునామా వయస్సు, విద్యార్హత, వృత్తి మున్నగు వివరాలు తెలుపుతూ ఈ క్రింది చిరునామాకు తెలియపర్చి ముందస్తు అనుమతిని పొందవలసినదిగా కోరడమైనది.*

***వివరాలు పంపవలసిన చిరునామా:***
*సౌత్ సెల్, గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్,*
*హరిద్వార్-249411, ఉత్తరాఖండ్*
*ఫోన్: (01334) 260602, 260309*

**బాగా కష్టపడండి, సమయం వృథా చెయ్యకండి**